బుధవారం
10-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 350
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సెనెటర్‌పై ఆస్ట్రేలియా ప్రధాని ఆగ్రహం

మెల్‌బోర్న్: భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన సెనెటర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ సూచించారు. ఆస్ట్రేలియాలో కొంతకాలంగా వలసదారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున జరుగుతున్న నిరసనల నేపథ్యంలో ఆమె చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆస్ట్రేలియాలో పెరుగుతోన్న జీవనవ్యయాలకు భారత వలసదారులను నిందిస్తూ సెనెటర్ జసింటా ప్రిన్స్ విమర్శలు చేశారు. తమకు ఓట్లు పడేలా భారతీయ వలసదారులను రప్పిస్తున్నారని అల్బనీస్‌కు చెందిన ఆస్ట్రేలియన్ లేబర్ పార్టీ పైనా ఆమె వ్యాఖ్యలు చేశారు. 'ఆస్ట్రేలియాకు వలస వచ్చిన భారతీయుల సంఖ్య భారీగా ఉంది. ఆ సంఖ్యను లేబర్ పార్టీకి వచ్చిన ఓటింగ్‌లో మనం చూడొచ్చు' అని ప్రైస్ అన్నారు.

మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శిగా తిరుపతి

విశాలాంధ్ర-చింతూరు: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ నియమితులయ్యారు. నంబాల కేశవరావు మరణంతో కేంద్ర కార్యదర్శి పదవి ఖాళీగా ఉంది. ఆయన స్థానంలో తిరుపతిని నియమించారు. తిప్పిరి తిరుపతిపై రూ.కోటి నజరానా ఉంది. 2010లో దంతెవాడలో జరిగిన సీఆర్‌పీఎఫ్ జవాన్లపై దాడి ఘటనకు ఆయన ప్రాతినిధ్యం వహించారు. ఆపరేషన్ కగార్ పేరుతో దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ముందుకు సాగుతోంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో

- మిగతా 2 లో

రాష్ట్ర ప్రభుత్వానికి ఈ-కార్ రేస్ నివేదిక

విశాలాంధ్ర-హైదరాబాద్: ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన నివేదికను ఏసీబీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి ఇవ్వాలని నివేదిక పంపారు. ఇప్పటికే మాజీమంత్రి కేటీఆర్‌ను రెండుసార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్‌ను మూడుసార్లు ఏసీబీ ప్రశ్నించింది. అనుమతి రాగానే ఇద్దరిపై ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్టు సమాచారం. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై 2024 డిసెంబరు 18న ఏసీబీ కేసు నమోదు చేసింది. ఏ1గా కేటీఆర్,

- మిగతా 2 లో

ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం

ప్యారిస్: ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం ఏర్పడింది. విశ్వాస పరీక్షలో ప్రధాని ఫ్రాంకోయిస్ బేరౌ ఓటమి పాలయ్యారు. ఎంపీలు ఆయనకు వ్యతిరేకంగా ఓటేశారు. 364-194 ఓట్ల తేడాతో ప్రధాని ఫ్రాంకోయిస్ పరాజయం చవిచూశారు. దీంతో రెండేళ్లలోనే ఐదోసారి ప్రధానిని ఎన్నుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. తాజా రాజకీయ పరిణామాల నడుమ అధ్యక్షుడు ఇమ్మాన్యువల్ మాక్రన్ ఇబ్బందుల్లో పడ్డారు. కొత్త ప్రధానిని ఎన్నుకోవడంపై ఆయన మళ్లీ దృష్టి పెట్టాల్సి వస్తోంది. ప్రధాని బేరౌ మంగళవారం తన రాజీనామా సమర్పించారు. త్వరలోనే కొత్త ప్రధాని ప్రకటన ఉంటుందని అధ్యక్ష

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఎరువుల కొరత అస్సల్లేదని రైతులకు నచ్చజెప్పబోయాను సార్..దాంతో!

నేపాల్ ప్రధాని రాజీనామా

- దుబాయ్ పారిపోయేందుకు యత్నం
- అట్టుడుకుతున్న నేపాల్
- రణరంగాన్ని తలపిస్తున్న కాట్మండు
- మాజీ ప్రధాని భార్య సజీవదహనం
- ప్రభుత్వ భవనాలకు, ప్రధాని నివాసానికి నిప్పు
- ఆర్థిక మంత్రిని వీధుల్లో తరుముతూ కొట్టిన వైనం
- సైన్యం చేతుల్లోకి పాలన

కాట్మండు: హిమాలయ దేశం నేపాల్ యువత నిరసనలతో అట్టుడుకుతోంది. ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులే లక్ష్యంగా ఆందోళనకారులు రెచ్చిపోతున్నారు. కర్ఫ్యూ ఆంక్షలు, భద్రతా బలగాలను లెక్కచేయకుండా... ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతున్నారు. నేపాల్ ఆందోళనల్లో అత్యంత అమానుష ఘటన చోటుచేసుకుంది. నేపాల్ మాజీ ప్రధాన మంత్రి ఝలనాథ్ ఖానాల్ నివాసానికి నిరసనకారులు నిప్పటించడంతో మంటల్లో చిక్కుకున్న ఆయన భార్య రాజ్యలక్ష్మి చిత్రాకర్

- మిగతా 2 లో



ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్
విజయం

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికలో సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా పోటీచేసిన ఆయన ఇండియా ఐక్యసంఘటన అభ్యర్థి జస్టిస్ బీఎస్ సుదర్శన్‌రెడ్డిపై గెలుపొందారు. దీంతో భారత 17వ ఉపరాష్ట్రపతి అయ్యారు. రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా, సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు వచ్చాయి. 152 ఓట్ల ఆధిక్యంతో రాధాకృష్ణన్ విజయం సాధించినట్లు రాజ్యసభ సెక్రెటరీ ప్రకటించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల ఎలక్టోరల్ కాలేజ్‌లో మొత్తం 781 మంది సభ్యులు ఉండగా, అందులో 752 ఓట్లు పోల్ అయ్యాయి. అందులో 15 ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. 14మంది ఎంపీలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. వాస్తవానికి ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక కావాలంటే 377 ఓట్లు సాధించాలి. జగదీప్ ధన్కర్ రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవి భర్తీ చేసేందుకు మంగళవారం పోలింగ్ జరిగింది. మొదట ప్రధాని నరేంద్రమోదీ ఓటు వేశారు. తర్వాత వరుసగా కేంద్రమంత్రులు ఓటు వేశారు. ఈ ఎన్నికలో ఎంపీలకు గులాబీ రంగు బ్యాలెట్ పత్రాలు పంపిణీ చేయగా తమ

- మిగతా 2 లో

తెలంగాణ విద్యాభివృద్ధికి
అండగా నిలవండి

- కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం రేవంత్ వినతి
- రూ.30 వేల కోట్లతో యంగ్ ఇండియా స్కూళ్లు, ఇతర విద్యా సంస్థల అభివృద్ధి

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ విద్యా రంగంలో సమూల మార్పులు తేవడానికి తాము చేస్తున్న కృషికి మద్దతు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో సుమారు 90 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లోని పిల్లలకు కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎం వివరించారు. కేంద్ర ఆర్థిక మంత్రితో నార్త్ బ్లాక్‌లోని ఆమె కార్యాలయంలో ముఖ్యమంత్రి మంగళవారం

- మిగతా 2 లో

సర్కార్‌కు షాక్

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షపై హైకోర్టు సంచలన తీర్పు

- గతంలో ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ రద్దు
- పరీక్ష పేపర్ల పున: మూల్యాంకనానికి టీజీపీఎస్సీకి ఆదేశాలు

2 లో

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం/ఎర్రుపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. మంగళవారం మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అనేక అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఎర్రుపాలెం ఎస్సీ కాలనీలో రూ.45 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, పెద్ద గోపవరం గ్రామంలో రూ.12 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు, పెద్ద గోపవరం

- మిగతా 2 లో

కమ్యూనిజం అజరామరం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంలో ఘనంగా సురవరం సంస్మరణ సభ

2 లో

అతడి పిలుపే ప్రభంజనమైంది...

- యువత, విద్యార్థులు ఉప్పెనలా కదిలారు
- నేపాల్ ప్రభుత్వాన్నే గడగడలాడించిన 36 ఏళ్ల యువనేత సుడాన్ గురుంగ్

కాట్మండు: నేపాల్‌లో చెలరేగిన ఈ జెన్-జడ్ తిరుగుబాటుకు కారణం 36 ఏళ్ల సామాజిక కార్యకర్త సుడాన్ గురుంగ్. ప్రభుత్వం సోషల్ మీడియాపై నిషేధం విధించడంపై నేపాల్ యువత రగిలిపోతున్న వేళ వారి ఆందోళనకు, ఆగ్రహానికి ఒక రూపం, ఒక గొంతుక అయ్యాడు. కేవలం కొన్ని గంటల్లోనే దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, శక్తిమంతమైన ప్రభుత్వాన్ని సైతం దిగివచ్చేలా చేశాడు. నేపాల్‌లో చెలరేగిన ఈ జెన్-జడ్ తిరుగుబాటుకు సుడాన్ గురుంగ్ ఇప్పుడు ఒక అధినాయకుడిగా, చోదక శక్తిగా నిలిచాడు.

సామాన్య కార్యకర్త నుంచి ఉద్యమ నేతగా...

కొన్ని రోజుల క్రితం వరకు సుడాన్ గురుంగ్ పేరు నేపాల్ రాజకీయ వర్గాల్లో అంతగా పరిచయం లేదు. 'హామీ నేపాల్' (అంటే 'మేము నేపాల్') అనే స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడిగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండేవారు. కానీ, ఈ నెల 4న ప్రభుత్వం సోషల్ మీడియాపై ఉక్కుపాదం మోపడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడాన్ని నిరసిస్తూ వేలాది మంది యువత అయోమయంలో ఉన్నప్పుడు సుడాన్ గురుంగ్ వారికి ఒక స్పష్టమైన మార్గాన్ని చూపించారు. సుడాన్ గురుంగ్ ఇచ్చిన ఒక్క పిలుపు ఈ ఉద్యమానికి ఊపిరి పోసింది. ఆయన చాలా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. హింసకు తావులేకుండా, ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా తన ప్రణాళికను రచించారు. "మన నిరసన శాంతియుతంగా ఉండాలి. విద్యార్థులంతా తమ స్కూల్ యూనిఫామ్‌లలో, చేతిలో పుస్తకాలతో పార్లమెంట్ వద్దకు తరలిరండి. మన ఆయుధాలు అక్షరాలు, మన డిమాండ్ ప్రజాస్వామ్యం" అంటూ ఆయన ఇచ్చిన పిలుపు సామాజిక మాధ్యమాల్లో (నిషేధానికి ముందు) దావానలంలా వ్యాపించింది. ఈ పిలుపులోని నిబద్ధత, అహింసా మార్గం యువతను కదిలించింది. వేలాది మంది విద్యార్థులు తమ పాఠశాల దుస్తులతో, పుస్తకాలతో కాట్మండు వీధుల్లోకి రావడం ప్రభుత్వానికే కాదు, అంతర్జాతీయ మీడియాకు కూడా ఒక బలమైన సందేశాన్ని పంపింది.

'నెపో కిడ్' ప్రచారానికి సారథ్యం

సోషల్ మీడియా నిషేధం అనేది కేవలం పైకి కనిపించే కారణం మాత్రమే. అంతర్లీనంగా రాజకీయ నాయకుల పిల్లలు, వారి విలాసవంతమైన జీవితాలు, అవినీతిపై యువతలో తీవ్రమైన అసంతృప్తి ఉంది. 'నెపో కిడ్' (రాజకీయ పలుకుబడితో ఎదిగిన పిల్లలు) అనే హ్యాష్‌ట్యాగ్‌తో జరుగుతున్న ప్రచారానికి సుడాన్ గురుంగ్ తన గొంతును జోడించారు. "సామాన్యుడికి ఇంటర్నెట్ దూరం చేసి, మీ పిల్లలు మాత్రం విదేశాల్లో ప్రజాధనంతో సుఖపడతారా?" అని ఆయన సంధించిన ప్రశ్నలు యువతను నేరుగా తాకాయి. దీంతో ఈ ఉద్యమం కేవలం సోషల్ మీడియా పునరుద్ధరణకే పరిమితం కాకుండా, ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా ఆవిర్భవించింది. సుడాన్ గురుంగ్ సంప్రదాయ రాజకీయ నాయకుడిలా ఆవేశపూరిత ప్రసంగాలు చేయలేదు. నిశ్శబ్దంగా, దృఢంగా, స్పష్టమైన లక్ష్యంతో యువతను నడిపించారు. ఆయన విధానం వల్లనే అంతర్జాతీయంగా ఈ ఉద్యమానికి మద్దతు పెరిగింది.

పోలీసుల కాల్పుల తర్వాత కూడా శాంతియుతంగానే ఉండాలని, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని ఆయన పదే పదే విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం దిగివచ్చి నిషేధాన్ని ఎత్తివేసినప్పటికీ సుడాన్ గురుంగ్ నేపాల్ రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికారు. ఆయన ఇప్పుడు కేవలం ఒక ఎన్‌జీవో అధ్యక్షుడు కాదు, నేపాల్ యువత ఆకాంక్షలకు, వారి పోరాట స్ఫూర్తికి ఒక ప్రతీక. భవిష్యత్తులో ఆయన రాజకీయ ప్రవేశం చేస్తారా? లేదా? అనేది పక్కన పెడితే నేపాల్ యువతరం తమ హక్కుల కోసం ఎలా పోరాడాలో నేర్పిన ఆధునిక నాయకుడిగా మాత్రం చరిత్రలో నిలిచిపోతారు.

థాయ్ మాజీ ప్రధానికి సుప్రీంకోర్టు షాక్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాజీ ప్రధాన మంత్రి థక్సిన్ షినవత్రకు ఆ దేశ సుప్రీంకోర్టు షాకిచ్చింది. గతంలో ఓ కేసులో విధించిన శిక్షను షినవత్ర సరిగ్గా అనుభవించలేదనే కారణంతో మరోసారి ఏడాదిపాటు జైలుశిక్ష అనుభవించాలని ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది. 2006లో సైనిక తిరుగుబాటుతో థాయ్‌లాండ్ మాజీ ప్రధాని థక్సిన్ షినవత్ర పదవి నుంచి తప్పుకున్నారు. 2008లో రాజకీయ ప్రేరేపిత ఆరోపణలపై ఆయనకు జైలుశిక్ష విధించడంతో థక్సిన్ దేశం విడిచి వెళ్లారు. విదేశాల్లో ఉంటున్న షినవత్ర 15 ఏళ్ల తర్వాత 2023లో థాయ్‌లాండ్‌కు తిరిగొచ్చారు. ఆయన స్వదేశానికి తిరిగొచ్చిన తర్వాత గతంలో నమోదైన కేసులో భాగంగా ఆయనకు సుప్రీంకోర్టు 8 ఏళ్ల జైలుశిక్ష విధించింది. అయితే థక్సిన్ అనారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ దేశపు రాజు శిక్షను ఏడాదికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. శిక్షను తగ్గించినప్పటికీ వైద్య కారణాలతో థక్సిన్ ఒక్కరోజు కూడా జైల్లో శిక్ష అనుభవించకపోవడంతో అక్కడి ప్రజల్లో అనేక అనుమానాలు మొదలయ్యాయి. ఆయన నిజంగానే అనారోగ్యానికి గురయ్యారా లేదా శిక్ష నుంచి తప్పించుకోవడానికి తప్పుడు ఆధారాలు సృష్టించారా? అనే ప్రశ్నలు లేవనెత్తారు. ఈ అనుమానాల వేళ అప్పట్లో సరిగ్గా శిక్ష అనుభవించని కారణంగా థక్సిన్‌కు ఏడాదిపాటు జైలుశిక్ష విధిస్తూ సుప్రీంకోర్టు తాజా తీర్పు వెలువరించింది. కాగా కాంబోడియా సెనెట్ అధ్యక్షుడు హన్‌సేన్‌తో థాయ్‌లాండ్ ప్రధాని, థక్సిన్ కుమార్తె పేటోంగ్టార్న్ షినవత్ర ఫోన్‌లో మాట్లాడటం సంచలనం రేపడంతో ఇటీవల అక్కడి రాజ్యాంగ న్యాయస్థానం ఆమెను పదవి నుంచి తొలగించింది.

కమ్యూనిజం అజరామరం

విశాలాంధ్ర బ్యూరో-కొత్తగూడెం: భూమి ఉన్నంతవరకు, అసమానతలు, సమస్యలు ఉన్నంతవరకు కమ్యూనిజానికి అంతం లేదని, ప్రజల కోసం పాటుపడే కమ్యూనిస్టులకు మరణం ఉండదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీపీఐ అగ్ర నేత, జాతీయ మాజీ కార్యదర్శి అమరజీవి సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి వందలాది మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా సురవరం చిత్రపటానికి అనేక మంది పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా అధ్యక్షతన జరిగిన సభలో సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ సురవరం జీవితం తెరిచిన పుస్తకం లాంటిదన్నారు. సమాజంలో అరుదుగా కొందరే స్ఫూర్తిదాయకమైన వ్యక్తులు ఉంటారని అందులో సురవరం ఒకరిని కొనియాడారు. విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్ జెండాను చేతబూని విద్యారంగ సమస్యలపై గళమెత్తారని తెలిపారు. యువజన నాయకునిగా, వ్యవసాయ కార్మిక సంఘం నేతగా, సీపీఐ జాతీయ కార్యదర్శిగా సుధాకరరెడ్డి స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదిగిన ఘట్టాలను కూనంనేని వివరించారు. తొలినాళ్ల నుండి ప్రశ్నించే తత్వం ఉన్న ఆయన చట్ట సభల్లో ప్రజావ్యతిరేక విధానాలపై గళమెత్తి పాలకులను నిలదీసేవారని గుర్తు చేశారు. పార్లమెంటు సభ్యునిగా ఆయన నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి ఉద్యమించారని తెలిపారు. ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లడమే సుధాకర రెడ్డికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంత రావు మాట్లాడుతూ సురవరం ఉద్యమ స్ఫూర్తితో కమ్యూనిస్టులు, ముఖ్యంగా యువతరం నడుం బిగించి దేశ సమగ్రతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సురవరం మరణం అనంతరం ఆయన సతీమణి భర్త పేరు మీద ఉన్న నాలుగున్న ఎకరాల భూమిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రజలకు రాసి ఇచ్చేశారని తెలిపారు. ఆ స్థలంలో కళాశాల భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుని రూ.3 కోట్ల నిధులు కూడా విడుదల చేస్తూ జీవో తెచ్చిందని అన్నారు. సభలో పాల్గొన్న సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఎం జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారాయణ, మాస్ లైన్ నాయకులు అవునూరి మధు మట్లాడుతూ కమ్యూనిస్టు నేతలు చనిపోయినప్పటికీ వారి పోరాటాలు, స్ఫూర్తి నిరంతరం వారిని గుర్తు చేస్తూనే ఉంటాయన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో ఓనమాలు నేర్చుకున్న తాను నేడు ఎమ్మెల్యే స్థాయికి చేరానన్నారు. సురవరం సుధాకరరెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం ముందుకు సాగాలన్నారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ కమ్యూనిస్టులు ప్రజల కోసం బతికే వారని, వారిని చూస్తూ తాను రాజకీయాలు నేర్చుకున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర సమితి సభ్యులు కె.సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, చంద్రా నరేంద్ర, వై.ఉదయ్ భాస్కర్‌తో పాటు గ్రంథాయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, మల్లెల రామనాథం, టీడీపీ నాయకులు కనగాల రాములు, టీపీసీసీ సభ్యుడు నాగసీతారాములు, అల్ల మురళీ, కంచర్ల చంద్రశేఖర్, ముద్దా బిక్షంతో పాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సర్కార్‌కు షాక్

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సర్కార్‌కు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం షాక్ ఇచ్చింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష తీర్పు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రావడం గమనార్హం. మెయిన్స్ పరీక్షలో అవతకవలు జరిగాయని కొందరు అభ్యర్థులు వేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా గతంలో ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేసింది. మెయిన్స్ పరీక్ష పేపర్లను మళ్లీ మూల్యాంకనం చేయాలని టీజీపీఎస్సీని ఆదేశించింది. గ్రూప్-1 పరీక్షల మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని, పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ కొందరు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటన్నిటిని ఒకటిగా విచారించిన హైకోర్టు జులై 7న తీర్పును రిజర్వ్ చేసింది. విచారించిన హైకోర్టు రీవాల్యుయేషన్ ఆధారంగా ఫలితాలు వెల్లడించాలని సూచించింది. పునః మూల్యాంకనం సాధ్యం కాకపోతే ఎనిమిది నెలల్లో మళ్లీ మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని స్పష్టం చేసింది. దీంతో ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిన అభ్యర్థులకు చుక్కెదురైనట్లయింది. 2023 అక్టోబరు 21 నుంచి 27 వరకు జరిగిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 21 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆ పరీక్షల ఫలితాలను టీజీపీఎస్సీ ఈ ఏడాది మార్చి 10న విడుదల చేసింది. ఈ ఫలితాల్లో అభ్యర్థులకు వచ్చిన మార్కులపై అనేక అనుమానాలు తలెత్తాయి. పరీక్షల్లో జెల్ పెన్నులు వాడటం, కోఠి మహిళా కళాశాలలో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది ఎంపిక కావడం, తెలుగు మీడియం అభ్యర్థులు తక్కువగా ఎంపిక కావడం, కేవలం 2 సెంటర్ల నుంచే టాపర్లు ఉండటం తదితర అంశాలపై అనేక మంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఈ వివాదంపై సుదీర్ఘ విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు తన తీర్పును వాయిదా వేస్తున్నట్టు జులై 7న ప్రకటించారు. తాజాగా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా రీవాల్యుయేషన్ జరిపించాలని టీజీపీఎస్సీని ఆదేశిస్తూ తీర్పునిచ్చారు.

తెలంగాణ విద్యాభివృద్ధికి అండగా నిలవండి

(మొదటిపేజీ తరువాయి)

సమావేశమయ్యారు. రాష్ట్రంలోని 105 శాసనసభ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మించనున్నట్లు సీఎం తెలిపారు. ఇప్పటికే నాలుగు పాఠశాలల నిర్మాణ పనులు మొదలయ్యాయని... మిగతా పాఠశాలలకు సంబంధించి టెండర్లు ముగిశాయన్నారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు ఉంటారని... 2.70 లక్షల మంది విద్యార్థులకు ఈ పాఠశాలల్లో చదువుకునే అవకాశం లభిస్తుందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. అత్యాధునిక వసతులు, ల్యాబ్‌లు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని వివరించారు. జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఈ నిధుల సమీకరణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతించడంతో పాటు ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై చేస్తున్న వ్యయాన్ని పెట్టుబడిగా పరిగణించాలని కోరారు. గత ప్రభుత్వం ఇష్టారీతిగా అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చిందని... వాటి చెల్లింపు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారినందున రీస్ట్రక్చరింగ్‌కు అనుమతించాలని కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, పోరిక బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కేంద్ర ప్రాజెక్టులు, పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శిగా తిరుపతి

(మొదటిపేజీ తరువాయి)

వరుసగా ఎన్‌కౌంటర్లు చోటుచేసుకొంటున్నాయి. ఈ ఘటనల్లో వందలాది మంది మావోయిస్టులు మరణిస్తున్నారు. దీంతో మావోయిస్టులకు భారీగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. అలాంటి వేళ మావోయిస్టులు సైతం వెనకడుగు వేయడం లేదు. ఈ ఏడాది మే 21వ తేదీన జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ప్రధాన కార్యదర్శి ఎంపిక అనివార్యమైంది. మరోవైపు గెరిల్లా సుప్రీం లీడర్ మాడవి హిడ్మాకు బస్తర్ కమాండర్‌గా బాధ్యతలు అప్పగించింది. తిరుపతి స్వస్థలం తెలంగాణలోని కోరుట్ల అంబేద్కర్ నగర్. తిరుపతి 1983లో డిగ్రీ చదువుతున్న క్రమంలో రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ) భావజాలానికి ఆకర్షితుడయ్యాడు. ఆ సమయంలో విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణ నేపథ్యంలో అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. 1983 చివరిలో తిరుపతి అజ్ఞాతం లోకి వెళ్లారు. దళ సభ్యుడి స్థాయి నుంచి కమాం డర్‌గా పనిచేసి... అంచలంచెలుగా ఎదిగి మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడిగా, మిలిషియా దాడుల్లో కీలక వ్యూహకర్తగా తిరుపతి పేరు పొందారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ఈ-కార్ రేస్ నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

ఏ2గా ఐఏఎస్ అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి ఉన్నారు.

ఇది ఒక లొట్టపీసు కేసు: కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్ : నేను మళ్లీ చెబుతున్నా... ఫార్ములా-ఈ కేసు ఒక లొట్టపీసు కేసు' అని కేటీఆర్ అన్నారు. ఈ విషయంలో తాను ఇక్కడే ఉంటానని, ఎవరైనా వచ్చి లై డిటెక్టర్ పరీక్ష చేసుకోవచ్చని ఆయన సవాలు విసిరారు. హైదరాబాద్‌కు ఫార్ములా-ఈ రేసు తీసుకురావడానికి తాను అన్ని ప్రయత్నాలు చేశానని చెప్పారు. ఈ రేసు కోసం ప్రభుత్వం నుంచి రూ.46 కోట్లు ఇవ్వాలని తానే ఆదేశాలు ఇచ్చానని, ఆ డబ్బులు నేరుగా నిర్దేశిత ఖాతాలోకి చేరాయని తెలిపారు. ఇందులో రూపాయి కూడా ఎక్కడా తారుమారు కాలేదని, ప్రతి రూపాయికి లెక్క ఉందని. అలాంటప్పుడు అవినీతి ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రాసిక్యూషన్ చేసినా, ఛార్జిషీట్లు వేసినా ఏమీ చేయలేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, గ్యారెంటీలపై పోరాడుతామని ఈ సందర్భంగా కేటీఆర్ పునరుద్ఘాటించారు. 'సీఎం, నేను ఇద్దరం కలిసి లై డిటెక్టర్ పరీక్షను టీవీ ఛానల్ ముందు ఎదుర్కొందాం' అని సవాలు విసిరారు. గతంలో రూ.50 లక్షల నోట్ల కట్టలతో కెమెరాలకు అడ్డంగా దొరికిన రేవంత్ రెడ్డి గురించి కూడా ప్రజలు తెలుసుకుంటారని అన్నారు. ఈ పరీక్షతో ఎవరు ఏమిటో ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి ప్రభుత్వం ఫార్ములా-ఈ కేసును ముందుకు తెచ్చిందని కేటీఆర్ ఆరోపించారు. కానీ తాము మాత్రం ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయం పేర్కొంది. అయితే ఫ్రాన్స్ రాజ్యాంగం ప్రకారం కొత్త ప్రధానిని ఎంపిక చేసేవరకు తాత్కాలిక ప్రధానిగా బేరౌ కొనసాగే అవకాశాలు ఉన్నాయి. గత రెండేళ్లలో రెండుసార్లు తాత్కాలిక ప్రభుత్వం నడిచింది. ఫ్రాన్స్ పార్లమెంట్‌లో ప్రధాని విషయంలో భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ప్రధాని నియామకం మాక్రన్‌కు పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం ఆయనకు రెండు అవకాశాలే ఉన్నాయి. కొత్త ప్రధానిని నియమించడం లేదా జాతీయ అసెంబ్లీని రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.

గత రెండేళ్ల నుంచి సమస్యలు వస్తున్నా.. ఎన్నికలు నిర్వహించేందుకు మాత్రం దేశాధ్యక్షుడు మొగ్గు చూపలేదు. ఒకవేళ ఈసారి ఎన్నికలకు వెళ్తే... ప్రభుత్వాన్ని రద్దు చేసిన 29 నుంచి 49 రోజుల మధ్య ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.

ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ విజయం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాధాన్యం ప్రకారం ఆయా అభ్యర్థులకు ఎంపీలు ఓట్లు వేశారు. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, ఇతర సీనియర్‌నేతలు వరుసగా వచ్చి ఓటు వేశారు. సమాజ్‌వాదీపార్టీ అధినేత అఖిలేశ్‌యాదవ్ సహా ఇండియా ఐక్యసంఘటన నేతలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో 781మంది ఎంపీలు ఓటు వేసేందుకు అర్హులు కాగా... నలుగురు సభ్యులు ఉన్న బీఆర్ఎస్, ఏడుగురు సభ్యులు ఉన్న బీజేడీ, ఒక సభ్యుడు ఉన్న శిరోమణి అకాలీదళ్ ఓటింగ్‌లో పాల్గొనడం లేదని ముందే ప్రకటించాయి. ఈ పన్నెండు మందిని మినహాయిస్తే, ఉపరాష్ట్రపతి ఎన్నిక పోలింగ్‌లో 769 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ ఎన్నికలో గెలిచేందుకు 391 మంది సభ్యుల ఓట్లు అవసరం కాగా, అధికార ఎన్డీఏకి 425 మంది సభ్యులు ఉన్నారు. వైసీపీకి చెందిన 11మంది కూడా ఎన్డీఏకి మద్దతు తెలిపారు. మరోవైపు ప్రతిపక్ష కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 324 మంది ఎంపీల మద్దతు ఉంది. ఈ గణాంకాల ప్రకారం ఎన్డీఏ అభ్యర్థి గెలుపు లాంఛనమే అయింది. అయితే ఈ ఎన్నికలో ప్రతిపక్ష పార్టీలన్నీ చివరి వరకు కలిసికట్టుగా ఉండడం గమనార్హం.

రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతుల అభినందన

దేశ 17వ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన రాధాకృష్ణన్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ ప్రభృతులు అభినంద నలు తెలిపారు. ప్రజాజీవితంలో దశాబ్దాల తరబడి రాజకీ యంగా, పాలనాపరంగా తనకున్న అపార అనుభవం దేశ పురోగతికి ఎంతగానో ఉపయోగప డుతుందని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు.

బలమైన సంఘ్ నేపథ్యం....

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన చంద్రాపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ 1957 అక్టోబర్ 20న తమిళనాడులోని తిరుప్పూర్‌లో సి.కె.పొన్నుస్వామి-జానకి దంపతులకు జన్మించారు. బలమైన సంఘ్ నేపథ్యమున్న రాధాకృష్ణన్‌కు బీజేపీలో అత్యంత విధేయుడిగా పేరుంది. ధన్కర్ రాజీనామాతో ఏర్పడిన ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కోవడానికి బీజేపీ ఆయన్ను ఎంచుకొంది. ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో నిలిపి గెలిపించింది. ఆయన కాలేజీ సమయంలో టేబుల్ టెన్నిస్ ఛాంపియన్. బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌ను పూర్తి చేశారు. రాధాకృష్ణన్ 16 ఏళ్ల వయసులో తొలిసారి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), భారతీయ జన సంఘ్ సంస్థలతో కలిసి పనిచేశారు. ఆయన 1974లో సంఘ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా కూడా వ్యవహరించారు. ఆ తర్వాత బీజేపీలో చేరారు. 1998 లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడు కోయంబత్తూర్ స్థానం నుంచి బీజేపీ నుంచి విజయం సాధించారు. బీజేపీ తమిళనాడు శాఖకు ఆయన 2004, 2007లో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. మోదీ సర్కారు 2023లో జార్ఖండ్ గవర్నర్‌గా నియమించింది. దాదాపు ఏడాదిన్నర అక్కడ పనిచేసిన తర్వాత గతేడాది మార్చిలో తమిళసై సౌందర రాజన్ రాజీనామాతో తెలంగాణ, పుదుచ్చేరి బాధ్యతలను ఆయనకే అప్పగించారు. కానీ, జులైలో ఆయన్ను మహారాష్ట్రకు పూర్తి స్థాయి గవర్నర్‌గా నియమించారు. మిగిలిన రాష్ట్రాల బాధ్యతలను ఇతరులకు అప్పగించారు.

తీర్పును స్వీకరిస్తున్నా: జస్టిస్ సుదర్శన్ రెడ్డి

ఉపరాష్ట్రపతి ఫలితాలపై 'ఇండియా' అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి లేఖ విడుదల చేశారు.. ఉపరాష్ట్రపతి ఎన్నిక తీర్పును స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.. "ప్రజాస్వామ్య ప్రక్రియలపై ఉన్న గట్టి నమ్మకంతో స్వీకరిస్తున్నా.. ఈ ప్రయాణం నాకు గొప్ప గౌరవాన్ని, అనుభవాన్ని ఇచ్చింది.. న్యాయం, ప్రతీ వ్యక్తి గౌరవం కోసం నిలబడే అవకాశం అందించింది. నన్ను కూటమి అభ్యర్థిగా పెట్టిన ప్రతిపక్ష పార్టీల నేతలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.. ఉపాధ్యక్ష ఎన్నికలో విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్‌కు శుభా కాంక్షలు." అని లేఖలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

20 మంది ఎంపీల క్రాస్ ఓటింగ్...!

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మొత్తం 767 మంది ఎంపీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో 752 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. మిగతా15 ఓట్లు చెల్లనివిగా అధికారులు ప్రకటించారు. సీపీ రాధాకృష్ణన్ 452 మొదటి ప్రాధాన్యత ఓట్లు పొందగా, ఇండియా ఐక్యసంఘటన అభ్యర్థి బీ సుదర్శన్ రెడ్డికి 300 మొదటి ప్రాధాన్యత ఓట్లు మాత్రమే వచ్చాయి. కాగా ఇండియా కూటమికి చెందిన కనీసం 20 మంది ఎంపీలు క్రాస్ ఓటింగ్‌కి పాల్పడినట్లు భావిస్తున్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ ఊహించిన దానికంటే 25 ఓట్లు ఎక్కువగా పొందారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుదారుల ఓట్లు పూర్తి స్థాయిలో రాకపోవడం గమనార్హం.

నేపాల్ ప్రధాని రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

సజీవదహనమయ్యారు. రాజధాని కాట్మండులోని దల్లు ప్రాంతంలో ఝూలనాద్ నివాసంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. తీవ్ర గాయాలతో కీర్తిపూర్‌లోని ఆసుపత్రిలో చేరిన ఆమె చికిత్స పొందుతూ కన్నుమూసినట్టు కుటుంబ వర్గాలు తెలిపాయి. మరోపక్క సోషల్ మీడియాపై విధించిన నిషేధంతో మొదలైన నిరసనలు...అవినీతి వ్యతిరేక ఉద్యమంగా మారి దేశంలో అల్లకల్లోలం రేపాయి. కాట్మండు సహా వివిధ జిల్లాల్లో యువత, విద్యార్థులు నిరసన చేపట్టారు. ప్రజలు గుమిగూడకూడదని ఆంక్షలున్నా లెక్కచేయకుండా ఆందోళన చేపట్టారు. మాజీ ప్రధానులు, మంత్రుల ఇళ్లపై రాళ్ల దాడులు జరిగాయి. తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని కేపీ శర్మ ఓలి రాజీనామా చేశారు. రెండు రోజులుగా కొనసాగుతున్న హింసాత్మక ఘటనల్లో 20 మంది ప్రాణాలు కోల్పోగా, 400 మందికి పైగా గాయపడ్డారు. ఇందులో వందమంది పోలీసులు కూడా ఉన్నారు. సామాజిక మాధ్యమాలపై నిషేధం ఎత్తివేసినా నేపాల్‌లో ఆందోళనలు సద్దుమణగకపోవడంతో ప్రధాని ఓలి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి పదవికి రాజీనామా చేశారు. సోమవారం ఆందోళనల్లో మరణాలకు బాధ్యత వహిస్తూ కేపీ శర్మ ఓలి రాజీనామా చేయాలని, దేశాన్ని విడిచిపోవాలంటూ రెండో రోజూ మంగళవారం యువత రోడెక్కారు. అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. నిషేధాజ్ఞలు లెక్కచేయకుండా వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగారు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన భద్రతా బలగాలతో ఘర్షణకు దిగారు. ప్రధానిని దొంగగా పేర్కొంటూ కేపీ శర్మ దేశాన్ని వదిలిపోవాలని డిమాండ్ చేశారు. భక్తాపూర్‌లోని బాల్‌కోట్‌లో ఉన్న ఓలీ ప్రైవేటు నివాసానికి నిప్పు పెట్టారు. తర్వాత బల్వతార్‌లోని అధికారిక నివాసంలోకి చొచ్చుకెళ్లారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో కేపీ శర్మ ఓలీ సాయంత్రం ఆరు గంటలకు అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. పరిస్థితి చక్కదిద్దుదామని యత్నించిన ఓలి, చర్చలతోనే సంక్షోభం పరిష్కారమవుతుందని చెప్పారు. ఈలోపే తన అధికారిక నివాసంలోకి ఆందోళనకారులు ప్రవేశించడంతో ఆయన పదవికి రాజీనామా చేశారు. ఆందోళనకారుల దాడులు కేవలం ప్రధాని నివాసానికి, ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాలేదు. దేశ అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్ అధికారిక నివాసం, మాజీ ప్రధానులు పుష్ప కమల్ దహల్ (ప్రచండ), షేర్ బహదూర్ ద్యూబాల ఇళ్లు, పార్లమెంటు, సుప్రీంకోర్టు భవనాలపై దాడులు చేసి నిప్పుపెట్టారు. కాగా, ఆర్థిక మంత్రి బిష్ణు ప్రసాద్ పౌడేల్‌పై ఆందోళనకారులు దాడికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. నిరసనకారులు ఆయన్ను వీధుల్లో వెంబడించి కొట్టడం పరిస్థితి తీవ్రతకు అద్దం పట్టింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా ఆందోళనకారులు పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చారు. ఈ క్రమంలో ఆర్థిక మంత్రి బిష్ణు ప్రసాద్ పౌడేల్ వారికి కనిపించడంతో ఒక్కసారిగా చుట్టుముట్టారు. ఆయన వీధుల్లో పరుగెడుతుండగా ఆందోళనకారులు దాడి చేస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఆయన పరుగెడుతుండగా ఎదురుగా వచ్చిన ఒక యువకుడు ఎగిరి తన్నిన దృశ్యం కూడా వీడియోలో కనిపించింది. నిరసనకారుల నుంచి తప్పించుకోవడానికి మంత్రి మళ్లీ లేచి పరుగెత్తారు. ఈ దాడులు ఆర్థిక మంత్రికే పరిమితం కాలేదు. నేపాల్ మాజీ ప్రధానమంత్రి షేర్ బహదూర్ దేవుబా, ఆయన భార్య, ప్రస్తుత విదేశాంగ శాఖ మంత్రి అర్జు రాణా దేవుబాలను కూడా నిరసన కారులు లక్ష్యంగా చేసుకున్నారు. వీరిపై కూడా ఆందోళనకారులు దాడికి పాల్పడ్డారు. మంత్రులు పృథ్వీ సుబ్బ గురుంగ్, రమేశ్ లేఖక్, యూఎంఎల్ నేత మహేశ్ బాస్నెట్, నేపాలీ కాంగ్రెస్ నేత గగన్‌థాపాతో సహా కొందరు కీలక నేతల నివాసాలు, కార్యాలయాలు దాడులకు గురయ్యాయి. కాట్మండులోని నేపాలీ కాంగ్రెస్, యూఎంఎల్ పార్టీల ప్రధాన కార్యాలయాలను కూడా ఆందోళనకారులు తగులబెట్టారు. నిరసనల సందర్భంగా 20 మంది పౌరులు మృతి చెందడంతో పరిస్థితి తీవ్ర రూపం దాల్చింది. కాట్మండు రింగ్ రోడ్ పరిధిలో నిరవధిక కర్ఫ్యూను అమలు చేస్తున్నారు. కర్ఫ్యూ సమయంలో నిరసనలు, సమావేశాలు, సభలపై పూర్తి నిషేధం విధించినట్లు కాట్మండు జిల్లా అధికారి ఛబిలాల్ రిజాల్ వెల్లడించారు.

వరుసగా మంత్రుల రాజీనామాలు

వరుసగా రెండోరోజూ ఆందోళనలు కొనసాగడంతో నేపాల్ వ్యవసాయశాఖ మంత్రి రామ్‌నాథ్ అధికారి తన పదవికి రాజీనామా చేశారు. సోమవారం నిరసనకారుల పట్ల ప్రభుత్వం అనుసరించిన తీరును ఆయన ఖండించారు. ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం వల్ల 19 మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన విమర్శించారు. ఆరోగ్య, జనాభా శాఖ మంత్రి ప్రదీప్ పౌడ్యాల్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. ఇప్పటికే ఘర్షణలకు బాధ్యత వహిస్తూ నేపాల్ హోంమంత్రి రమేష్ లేఖక్ రాజీనామా చేశారు. యువత మళ్లీ ఘర్షణకు దిగడంతో ఉదయం 8 గంటల 30 నిమిషాల నుంచి కాట్మండూ, భక్తాపూర్, లలిత్‌పూర్ తదితర జిల్లాల్లో నిరవధిక కర్ఫ్యూ విధించారు. అయినా నిరసనకారులు విధ్వంసం కొనసాగించారు.

సైన్యం చేతుల్లోకి పాలన పగ్గాలు

మరోవైపు ప్రధాని పదవికి కేపీ శర్మ ఓలీ రాజీనామాతో నేపాల్ పాలన పగ్గాలు సైన్యం చేతుల్లోకి వెళ్లనున్నాయని తెలుస్తోంది. రాజీనామాకు ముందే కేపీ శర్మ ఓలీ నేపాల్ ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్డెల్‌తో మాట్లాడారు. దేశం విడిచి సురక్షితంగా వెళ్లిపోయేందుకు మిలిటరీ సహాయం కావాలని ఆయన అడిగినట్లు పేర్కొన్నాయి. ఓలి దుబాయ్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు వార్తలొచ్చాయి. అయితే ప్రధాని పదవికి రాజీనామా చేయాలని ఓలీకి ఆర్మీ చీఫ్ సూచించినట్లు తెలుస్తోంది. ఈ ఘర్షణలను సైన్యం అదుపులోకి తీసుకువస్తుందని పేర్కొన్నట్లు సమాచారం. ఓలి రాజీనామాతో మిలిటరీ రంగంలోకి దిగేందుకు సిద్ధమైంది. ఇదేసమయంలో త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేశారు. అన్ని విమానాలను రద్దు చేశారు. 300 మంది సైనికులను అక్కడ మోహరించారు. మంత్రులను వారి అధికారిక నివాసాల నుంచి సైనిక హెలికాప్టర్ల ద్వారా తరలిస్తున్నారు. కాట్మండూలోని ఆర్మీ బ్యారక్స్‌లోకి వీఐపీలను తరలించారు. కాగా , ప్రధాని రాజీనామా చేసినప్పటికీ, దేశంలో రాజకీయ అనిశ్చితి కొనసాగుతోంది. అధ్యక్షుడి అధ్వర్యంలో ప్రభుత్వం నడుస్తున్నా, త్వరలోనే అది కూడా కూలిపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు సైన్యం పాలన చేపట్టవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

గ్రామం ఎస్సీ కాలనీలో రూ.85 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, బుచ్చిరెడ్డి పాలెం గ్రామం ఎస్సీ కాలనీలో రూ.40 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, బనిగండ్లపాడు గ్రామం ఎస్సీ కాలనీలో కోటి 75 లక్షల రూపాయలతో నిర్మించ నున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, అయ్యవారిగూడెం ఎస్సీ కాలనీలో రూ.55 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, భీమవరం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ మధిర నియోజకవర్గ ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసుకునే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రజా ప్రభుత్వం ఆలోచిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు. మధ్యాహ్నం బనిగండ్లపాడులో భోజన విరామం అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి రెవెన్యూ, అటవీ, పంచాయతీ రాజ్, విద్యాశాఖ, ఆరోగ్య శాఖ, పర్యాటక శాఖ అధికారులతో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, వాటి పూర్తికి అధికారులు చేపట్టాల్సిన చర్యలు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఎర్రుపాలెం మండలంలో మామునూరు గ్రామ పరిధిలోని ఇనిద్రమ్మ చెరువును ఉప ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ లతో కలిసి ప్రత్యేకంగా ట్రాక్టర్ పై వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హస్త కళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్, డీపీఓ ఆశాలత, పంచాయతీ రాజ్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబు, ఎన్పీడీసీఎల్ ఎస్ఇ శ్రీనివాసాచారి, ఎర్రుపాలెం మండల తహసీల్దార్ ఎం.ఉషా శారద, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సురవరం సంస్మరణ సభకు ర్యాలీ

విశాలాంధ్ర - కొత్తగూడెం : సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు అమరజీవి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభకు పట్టణంలోని గాజులు రాజం బస్తీ 57వ డివిజన్ నుంచి మాజీ కౌన్సిలర్ సాహెరా బేగం ఆధ్వర్యంలో పెద్దఎత్తున సీపీఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్ ఆవరణలో ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సూరవరం సంస్మరణ సభను ఏర్పాటు చేయడం జరిగింది. సీపీఐ పార్టీ 3 టౌన్ ఏరియా కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ మహమ్మద్ యూసుఫ్, సాహెరా బేగం నేతృత్వంలో కొత్తగూడెం క్లబ్‌కు చేరుకొని స్వర్గీయ సురవరం అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి దామెర కుమార్, ధర్మయ్య, పిల్లి రామస్వామి, దీటి రాజా శ్రీనివాస్, రాయాలింగు, శివ కుమార్, సునిల్, దిలీప్, లాలయ్య, సరోజ, రాజకుమారి, అనూష, విజయ లక్ష్మి, రమా, స్వాతి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు మధ్యతరగతి కుటుంబాలకు మేలు

విశాలాంధ్ర - తుంగతుర్తి : జీఎస్టి తగ్గింపు మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని తుంగతుర్తి మండలం సింగల్ విండో డైరెక్టర్ ఎనగందుల రామచంద్ర హర్షం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించేలా ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయాన్ని చాలా మంచిది అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యవసర సరుకులు ఆహార పదార్థాలపై పన్నును 18%శాతం నుంచి 12% శాతానికి, 5% శాతం నుంచి 0% శాతం వారిగా పన్ను రేట్లు తగ్గించి సాధారణ ప్రజలపై పన్ను భారాన్ని తగ్గించడం ప్రధానిమోదీకి ఘనత దక్కిందన్నారు. ముఖ్యంగా మధ్యతరగతి మరియు కూలీ వర్గాలకు ఇది ఎంతో గాని ఉపయోగకరంగా మారుతుందని పేర్కొన్నారు దేశ అభివృద్ధి దిశగా మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా అనుకూల నిర్ణయాలను అభినందించారు.

సాయుధ పోరాట వార్షికోత్సవాలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్: ఈనెల 11 నుంచి 17 వరకు జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి పిలుపు నిచ్చారు. మంగవారం సీపీఐ మహబూబాద్ జిల్లా కార్యవర్గ, మండల కార్యదర్శుల సమావేశానికి వారి పెళ్లి వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సెప్టెంబర్ 11 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జిల్లా నలుమూలల జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాయుధ పోరాటంలో పాల్గొన్న వారసుల సన్మానించుకుని, స్తూపాల వద్ద ఘనంగా నివాళు లర్పించాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని బిజెపికి సంబంధం లేదని ,తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడింది కమ్యూనిస్టులే అన్నారు. సెప్టెంబర్ 11న పెరుమాండ్ల సంకీసలు ప్రారంభమై సెప్టెంబర్ 17న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సాయుధ పోరాట స్ఫూర్తి చేసినాం దగ్గర ముగుస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి అజయ్ సారధిరెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, నాయకులు వరి పెళ్లి వెంకన్న, పెరుగు కుమార్ ,రేష పల్లి నవీన్ ,చింతకుంట్ల వెంకన్న ,మామిండ్ల సాంబలక్ష్మి ,కట్లోజు పాండురంగ చారి ,నెల్లూరి నాగేశ్వరరావు ,తండ సందీప్, చొప్పరి శేఖర్, బైసా స్వామి, బందు మహేందర్, సారిక శ్రీను, జంపాల వెంకన్న, మారగాని బాలకృష్ణ ,తురక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సమ్మయ్యగౌడ్ పరామర్శ

విశాలాంధ్ర కే సముద్రం: జిల్లాలోని నెల్లికుదురు మండలం బొడ్లాడ గ్రామ తాజా మాజీ సర్పంచ్ మండ సుష్మ రాజగోపాల్‌గౌడ్ తండ్రి రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి జలగం వెంకన్న అకాల మరణం చెందగా వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి, వెంకన్న పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రగాఢ సానుభూతిని తెలిపి సుష్మ రాజగోపాల్ గౌడ్‌కి, వారి కుటుంబం ధైర్యంగా ఉండాలని గోప డివిజన్ అధ్యక్షులు చిలువేరి సమ్మయ్యగౌడ్ తెలిపారు. ఈ పరామర్శలో సీపీఎం రాష్ట్ర నాయకులు భిక్షమయ్య గౌడ్, దంపతులు,కేసముద్రం కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య, గౌడ్, మాజీ సర్పంచ్ నరేందర్ పాల్గొన్నారు.

ఫర్టీ లైజర్ దుకాణల పైన చర్యలు తీసుకోండి : సీపీఐ

విశాలాంధ్ర బ్యూరోపెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా మండలంలో వివిధ ఫర్టీ లైజర్ దుకాణాల్లో కృత్రిమ యూరియా కొరత సృటించి రైతులని తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తున్నారని . పెద్దపల్లి సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు బాలసాని లెనిన్ అన్నారు. మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారికికి వినతిపత్రం అందజేశారు అనంతరం మాట్లాడుతూ 290 దొరికే యూరియా బస్తాని కృత్రిమ యూరియా కొరత సృష్టిస్తూ బ్లాక్ లో 350 నుండి 450 వరకు అమ్ముతూ మళ్ళీ వేరొక దానికి లింక్ పెట్టి రైతుకు అవసరం లేని వాటిని కచ్చితంగా కొనుగోలు చేపిస్తూ వచ్చిన డబ్బు ని సొమ్ముచేసుకుంటున్నారు అని మండిపడ్డారు. అనేకమైన ఫర్టీ లైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలు అమ్మిన పలు మార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని దీని వలన అనేక గ్రామల్లో చాలా మంది యువ రైతులకు పంట నష్టం వాటిల్లిందని తక్షణమే అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో విచారణ జరిపించి రైతులను మోసం చేసే ఫర్టీ లైజర్ దుకాణ సముదాయలపైన చర్యలు తీసుకోవాలన్నారు.

కాళోజీ జయంతి

విశాలాంధ్ర - భద్రాచలం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజాకవి కాళోజీ 111వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జాన్ మిల్టన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలుగు విభాగం, సాహితీ సాంస్కృతిక విభాగ అధిపతి డాక్టర్ కపిలభారతి అధ్యక్షతనకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ మిల్టన్ మాట్లాడుతూ కాళోజీ ఒక వ్యక్తి కాదని ఒక విస్తృత శక్తి అన్నారు. అక్షరాన్ని ఆయుధంగా ప్రయోగించిన అసలు సిసలు తెలంగాణ కవి కాళోజీ అన్నారు. కాళోజి తండ్రి మహారాష్ట్రకు చెందిన వారు కాగా తల్లి కన్నడ ప్రాంతం చెందినవారన్నారు. అయినప్పటికీ ఆయన మాత్రం అచ్చ తెలంగాణ బిడ్డగా బ్రతికారని గుర్తు చేసారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ కాళోజి ప్రత్యక్షమైయ్యే వారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందూరి రాంబాబు తదితరులు పాల్గొనగా యువత సామాజిక బాధ్యత అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి : కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : పేదవర్గాలకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం ఆయన కొత్తగూడెం, పాల్వంచ మండలాల్లో సియం రిలీఫ్ ఫండ్, షాదీ ముకబారక్, కల్యాణ లక్ష్మి పథకాల చెక్కులు అబ్ధిదారులకు పంపిణీ చేసారు. ఈ పథకాలపై పేదలకు, పల్లె ప్రజలకు ఇంకా అవగాహన కల్పించాలన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరం లాంటిదన్నారు. ఐతే ఫండ్ మంజూరులో భారీ స్థాయిలో కోతవిధించి తక్కువ మొత్తంలో మంజూరి చేయడం సరైంది కాదన్నారు. ఆర్థికంగా లేని వారు వైద్యం చేయించుకున్న సందర్భంలో ఉదాహరణకు రూ. లక్ష ఖర్చు అయితే ప్రభుత్వం కేవలం రూ. 30 నుంచి రూ 50 వేలు అందించడం కాకుండా 75 శాతమైన చెల్లించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎన్నికల్లో ప్రకటించినట్లు షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి పథకాల్లో తులం బంగారం సత్వరమే అమలు చెయ్యాలన్నారు. కొత్తగూడెంలో రూ 44. 28 లక్షలు, పాల్వంచలో రూ 96 లక్షల పైన లబ్ధిదారులకు చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, లక్ష్మీపతి, దారా శ్రీనివాస్, పాల్వంచ లో తహసిల్దార్ ద్వారా ప్రసాద్, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి డి సి ఎం ఎస్ చైర్మన్ నాగేశ్వరరావు అనంత రాములు నరాటి ప్రసాద్ సాయి బాబా పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నేచర్ పార్క్‌ను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - ఇల్లందు : ఊరగుట్ట నేచర్ పార్క్‌ను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఇల్లందు మండలం సుభాష్ నగర్ లోని ఊర గుట్ట నేచర్ పార్క్ ను మంగళవారం ఆయన సందర్శించి పార్క్ అభివృద్ధి కి భవిష్యత్తులో చేపట్టవలసిన కార్యక్రమాలను సంభంధిత శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. ఊరగుట్ట నేచర్ పార్క్ జిల్లాలో సహజసిద్ధమైన అద్భుత సౌందర్యాన్ని కలిగిన ప్రదేశమన్నారు. దీన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే, రాష్ట్ర స్థాయిలో పర్యాటకులను ఆకర్షించే అవకాశముందన్నారు. పార్క్ లో ట్రెక్కింగ్ మార్గాలు, జిప్ లైన్, ప్లే ఏరియా, అడ్వెంచర్ స్పోర్ట్స్ వంటి వినోదాత్మక వసతులు ఏర్పాటు చేయడానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇక్కడ జిల్లాలో పర్యాటక హబ్ గా తీర్చిదిద్దడం లక్ష్యమన్నారు. పరిశీలనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ రవి, ఎఫ్ డి ఓ కరుణాకర చారి, పంచాయతీ రాజ్ ఈ ఈ శ్రీనివాస్, జిల్లా క్రీడా శాఖ అధికారి పరందామ రెడ్డి, ఏం పి డి ఓ ధన్సింగ్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

విశాలాంధ్ర - బూర్గంపాడు : ఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థినిలకు అందించిన సైకిళ్లు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. మంగళవారం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాఠశాలలు దూరంగా వున్న విద్యార్థులకు సైకిళ్లు ఎంతగానో ఉపయోగపడుతాయాన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో నడిచి వెళ్లే సమస్య విద్యార్థులకు ఎక్కువగా ఉంటుందన్నారు. అనంతరం ఆయన బూర్గంపాడు మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే పాయం ప్రారంభించారు. రూ. 38 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ ట్యాంక్ స్థానిక ప్రజలకు మంచినీటి సమస్యను తీర్చడానికి ఉపయోగపడుతుందన్నారు. నీటి సమస్య తీరడంతో స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలొ ఐటిసి అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధపోరాట వారోత్సవాలు జయప్రదం చేయండి : పల్లా

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం దొరలు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఈనెల 11 నుంచి 17 వరకు ఘనంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి పిలుపు నిచ్చారు మంగళవారం దేవరకొండ పర్వత రెడ్డి భవన్లో జరిగిన నియోజకవర్గ సీపీఐ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో నైజాంకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం భారతదేశ చరిత్రలో స్వర్ణ అక్షరాలతో లికించితగిందని నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటంగా చిత్రీకరించడం విచారకరమని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహోత్తరమైన పోరాటాన్ని అవమానపరిచి సాయుధ పోరాట యోధులకు రావలసిన పింఛన్లను ఎత్తివేసిన హీనమైన చరిత్ర ఉందని విమర్శించారు. సెప్టెంబర్ 17 పేరుతో బీజేపీ అమరవీరులను స్మరించుకోవడం సిగ్గుచేటని రాష్ట్రంలో యూరియా కొరత అత్యధికంగా ఉందని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపై కక్షగట్టి రాష్ట్రానికి రావలసిన యూరియా కోటాను ఇవ్వకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. రైతుల వ్యవసాయానికి సరిపడా యూరియాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈనెల 10న నల్లగొండలో జరిగే సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ ను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తూము బుచ్చిరెడ్డి, దేప సుదర్శన్ రెడ్డి, మైనుద్దీన్, కనకచారి, వెంకటేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి, జయరాములు, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు

ప్రజాకవి కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, కొమరం భీం : సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తన నవలల ద్వారా తెలియజేసిన ప్రజా కవి కాళోజీ నారాయణరావు ఆశయాలను కొనసాగిద్దామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలలో ఎస్.పి. కాంతిలాల్ సుభాష్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ లతో కలిసి హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజి జయంతిని ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించడం సంతోషంగా ఉందని, మహాకవి కాళోజి ఆశయాల సాధనకు అందరం సమిష్టిగా కృషిచేసి జిల్లాను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని తెలిపారు.

కాళోజీ సేవలు చిరస్మరణీయం : సీఈఓ

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : పుట్టుక నీది - చావు నీది, బ్రతుకంత దేశానిది అంటూ ప్రజల హృదయాల్లో నిలిచిన కవిత్వంతో తెలంగాణ ఉద్యమాన్ని ఉద్దీపన చేసి ప్రజలను మమేకం చేసిన మహాకవి కాళోజి నారాయణరావు జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాళోజి నారాయణరావు 111వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జెడ్పీ సీఈఓ వి.వి. అప్పారావు నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాళోజి నారాయణరావు తెలంగాణ భాషా, సాంస్కృతిక రంగాలలో చేసిన సేవలు ప్రత్యేకమైనవని కొనియాడారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా, స్వాతంత్ర ఉద్యమంలో, అలాగే విద్యార్థి సంఘాల పోరాటాల్లో కీలకంగా పని చేసి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని చెప్పారు. బూర్గుల రామకృష్ణారావు, జమలాపురం కేశవరావు, పీవీ నరసింహారావుతో పాటు ఇతర నేతలతో కలిసి ప్రజల హక్కుల కోసం కృషి చేశారని పేర్కొన్నారు. కాళోజి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సామాజిక సంక్షేమానికి, భాషాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి టి. నరసింహులు, డిపిఓ యాదగిరి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శంకర్ నాయక్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి దయానంద రాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఏ కార్యాలయంలో

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ఏటూరునాగారం ఐటిడిఏ కార్యాలయంలో మంగళవారం కాళోజి నారాయణ జయంతి సందర్భంగా, అయన చిత్రపటంకు, ఏటూరు నాగారం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వై. పోచం పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డిడి వై. పోచం మాట్లాడుతూ ఏటూరునాగారం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.వో.(వో.డి) యం. సురేష్ బాబు,ఆఫీస్ మేనేజర్ వి. శ్రీనివాస్ డిప్యుటీ తాహసీల్దార్ (ఆర్ఓ ఆఫ్ఆర్) వై. కిషోర్, ఇంజనీరింగ్ విభాగం డిఏఓ శివ ప్రసాద్, పిసా కోఆర్డినేటర్స్ కె. ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత నిరసనలపై పోలీసు కేసులా...? : సీపీఐ

విశాలాంధ్ర ఖమ్మం : శాంతియుతంగా తమ నిరసనను లేదా డిమాండ్స్ ప్రభుత్వానికి తెలియజేస్తే పోలీసులు కేసులు నమోదు. చేయడం ఆక్షేపణీయమని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం జిల్లా సమితి తెలిపింది. సిపిఐ జిల్లా సమితి పక్షాన జిల్లా కార్యదర్శి దండి సురేష్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శాంతియుతంగా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేయడం జరిగిందని ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరామని ఈ సందర్భంగా ప్రజలకు కానీ అధికార కార్యక్రమాలకు కానీ ఎటువంటి అంతరాయం కలిగించ లేదని సురేష్ తెలిపారు. ఆందోళన చేస్తున్న సమయంలో కలెక్టరేట్‌కు వచ్చిపోయే సామాన్య ప్రజలకు, అధికారులకు, ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకం కలిగించలేదని కలెక్టరేట్ ఎదుట గల రెండు గేట్లలో ఒక గేటు తీసే ఉన్నా తమ కార్యకర్తలు ఎవరు లోపలికి వెళ్లే ప్రయత్నం చేయలేదన్నారు. రాష్ట్ర పిలుపు కావడం, పోలీస్ అధికారులు తమ నాయకత్వాన్ని కార్యక్రమ సమాచారం అడిగినప్పుడు వివరాలు తెలపడంతో పాటు శాంతియుతంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎక్కడ ఎవరికి ఇబ్బంది కలగనివ్వమని తెలిపి అదేవిధంగా ఆందోళన చేస్తే ఎందుకు పోలీసులు కేసులు నమోదు చేశారని ఆయన ప్రశ్నించారు. ఖమ్మం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్న వారిపై కేసులు నమోదు చేయడం మానుకోవాలన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు జరిగాయని ఒక ఖమ్మంలోనే కేసులు నమోదు చేయడం శోచనీయమన్నారు. ఖమ్మం పోలీసులు తీరు మార్చుకోకుంటే ప్రజల పక్షాన తగు రీతిలో -స్పందించక తప్పదన్నారు. ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయడం కమ్యూనిస్టులుగా మా బాధ్యత అని కేసులకు, నిర్బంధాలకు భయపడి రాజీపడబోమని సురేష్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయని తెలిపారు.

న్యాయవాది జహీర్ అలీపై దాడి అమానుషం :ఐఎల్‌పిఏ

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ఖమ్మం జిల్లా కోర్టు సినియర్ న్యాయవాది జహిర్ ఆలీ పై హత్యాయత్నం దాడిని తీవ్రంగా ఖండిస్తు ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ జనపరెడ్డి గోపి కృష్ణ ఒక ప్రకటన చేశారు. జాహిర్ అలీ ఆఫిస్‌లో కొంతమంది దుండగులు దాడి చేసి హత్య చేసేందుకు కుట్ర పన్నారని విమర్శించారు. ఆయనపై భౌతికదాడి మొత్తం న్యావాదులపై జరిగిన దాడిగా అభివర్ణించారు. న్యాయవాదుల రక్షణ చట్టంను వెంటనే అమలులోకి తెవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి దుండగులను వెంటనే అరెస్టు చేయలని డిమాండ్ చేశారు. ఈ దాడిని ఖండించిన వారిలో ఐ.యల్.పి.ఏ భాధ్యులు న్యాయవాదులు సుంకర భానుప్రియ, ఎర్రపాటి కృష్ణ, మారపాక రమేష్, వల్లకొండ హరి, డి. సామంత్, మహమ్మద్ సాదిక్ పాషా, డి. రాధ కృష్ణా, అంకుష్ పాష, దేవేంద్ర వర కుమార్, బేబీ షామిలి, నీలివేణి, నందిని, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికే ఆది కర్మయోగి పథకం

విశాలాంధ్ర-కారేపల్లి : గిరిజన ప్రాంతాల అభివృద్ధి కొరకే కేంద్ర ప్రభుత్వం ఆది కర్మయోగి పథకం తీసుకవచ్చిందని దానిని గిరిజనులు సభివేగం చేసుకోవాలని సింగరేణి ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు.మంగళవారం కారేపల్లి హైస్కూల్‌లో జరిగిన అవగాహన సదస్సులో ఎంపీడీవో మాట్లాడుతూ గిరిజన సమాజం విద్య, ఆరోగ్యం,పోషకాహారం, జీవనోపాధిలో లోపాలను ఎదుర్కొంటున్నాయన్నారు.ఆ సమస్యలు రూపుమాపేందుకు లక్షలాది మంది శిక్షణ పొందిన కార్యకర్తల ద్వారా కృషి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్,హెల్త్ సూపర్‌వైజర్ సూర్యం, ఏఎల్‌వో ఎల్.రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మించాలి : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి–పెద్దపల్లి,సింగరేణి: ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం ఆయన ధర్మారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. పత్తిపాక గ్రామంలోని పల్లె దవాఖానా, అంగన్వాడి సెంటర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, మల్లాపూర్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్, బంజేరుపల్లిలోని ప్రాథమిక పాఠశాల, లంబాడి తండా లోని ప్రాథమిక పాఠశాల, ధర్మారం గెస్ట్ హౌస్, తహసిల్దార్ కార్యాలయం ఎంపీడీవో కార్యాలయం, నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, పత్తిపాక ఉన్నత పాఠశాలలో ర్యాంపు, అంతర్గత రోడ్డు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మల్లాపూర్ రెసిడెన్షియల్ స్కూల్ నందు వంట గది సెక్షన్ , డార్మెంటరీ మరమ్మత్తులు పూర్తి చేయాలని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం పరిశీలించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, నిరుపేదలకు అవసరమైతే మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయలు ముందస్తు రుణం అందజేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ధర్మారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, మండల పంచాయతీ అధికారి రమేష్, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజశేఖర్ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : స్థానిక ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఈవీఎం గోడౌన్ ను సందర్శించినట్లు తెలిపారు. ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు, సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం కలెక్టర్ తనిఖీ రిజిస్టర్లలో సంతకం చేశారు. తనిఖీలో ఆయన వెంట ఎన్నికల సూపరింటెంట్ రంగ ప్రసాద్, రాజకీయ పార్టీల నేతలు నోముల రమేష్, లక్ష్మణ అగర్వాల్, రాంబాబు, ఎస్. శ్రీనివాస్, ఎస్కే సలీం, ఎన్నికల సిబ్బంది నవీన్, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : పుట్టుక నీది చావు నీది, బ్రతకంతా దేశానిది అని చాటి చెప్పడమే కాకుండా, తన జీవితాన్ని తెలంగాణకు అంకితం చేసిన 'ప్రజాకవి' కాలోజీ నారాయణరావు మహనీయుడని ఇన్చార్జి జిల్లా రెవెన్యూ అధికారి, నల్గొండ ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి అన్నారు. కాళోజి నారాయణరావు 111వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కాలోజి నారాయణరావు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళోజి నారాయణరావు తన రచనల ద్వారా నిజాం నిరంకుశ పాలనను, దమన నీతిని ఎండగట్టారని, నిజాం రజాకార్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన స్వతంత్ర సమరయోధుడు అని కొనియాడారు. అలాంటి మహానుభావుడి జన్మదినాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భాష దినోత్సవంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, ఆయా విభాగాల అధిపతులు, సిబ్బంది హాజరయ్యారు.

కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో ..

విశాలాంధ్ర, కొమరం భీం : కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మధుకర్ కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తెలుగు భాషకు వన్నె తెచ్చి, స్వరాష్ట్ర ఆకాంక్షకు తెలంగాణ ప్రజల్లో చైతన్యం కలిగించిన మహాకవి కాళోజి అందరికీ ఆదర్శప్రాయుడుని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సరిత, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సిద్ధార్థ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో క్రిసెంట్ హై స్కూల్ సుభాష్‌నగర్ ఆవరణలో పెద్దపల్లి ఎస్.జి.ఎఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీలను డిఈవో మాధవి,సి.ఐ ప్రవీణ్ కుమార్, క్రిసెంట్ స్కూల్స్ చైర్మన్ అయాజ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల పట్ల ఉన్న మక్కువ వల్ల జీవితంలో ఉన్నత స్థానంలో ఉండడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. సి.ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ క్రీడలతో గ్రామీణ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు ఎదగవచ్చని ఆర్చరి విభాగానికి చెందిన చికితను ఉదాహరించారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ మాధవి మాట్లాడుతూ జీవితంలో చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యపాత్ర వహిస్తాయని వివరించారు. క్రీడలు విద్యార్థి సర్వతో ముఖాభివృద్ధికి దోహదపడతాయన్నారు. ఎం.ఈ.ఓ సురేందర్ , క్రిసెంట్ హై స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జమీరుద్దీన్ , ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ ,డివైఎస్ఓ ఏ. సురేష్ , ఎస్.జి .ఎఫ్. సెక్రటరీ కే.లక్ష్మణ్, పి. ఇ .టి సంఘం అధ్యక్షులు డాక్టర్. వేల్పుల సురేందర్, పి.టి.టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు శోభ మండల కన్వీనర్లు శైలజ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఉపరాష్ట్రపతి గద్దెపై సంఘ్ నేత

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అనుకున్నట్టే అధికార పక్ష అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించారు. ఆయనకు 452 ఓట్లు వచ్చాయి. ప్రతిపక్ష "ఇండియా" ఐక్యసంఘటన అభ్యర్థిగా రంగం లోకి దిగిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డికి అనుకూలంగా 300 మంది ఓటు వేశారు. సాక్షాత్తు పార్లమెంటు సభ్యులు పాల్గొన్న ఈ ఎన్నికలలో 15 ఓట్లు చెల్లకుండా పోవడం పెద్ద విశేషమే. ఉభయ పక్షాలూ ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఓటు ఎలా వేయాలో ఎంపీలకు శిక్షణ లాంటిది కూడా ఇచ్చినా చెల్లని ఓట్లు ఉన్నాయంటే అది ఎంపీలకు ఓటు వేయడం వచ్చి ఉండక పోనైనా పోవాలి. లేదా కావాలనే తమ ఓటు చెల్లకుండా చేసి అయినా ఉండాలి. ఇటీవలి కాలంలో ఉపరాష్ట్రపతి ఎన్నిక ఇంత ఉత్కంఠగా ఎప్పుడూ జరగలేదు. అధికార పక్షమైన ఎన్డీయేకు గెలవగలిగినంత సంఖ్యా బలం స్పష్టంగా ఉన్నప్పటికీ ఫలితాలు వెలువడే దాకా అధికారపక్ష అగ్ర నాయకుల్లో ఆందోళన స్పష్టంగా కనిపించింది. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వ్యక్తిత్వమే పోటీ గట్టిగా తయారు కావడానికి కారణం అయింది. అధికార పక్ష అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ ఆర్ఎస్ఎస్ కుదురుకు చెందిన వారు. ప్రతిపక్ష అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదు. కానీ ప్రస్తుత వాతావరణంలో రాజ్యాంగానికి ముప్పు ఎదురవుతున్నందున రాజ్యాంగ పరిరక్షణకు తనవంతు కర్తవ్యం నిర్వహిం చడానికి ఆయన రంగంలోకి దిగారు. అందుకే ఆయన నాకోసం ఓటు వేయనవసరం లేదు. దేశం కోసం ఓటేయండి, రాజ్యాంగ పరిరక్షణకోసం ఓటు వేయండి అని ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నిక కేవలం ఉపరాష్ట్రపతిని ఎన్నుకోవడం కోసం కాదు ప్రజాస్వామ్య భవిష్యత్తుకోసం అని ప్రతిపక్ష నాయకులు ఎంత గట్టిగా ప్రచారం చేసినా సంఖ్యాబలం అనుకూలించలేదు. మచ్చలేని సుదర్శన్ రెడ్డి గౌరవానికి భంగం కలగకుండా ఆయన 300 ఓట్లు సంపాదించగలిగారు. అధికార పక్ష అభ్యర్థి విజయం సునాయాసం అని అంకెలు సూచిస్తున్నా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాత్రం రాధాకృష్ణన్‌ను గెలిపించడానికి చెమటోడ్చాల్సి వచ్చింది. అధికారపక్ష ఎంపీల కోసం ప్రధాని ఏర్పాటు చేసిన విందులో ఆయన ఎంపీలను ఆలింగనం చేసుకోవడం, ఆప్యాయంగా కరచాలనం చేయడం అధికార పక్షంలో గూడు కట్టుకున్న ఓటమి భయానికి సంకేతం. ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే తప్ప రాధాకృష్ణన్ విజయం సాధ్యం కాదని మోదీ, షాకు తెలిసిపోయింది. అందుకే హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనంలో పాల్గొనాల్సిన అమిత్ షా ఆఖరి క్షణంలో దిల్లీలోనే ఉండి పరిస్థితిని చక్కదిద్దాలని భావించారు. కేవలం 782 మంది ఓటర్లు పాల్గొనాల్సిన ఎన్నిక కోసం అధికార పక్షం చాలా ప్రయాస పడవలసి వచ్చింది. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయ కత్వంలోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్.), ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతా దళ్ (బీజేడీ), అకాలీదళ్ ఈ ఎన్నికలను బహిష్కరించడం. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ రెండు పార్టీలు అనేక సందర్భాలలో పార్లమెంటులో బీజేపీకి మద్దతిచ్చాయి. ఇప్పుడు బీఆర్ఎస్ రైతులకు ఎరువులు అందనందువల్ల ఉప రాష్ట్రపతి ఎన్నికను బహిష్కరిస్తున్నామని ప్రకటించింది. అలాగే బీజేడీ మాత్రం తాము అధికారపక్షమైన ఎన్డీయేకు, ప్రతిపక్ష ఐక్య సంఘటన "ఇండియా"కు సమాన దూరం పాటిస్తామని చెప్పింది. పంజాబ్‌లో వరదలవల్ల ఏర్పడిన పరిస్థితిని నిర్లక్ష్యం చేస్తున్నందువల్ల ఈ ఎన్నికను బహిష్కరిస్తున్నామని అకాలీదళ్ ప్రకటించింది. ఈ మూడు పార్టీల వాదనలు ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించలేదు. బీఆర్ఎస్‌కు రాజ్యసభలో నలుగురు ఎంపీలు ఉంటే బీజేడీకి ఏడుగురు ఎంపీలు ఉన్నారు. అకాలీ దళ్‌కు ఉన్నది ఒక్క ఎంపీ మాత్రమే. ఉపరాష్ట్రపతి ఎన్నికలలో "నోటా" సదుపాయం ఉంటే తమ ఎంపీలు ఆ సదుపాయాన్ని ఉపయోగించేవారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కలవకుంట్ల తారకరామా రావు చేసిన వాదన నవ్వుకోవడానికి తప్ప ఎందుకూ పనికి రాదు. అసలు కారణం తెలంగాణకు మాత్రమే పరిమితమైన బీఆర్ఎస్ ప్రధానంగా కాంగ్రెస్‌తోనే పోరాడాల్సి ఉంది. అలాంటప్పుడు కాంగ్రెస్ సమర్థించిన సుదర్శన్ రెడ్డి తెలుగువాడే అయినప్పటికీ బీఆర్ఎస్. కనీసం "తెలుగువారి ఆత్మ గౌరవం కోసం" అయినా సుదర్శన్ రెడ్డిని సమర్థించాలనుకోలేదు. చాలా కాలం నవీన్ పట్నాయక్ నాయకత్వంలోని బీజేడీ మాత్రం బీజేపీకి అంటకాగింది. ఒడిశాలో గత శాసనసభ ఎన్నికల సమయంలో బీజేపీ ఒంటరిగా పోటీ చేసి ఆ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. నవీన్ పట్నాయక్ అలకకు ఇదే ప్రధాన కారణం అయి ఉంటుంది. అందుకే బహిష్కరణ దారి పట్టారు.

ఈ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరుగుతుందన్న భయం అధికార పక్షాన్ని పీడించినందువల్లే కొందరు ఎంపీలను "బందీలుగా" ఉంచడానికి కూడా వెనుకాడ లేదు. క్రాస్ ఓటింగ్ వల్ల ఎన్డీయే అభ్యర్థి ఓటమి పాలవుతారే మోనన్న భయం బీజేపీ నాయకత్వాన్ని తీవ్రంగా పీడించింది. సుదర్శన్‌రెడ్డి గెలిచి ఉండకపోవచ్చు కానీ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వ్యక్తి కేవలం 150 ఓట్ల ఆధిక్యతతో గెలవడం బహుశ: ఇదే మొదటి సారి కావొచ్చు. 2022లో జగదీప్ ధన్కడ్ ఎన్నికైనప్పుడు ఆయన 528 ఓట్లు సాధిస్తే ప్రతిపక్ష అభ్యర్థి మార్గరెట్ ఆల్వాకు 182 ఓట్లు మాత్రమే వచ్చాయి. రాధాకృష్ణన్ తక్కువ మెజారిటీతో గెలవడం అంటే ప్రతిపక్షాలు బలం పుంజుకోవడానికి నిదర్శనం. పెరుగుతున్న ఈ బలం భవిష్యత్ రాజకీయాలను నిర్దేశించవచ్చు. ఎన్డీయేకు మద్దతిచ్చే కొందరు ప్రతిపక్ష అభ్యర్థికి అనుకూలంగా క్రాస్ ఓటింగ్ చేస్తారన్న అంచనా మాత్రం తిరగబడింది. ప్రతిపక్ష అభ్యర్థికి మద్దతిస్తారనుకున్న 15 మంది ఎంపీలు ఎన్డీయే అభ్యర్థికి ఓటు వేయడానికి బలమైన కారణం ఏదో ఉండే ఉంటుంది. ఎన్డీయే పక్షానికి నికరంగా ఉన్నది 427 ఓట్లు మాత్రమే. కానీ 11 మంది ఎంపీలు ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ అధికారపక్షానికి మద్దతిచ్చింది. అప్పుడైనా అధికార పక్షానికి 438 ఓట్లు మాత్రమే వచ్చి ఉండాలి. కానీ రాధాకృష్ణన్‌కు 452 మంది ఎంపీల అండ ఉండడం అంటే ప్రతిపక్ష శిబిరం నుంచే క్రాస్ ఓటింగ్ జరిగి ఉండాలి. చెల్లని ఓట్లు కూడా ప్రతిపక్షాలకు మద్దతిస్తారనుకున్న వారివే కావొచ్చు. ప్రతిపక్షాలు అంచనా వేసిన దానికన్నా 15 ఓట్లు తక్కువ వచ్చాయి. గెలుపోటములను పక్కన పెడితే రాజ్యాంగ పరిరక్షణ, సైద్ధాంతిక పోరాటం అన్న వాదనలతో తమ అభ్యర్థిని నిలబెట్టిన "ఇండియా" ఐక్య సంఘటన మోదీ ఇష్టా రాజ్యం ఇక కుదరదని స్పష్టమైన హెచ్చరిక జారీ చేయగలిగింది. ప్రతిపక్ష శిబిరం నిరాశ పడవలసిన అగత్యం ఎంత మాత్రం లేదు. స్పష్టంగా ఆర్ఎస్ఎస్. అభ్యర్థిని ఉపరాష్ట్రపతిని చేయడంలో అధికార పక్షం సఫలమైంది. ఉపరాష్ట్రపతి రాజకీయ మద్దతుతోనే ఎన్నికవుతారు. కానీ ఆ పదవిలోకి వచ్చిన తరవాత రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి. రాధాకృష్ణన్‌కు నిష్పాక్షికంగా ఉండే అవకాశం ఉండకపోవచ్చు.

ఒంటరి నేను!

అరూనిమా సిన్హా అనే మహిళ గురించి చాలామందికి తెలిసి ఉండవచ్చు. అమె వికలాంగురాలు. అయినా ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన తొలి మహిళా వికలాంగురాలామె. 2011లో ఒక దొంగలముఠా కదులుతున్న రైలు నుంచి ఒంటరి మహిళ అయిన ఆమెను బయటకు తోసేసింది. దీంతో ఆమె ఎడమకాలును పోగొట్టుకుంది. మనోనిబ్బరం, ఆత్మవిశ్వాసం, చిత్తశుద్ధి, నిబద్ధత, పట్టుదల...ఇలాంటివన్నీ ఆమెకు అక్కాచెల్లెళ్లు. అందుకే అరూనిమా తన వైకల్యాన్ని అధిగమించి, 2013 మే 21వ తేదీన శిఖరపు అంచున భారత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి ప్రపంచ రికార్డు సృష్టించింది. జుడిత్ హ్యూమన్ అనే మహిళ కూడా ఇలాంటిదే. ఆమె కాళ్లు చచ్చుపడిపోయి, చక్రాల కుర్చీలోనే జీవితాన్ని సాగించేది. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఆమెకు టీచింగ్ లైసెన్స్ ఇవ్వడానికి నిరాకరించారు. వికలాంగురాలు పాఠాలు చెప్పకూడదా? వెంటనే ఆమె కోర్టుకెక్కారు. బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్‌పై కేసు వేసి, గెలిచారు. వీల్‌చెయిర్‌లో క్లాస్‌రూమ్‌లోకి వచ్చి పాఠాలు చెప్పిన తొలి ఉపాధ్యాయురాలిగా, వికలాంగుల హక్కుల ఉద్యమానికి ఆధ్యురాలిగా ఆమె చరిత్రకెక్కారు. మార్లీ మాట్లిన్ విజయగాథ కూడా ఇలాంటిదే. ఆమెకు మాటలురావు. కానీ మహానటిగా హాలీవుడ్ ప్రపంచాన్ని ఏలింది. ఎన్నో సినిమాల్లో నటించిన మార్లీ మాట్లిన్ 1986లో విడుదలైన 'చిల్డ్రన్ ఆఫ్ ఏ లెస్సర్ గాడ్' అనే సినిమాలో అద్భుతమైన నటనకు ఆస్కార్ అవార్డును చేజిక్కించుకున్నారు. డాక్టర్ మాళవికా అయ్యర్ అనే భారతీయ మహిళ కూడా ఈ కోవకే చెందుతారు. చిన్నప్పుడే ఆమె ఒక బాంబు పేలుడులో రెండు చేతులను కోల్పోయింది. తీవ్ర గాయాలతో కాళ్లను సైతం పాక్షికంగా కోల్పోయింది. అయినప్పటికీ, సామాజిక సేవారంగంలో పీహెచ్‌డీ పట్టా పొంది, కోట్లాదిమంది మహిళా వికలాంగులకు స్ఫూర్తిప్రదాతగా నిలిచింది. భారతీయ వికలాంగుల హక్కుల కార్యకర్తగా, మోటివేషనల్ స్పీకర్‌గా రాణిస్తోంది. హెలెన్ కెల్లర్ గురించి తెలియని వారుండరు. పాఠ్యాంశాల్లో

ఆమె విజయగాథను చదవని వారులేరు. పుట్టుగుడ్డి, బధిరురాలు (మూగ) అయిన హెలెన్ 20వ శతాబ్దంలో అత్యంత ప్రజాదరణ పొందిన మహిళలల్లో ఒకరుగా నిలిచారు. ఆమె బీఏ డిగ్రీ పొందిన తొలి బధిరురాలు, అంధురాలు. ఫ్రిదా కహ్లో అనే మెక్సికన్ పెయింటర్ పోలియో వ్యాధితో బాధపడుతూనే, గొప్ప చిత్రకళాకారిణిగా ఎదిగింది. ఒక 'కల్చరల్ ఐకాన్'గా నిలిచింది. సుధా చంద్రన్ కూడా తెలిసిన మహిళే. 16వ ఏట ఒక కారు ప్రమాదంలో కాలుపోగొట్టుకున్న సుధా కాలులేకుండా భరతనాట్యం చేయడం సాధ్యం కాదని తెలిసినా, దాన్ని సుసాధ్యం చేసింది. ఆమె నటిగా కూడా రాణించింది. ప్రపంచ ప్రఖ్యాత సంగీత కళాకారిణి బిల్లీ ఈలిష్ చిన్నప్పటి నుంచి టొరెటో సిండ్రోమ్‌తో బాధపడుతూనే గ్రామీ అవార్డులను, ఆస్కార్ అవార్డులను గెల్చుకొని విశ్వ సంగీత సంచలనంగా నిలిచింది. ఇలా చెప్పుకుంటూపోతే, ఎందరో మహిళా వికలాంగులు గొప్పవారై వెలుగొందారు. ఎన్ని విజయగాథలున్నా...నేటికీ మహిళా వికలాంగులు తమ హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారు. సమాజంలో చిన్నచూపునకు గురై, బానిసల్లా బతుకుతూనే ఉన్నారు. ఆంచల్ బతీజా అనే మహిళ మూడు మాసాల క్రితం (2025 జూన్) సుప్రీంకోర్టుకు హాజరు కావాల్సి వచ్చింది. ఆమెకు తెలుసు, ఆమె సుప్రీంకోర్టు ముందు హాజరైన తొలి అంధురాలైన న్యాయవాది. అన్నింటికన్నా ముందు, తాను కోర్టుకెలా వెళ్లాలి? అనుబంధ పత్రాలు ఎలా చదవాలి? పేజీ నెంబర్లు ఎలా గుర్తు పెట్టుకోవాలి? న్యాయమూర్తి అడిగే ప్రతి ప్రశ్నకు తానిచ్చే ప్రతి సమాధా నమూ ఆమెకొక సాహసమే. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, ఆమె క్లయింట్ కూడా అంధురాలే. ఉత్తరాఖండ్ జ్యుడిషియల్ సర్వీసెస్ ఒక ఉద్యోగ ప్రకటన ఇచ్చింది. అందులో రిజర్వేషన్లను ప్రస్తావించినప్పుడు వికలాంగుల గురించి ప్రస్తావనే లేదు. దీంతో ఆ మహిళ కేసు పెట్టింది. ఈ అడ్వర్‌టైజ్‌మెంట్ పూర్తిగా ఏకపక్షమని ఆంచల్ కోర్టులో నిలదీసింది. ఆంచల్ పుట్టుకతోనే పాక్షికంగా అంధురాలు. టెన్త్‌క్లాస్ పరీక్షలకు ముందు కళ్లు పూర్తిగా పోయాయి. అక్షరాలు కనిపించని పరిస్థితి ఏర్పడటంతో ఒక రిపోర్టర్ సాయం తీసుకొని, పరీక్షలు రాసింది. ఇంటర్‌లో 97.2% మార్కులతో జిల్లాలోనే ప్రథమస్థానం సాధించింది. ఆమె కసిగా చదివి అడ్వకేట్ అయి వికలాంగులైన మహిళల హక్కుల కోసం పోరాటం మొదలుపెట్టారు.

మీకు తెలుసా? ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరు ఏదో ఒక అవయవ లోపంతో బాధపడుతున్నారు. వీరిలో ఎక్కువమంది మైనారిటీలు, దళితులు, ఎల్‌బీటీలు (లెస్బియన్లు, బైసెక్సువల్స్, ట్రాన్స్‌జెండర్లు), శరణార్థులు, వలసకార్మికులే. యూఎన్ వుమెన్ సంస్థ నివేదిక ప్రకారం, వికలాంగులైన మహిళలు సాధారణ మహిళల కంటే రెండు మూడు రెట్లు అధికంగా దాడులను ఎదుర్కొంటున్నారు. సొంత కుటుంబంలోనే వారు గృహహింసకు గురవుతున్నారు. వికలాంగులైన పురుషుల కన్నా వారు మూడు రెట్లు అధికంగా నిరక్షరాస్యతతో బాధపడుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మహిళా వికలాంగులకు అవకాశాలు కల్పించడంపై 155 సంస్థలు, ప్రభుత్వ మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్లకు కమిషనర్ ఆఫ్ పెర్సన్స్ విత్ డిజాబిలిటీస్ (సీపీడబ్ల్యూడీ) రూ.10 వేలు చొప్పున అపరాధ రుసుము విధించింది. అందులో 95 వెబ్‌సైట్లు స్పందించకపోవడంతో ఆ ఫైన్‌ను రూ.50 వేలకు పెంచింది. కులాలన్నీ ఏకమవుతున్నా, అన్ని అవయవాలున్న మనిషి మాత్రం తన తోటి మనుషులైన వికలాంగులను తమలో కలుపుకో వడం లేదు. ముఖ్యంగా మహిళా వికలాంగులు హింస, దుర్వినియోగం, బహుళ రకాల వివక్ష, శారీరక లైంగిక వేధింపులు, విద్యాఉపాధి అవకాశాల లేమి, ఆరోగ్య సంరక్షణలో అసమానతలు, అధికారస్థానాల్లో గుర్తింపు లేకపోవడం వంటి సమస్యలతో వారి గొంతు సరిగా వినపడటం లేదు. ఎన్ని చట్టాలు ఉన్నా, చేయూతనిచ్చే సంస్థలు ఎన్ని ఉన్నా, ఆంచల్ అన్నట్లుగా...'నేను ఒంటరిని... ఒంటరిగానే పోరాడుతాను'. మహిళా వికలాంగులకు అదొక్కటే స్ఫూర్తి.

పాక్ ప్రాజెక్టులపై కాషాయ దళాల ప్రచారం నిజమా?

ఎం.కోటేశ్వరరావు

"పాకిస్థాన్ 60 బిలియన్ డాలర్ల ఆర్థిక నడవా ప్రాజెక్టు నుంచి వైదొలిగిన చైనా, నిధుల కోసం ఏడీబీని ఆశ్రయించిన ఇస్లామాబాద్" ఇది కొన్ని పత్రికల్లో వచ్చిన వార్త శీర్షిక. ఇదే అర్థం వచ్చేవి మరికొన్నింటిలో వున్నాయి. దీనికి కాషాయ దళం చెప్పిన భాష్యం ఏమిటి ! "భారత జాతీయ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే కనెక్టివిటీని మోదీ వ్యతిరేకించిన తరువాత (సీపీఈసీ ప్రాజెక్టులో స్పష్టంగా సూచించడం) చైనా పాకిస్థాన్ 60 బిలియన్ డాలర్ల ప్రాజెక్టు నుంచి వైదొలిగింది. ఇది భారతదేశానికి దౌత్యపరంగా అతిగొప్ప విజయం, పాక్‌కు చావు దెబ్బ" అని పేర్కొన్నారు. ఇది నిజమా ? మొదటి అవాస్తవం ఏమిటంటే నరేంద్రమోదీ ప్రధాన మంత్రిగాక ముందే దానికి నాంది పలికిన 2013లోనే నాటి యూపీఏ ప్రభుత్వం ఈ పథకానికి అభ్యంతరం తెలుపుతూ వ్యతిరేకించింది. ఎందుకు ? పాక్ ఆక్రమిత్ కాశ్మీరులో భాగమైన గిల్గిట్ బాల్టిస్థాన్ ప్రాంతంలో 600 కిలోమీటర్ల పొడవున పాకిస్థాన్, చైనా నడవా ప్రాజెక్టులో భాగంగా రోడ్డు, రైలు మార్గ నిర్మాణం సాగుతోంది. అది చైనాలోని షింజియాంగ్ స్వయంపాలిత ప్రాంతం నుంచి మొదలై మూడువేల కిలోమీటర్ల దూరంలో పాకిస్థాన్ అరేబియా సముద్ర తీరంలోని గ్వాదర్ రేవు వరకు ఉంటుంది. గిల్గిట్ బాల్టిస్థాన్ ప్రాంతంపై మనదేశం హక్కును వదులుకోలేదు గనుక తమ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు జరగకూడదని మన ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. అయినప్పటికీ దాన్ని కొనసాగిస్తున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ సర్కార్ కూడా దాన్ని వ్యతిరేకిస్తూ వివిధ సందర్భాలలో నిరసన తెలుపుతూనే ఉంది. వాస్తవం ఇది కాగా కొత్తగా మోదీ వ్యతిరేకత తెలిపినట్లు దానికి తలొగ్గి ప్రాజెక్టు నుంచి చైనా వైదొలిగి నట్లు చెప్పటం జనాల చెవుల్లో పూలు పెట్టటం తప్ప మరొకటి కాదు. ఆ పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

నిజానికి మన్మోహన్ సింగ్ గానీ, నరేంద్ర మోదీ గానీ ఈ సమస్య మీద పెద్దగా చేసిందేమీ లేదు. వ్యతిరేకత ఉన్నప్పటికీ ఇద్దరూ చైనాతో ఇతర సంబంధాలను కొనసాగించారు. షాంఘై సహకార సంస్థలో మనదేశం 2005 నుంచి పరిశీలకురాలిగా 2014వరకు ఉంది. ఆ ఏడాది మోదీ ప్రభుత్వం పూర్తి స్థాయి సభ్యత్వం కోసం దరఖాస్తు చేసింది. మన దేశమూ, పాకిస్థాన్ రెండూ 2017లో ఒకేసారి సభ్యత్వం పొందాయి. అప్పుడు పాక్ నడవాను ఒక సమస్యగా మోదీ ముందుకు తేలేదు. నరేంద్రమోదీ హయాంలో 2020 గాల్వన్‌లోయ ఉదంతాల ముందు వరకు చైనాతో సంబంధాలు మరింత ముందుకు పోయాయి. ఐదేళ్ల తరువాత తిరిగి సాధారణ స్థితికి

వస్తున్నాయి. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) 25వ వార్షిక సమావేశాలకు నరేంద్రమోదీతో పాటు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా హాజరయ్యారు. మోదీ వెంటనే తిరిగి రాగా సెప్టెంబరు మూడున జపాన్‌పై రెండవ ప్రపంచ యుద్ధంలో చైనా సాధించిన విజయం 80వ వార్షికోత్సవ మిలిటరీ పెరేడ్‌లో ఒక అతిథిగా షరీఫ్ పాల్గొన్నారు. ఆ ఉత్సవానికి నరేంద్రమోదీకి కూడా ఆహ్వానం ఉన్నప్పటికీ హాజరు కాలేదు. ఎస్‌సీఓ సమావేశాలలో సీపీఈసీ గురించి అభ్యంతరాలు తెలిపినట్లుగానీ, చైనా నేతలతో మాట్లాడినట్లుగానీ ఒక్కటంటే ఒక్క వార్త కూడా రాలేదు. వాట్సాప్ యూనివర్సిటీ పండితులకూ అది తట్టకపోవటం ఆశ్చర్యం కలిగించవచ్చు. కానీ కొద్ది రోజుల తరువాత మీడియాలో వచ్చిన కథనాలను పట్టుకొని ఆర్ఎస్ఎస్ పత్రిక ఆర్గనైజర్ తనదైన శైలిలో రాసింది. ఆరు రోజులపాటు చైనాలో ఉన్నప్పటికీ షెహబాజ్ షరీఫ్ సీపీఈసీకి రెండవ దశ పెట్టుబడుల విషయంలో విఫలమయ్యారు. పరిమితమైన అవగాహన ఒప్పందాలు మాత్రమే చేసుకున్నారు. పెద్ద పెట్టుబడులేమీ లేదు. సీపీఈసీ 2.0 ప్రారంభమైనట్లు షెహబాజ్ ఏకపక్షంగా ప్రకటించారు తప్ప చైనా వైపు నుంచి ఎలాంటి ప్రకటన లేదు. పెరేడ్‌లో చైనా అధ్యక్షుడు తనతో పాటు పుతిన్, కిమ్‌ను తప్ప షెహబాజ్‌ను పట్టించుకోలేదు. పుతిన్‌తో సంభాషించినప్పుడు చెవులకు ఫోన్లను కూడా సరిగా అమర్చుకోలేకపోయారంటూ రాసింది. పాకిస్థాన్‌తో సీపీఈసీ పెట్టుబడుల నుంచి వెనక్కు తగ్గినట్లు చైనా అధికారిక ప్రకటనను ఆర్గనైజర్ లేదా కథనాలు రాసిన ఇతర పత్రికలు చూపగలవా ?

కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఎటుతిప్పి ఎటురాసినా కీలకమైన రైల్వే ప్రాజెక్టుకు రెండు బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఇవ్వటం లేదని చైనా చెప్పిందని, గుట్టుచప్పుడు కాకుండా వెనక్కు తగ్గిందని, ఆ మొత్తాన్ని ఆసియన్ అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) నుంచి తీసుకోవాలని పాక్ నిర్ణయించిందని రాశాయి. పదే పదే ఐఎంఎఫ్ నుంచి రుణాలు తీసుకుంటున్న పాకిస్థాన్‌కు తాము ఇచ్చిన రుణాలను చెల్లించే సత్తా దానికి ఉందా అనే అనుమానాలు చైనాకు వచ్చినట్లు పేర్కొన్నాయి. ఒక స్నేహితుడి కోసం మరొకర్ని వదులుకోలేమని ఇటీవల పాక్ ఆర్మీ ప్రధాన అధికారి అసిమ్ మునీర్ చెప్పాడని, దాంతో చైనా పెద్దగా ఆసక్తి చూపటం లేదన్నట్లుగా వర్ణించారు. ఇదే సమయంలో 8.5 బిలియన్ డాలర్లను వివిధ పథకాలకు చైనా అందించేందుకు పాక్ ప్రధానితో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వచ్చిన వార్తలను మన మీడియా పెద్దగా పట్టించుకోలేదు. రెండు బిలియన్ డాలర్లు ఇచ్చేందుకు తిరస్కరించిన చైనా కొత్తగా 8.5 బిలియన్ డాలర్లు ఇచ్చేందుకు ఎందుకు అంగీకరించినట్లు ? ఈ మొత్తాన్ని సీపీఈసీ 2.0లో ఐదు కొత్త కారిడార్లు, అదే విధంగా ఇతర రంగాలలో వినియోగించనున్నట్లు ప్రముఖ పాక్ పత్రిక డాన్ రాసిందని మన దేశ వార్తా సంస్థ పీటీఐ పేర్కొన్నది. తొలిసారిగా పశ్చిమ దేశాలతో చేతులు కలిపిన ఒక సంస్థ సీపీఈసీలో పెట్టుబడులు పెట్టేందుకు చొరవ చూపిందని కూడా వార్తల్లో రాశారు.

నిజానికి ఇలాంటి కథనాలు రావటం ఇదే కొత్త కాదు. 2024 జూన్ 11న మన దేశంలోని బిజినెస్ స్టాండర్డ్ పత్రిక రాసిన కథనానికి "సీపీఈసీ 2.0 లేదు, భారీ పెట్టుబడులు లేవని పాకిస్థాన్‌కు చెప్పకనే చెప్పింది" అనే శీర్షిక పెట్టింది. ఐదు రోజుల పర్యటన జరిపిన ప్రధాని షెహబాజ్ షరీఫ్ పర్యటనకు ముందు ఇస్లామాబాద్ అధికారులు సీపీఈసీని మరొక ఉన్నత స్థాయికి తీసుకువెళతారని చెప్పారని అయితే ఖాళీ చేతులతో తిరిగి వచ్చారని, పాక్ ఆశల మీద చైనా నీళ్లు చల్లిందని, పరిమిత లబ్ధితోనే తిరిగి వెళ్లినట్లు నికీ ఆసియా రాసిందని దాన్లో పేర్కొన్నారు. ఏడాది క్రితం మోదీ చైనా వెళ్లలేదు, దానితో సాధారణ సంబంధాల స్థితి కూడా లేదు, అప్పుడెందుకు చైనా అలా వ్యవహరించిందో మీడియా "వంట" వారు, కాషాయ దళాలు చెప్పగలవా? "పాకిస్థాన్ : ఎందుకు చైనా సీపీఈసీ ప్రాజెక్టులు నిలిపివేసింది ?" అనే శీర్షికతో ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న అబ్జర్వర్ రిసర్చ్ ఫౌండేషన్ (ఓఆర్ఎఫ్) వెబ్‌సైట్‌లో 2020 నవంబరు 25వ తేదీన అయిజాజ్ వానీ రాసిన విశ్లేషణను ప్రచురించింది. అప్పుడు గాల్వన్‌లోయ ఉదంతాలతో చైనాతో మన దేశం వైరంలో ఉంది తప్ప మిత్రదేశంగా లేదు కదా, ఆనాడే అలా ఎందుకు రాయాల్సి వచ్చినట్లు ? నరేంద్రమోదీ నిరసన లేదా పలుకుబడి ఏమైనట్లు ? అప్పటికే కొన్ని అంశాలను నిలిపివేసినట్లు అయిజాజ్ వానీ రాశారు. పాకిస్థాన్‌లో మాంద్యం, అవినీతి, బెలూచిస్తాన్ ఇతర తిరుగుబాట్లు వంటి అంశాలతో అనేక ప్రాజక్టులు నిలిచిపోయినట్లు పేర్కొన్నారు.

సీపీఈసీ అవకాశాన్ని పాకిస్థాన్ వృధా కావించిందని, మద్దతు గురించి చైనా పునరాలోచనలో పడిందని సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయ మాజీ ప్రొఫెసర్ సజ్జాద్ అష్రాఫ్ 2025 మే రెండవ తేదీన రాశారు. పదేళ్ల తరువాత పాకిస్థాన్ అసమర్ధత, రాజకీయ అవకతవకల వంటి కారణాలతో అనేక కీలక ప్రాజెక్టులు ఆలస్యం, వాయిదా పడటం వంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కొన్ని ముఖ్యాంశాలను చూద్దాం.2015 ఏప్రిల్ 20న షీ జింపింగ్ ఇస్లామాబాద్‌లో ఎంతో అట్టహాసంగా ప్రాజెక్టును ప్రారంభించారు. పదేళ్ల తరువాత తలపెట్టిన 90 పథకాల్లో 38 పూర్తి కాగా మరో 23 నిర్మాణంలో ఉన్నాయి. మూడోవంతును ఇంతవరకు ముట్టుకోలేదు. దీనికి బాధ్యత పరిమితంగా చైనాది కాగా ఎక్కువగా ఇస్లామాబాద్‌దే ఉంది. అత్యంత కీలకమైన ప్రత్యేకించి సెజ్‌లు, పారిశ్రామికవాడలు పూర్తికాలేదు. దీనికి పాకిస్థాన్ రాజకీయ నేతలు, ఆసక్తి కనపరచని ఉన్నతాధికారులదే బాధ్యత. వీటికి కేటాయించిన వనరులను ఆర్థికంగా పెద్దగా చెప్పుకొనేందుకు ఏమీ ఉండని లాహోర్ మెట్రో రైలు ప్రాజెక్టులకు మళ్లించారు. ఇలాంటి వాటికి తోడు 2021 నుంచి ప్రాజెక్టుల్లో పని చేస్తున్న చైనా సిబ్బందికి రక్షణ కల్పించటంలో తీవ్ర పరిస్థితి ఏర్పడింది. అప్పటి నుంచి 14దాడులు జరగ్గా 20 మంది మరణించారు, 34 మంది గాయపడ్డారు. వీటిలో ఎక్కువభాగం బెలూచిస్తాన్‌లో జరిగాయి. దౌత్యపరంగా ఇప్పటికీ సీపీఈసీకి చైనా మద్దతు ఉన్నప్పటికీ 2023 తరువాత కొత్త పెట్టుబడుల పట్ల వెనక్కి తగ్గుతున్నది.

తెలుగు చిత్రకళా జగత్తులో ధ్రువతార

రేగుళ్ళ మల్లికార్జునరావు

చిత్రకళా చరిత్రలో ఒక ధ్రువతారగా వడ్డాది పాపయ్య (1921-1992) ఎప్పటికీ గుర్తుండిపోతారు. ఆయన కేవలం బొమ్మలు గీసేవాడు కాదు, తన కుంచెతో కథలు చెప్పిన కథకుడు, ఒక నిశ్శబ్ద కవి కూడా. ఆయన చిత్రాలు మన భారతీయ సంస్కృతి, పురాణాలు, పల్లెల జీవితం, ప్రకృతి అందాలను అత్యంత సుందరంగా ఆవిష్కరించాయి. పాపయ్య బొమ్మలు గీసే విధానం, రంగులు వాడే పద్ధతి, వాటిని అలంకరించే తీరు వల్ల ఆయనకు 'కళా తపస్వి' అనే పేరు వచ్చింది. ఆయన చిత్ర సృజన ఆయనను అమరుడిని చేసింది. చిత్రకళ ఉన్నంతవరకు, చిత్రరచన కొనసాగినంత కాలం ఆయన ప్రతిభ సజీవంగా, కాలాతీతమైనదిగా నిలిచి ఉంటుంది. వడ్డాది పాపయ్య శ్రీకాకుళంలో పవిత్రమైన నాగావళి నది ఒడ్డున రామమూర్తి, మహాలక్ష్మి దంపతులకు సెప్టెంబరు 10, 1921 న జన్మించారు. తండ్రి చిత్రకళా ఉపాధ్యాయుడు కావడంతో, బొమ్మలు గీయడం ఆయన తండ్రి దగ్గరే నేర్చుకున్నారు. తండ్రి బొమ్మలు గీసేటప్పుడు చాలా శ్రద్ధగా చూసి, రంగులు కలపడం, బ్రష్‌లను శుభ్రం చేయడం వంటి పనులన్నీ సహాయం చేస్తూ నేర్చుకున్నారు. ఐదేళ్ల చిన్న వయసులోనే ఇంట్లో ఉన్న రవివర్మ గీసిన "కోదండ రామ" చిత్రాన్ని చూసి, దాని స్ఫూర్తితో హనుమంతుని బొమ్మ గీశారు. చిన్నతనంలో తండ్రి చెప్పిన భారత, భాగవత కథల ప్రభావం ఆయనపై చాలా ఉంది. అందుకే పాపయ్య కొత్తదానికంటే పాత విషయాల మీద, ముఖ్యంగా భారతీయ శిల్ప, చిత్ర కళల మీద ఎక్కువ ఆసక్తి పెంచుకున్నారు.

ప్రముఖ చిత్రకారుల స్ఫూర్తి: ఆయన ఊహ పెరిగిన తర్వాత, చిత్రకళా వైతాళికులుగా పేరుపొందిన రాజా రవివర్మ, దామెర్ల రామారావు వంటి వారి చిత్రకళా తపస్సును ఆదర్శంగా ఎంచుకున్నారు. అయితే, ఈ ఇద్దరు కళాకారులు తమ సృష్టికి మోడళ్లను ఆశ్రయించేవారు. పాపయ్య మాత్రం ఎలాంటి మోడల్ లేకుండా సృజనాత్మకంగా తన ఊహా ప్రపంచంలో నుంచి చిత్ర రచన చేసేవారు. ఆయన వేసిన వేలాది చిత్రాలు ఒకదానితో మరొక దానికి సంబంధం లేకుండా, దేనికదే ప్రత్యేకం, సృజనాత్మకం. ఆయన చేతి నైపుణ్యానికి తోడు, అడవి బాపిరాజు నుంచి గొప్ప భావాలను అందుకున్నారు. ప్రతి కళాకారుడికి తనకంటూ ఒక సొంత శైలి ఉండాలని గట్టిగా నమ్మి, ఆ ప్రకారంగానే తనను తాను మార్చుకున్నారు. ఆయన చిత్రరచన అంతా నీటిరంగుల్లో కొనసాగింది. కొన్ని సందర్భాలలో, అవసరమైన రంగులను ఆయన స్వయంగా తయారు చేసుకునేవారు. ఒక చిత్రకారునిగా 1938లో తనను తాను గుర్తించుకున్నారు. ఈ కృషి ఎన్ని కష్టాలు వచ్చినా, విజయం సాధించే వరకు ఆగలేదు. కళ మనసులోంచి పుడుతుంది అనే నమ్మకంతో ఆయన బొమ్మలు గీసేవారు. రేరాణి, అభిసారిక, భారతి పత్రికలలో ప్రచురించిన బొమ్మలతో ఒక గొప్ప చిత్రకారునిగా పత్రికా ప్రపంచానికి దగ్గరయ్యారు. తెలుగు సినీ ప్రముఖుడు చక్రపాణి తమ సంస్థ ప్రచురణలైన చందమామ, యువ పత్రికలలో బొమ్మలు వేసే ఉద్యోగం ఇచ్చారు. ఒక్క "చందమామ" పత్రికలోనే దాదాపు మూడు దశాబ్దాల పాటు తన సహజ శైలిలో బొమ్మలు గీస్తూ, ఒకే పత్రికలో కొనసాగటం తెలుగు పత్రికా రంగంలో ఒక పెద్ద రికార్డు. అప్పట్లో చందమామ ఎనిమిది భాషలలో వస్తుండటంతో పాపయ్య చిత్రాలు దేశవ్యాప్తంగా అందరికీ తెలిశాయి. చిత్రకళ నేర్చుకుంటున్న తొలినాళ్లలో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు పాపయ్య చిత్రాలు పత్రికలలో ప్రచురించి ప్రోత్సహించారు. చందమామ, యువ తర్వాత స్వాతి వార, మాస పత్రికలలో పది సంవత్సరాల పైగా ఈయన చిత్రాలు ప్రచురితమయ్యాయి. వడ్డాది పాపయ్య గీసిన చిత్రాల క్రింద 'వ.పా.' అనే పొడి అక్షరాల సంతకం వారి ప్రత్యేకత. వీరి బొమ్మలకు గల మరొక గుర్తు '010' అని ఉండడం. దీని గురించి ఆయన చెప్పిన వివరణ - "గతం శూన్యం, వర్తమానం శూన్యం, భవిష్యత్తులో నిలుచున్నానని". వ.పా. కేవలం చిత్రకారుడే కాదు, రచయిత కూడా.



వడ్డాది పాపయ్య వ్యక్తిగత జీవితం సాధారణమైనది. 1947 లో సూకరాజమ్మను, 1984లో లక్ష్మి మంగమ్మను వివాహం చేసుకున్నారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. కూతురు అనూరాధ మీద ప్రేమతో కశింకోటలో 'పావన కుటీరం' నిర్మించుకొని అక్కడే నివాసం ఉన్నారు. సాధారణంగా చిత్రకారులు మోడల్స్‌ను చూస్తూ బొమ్మలు గీస్తుంటారు. కాని పాపయ్య మాత్రం ఏనాడూ ఆవైపు పోలేదు. తన ఆలోచనల్లో ఉన్న రూపాలనే చిత్రాలుగా గీసేవారు. ఆయన చిత్రాలలో తెలుగు సంస్కృతి, తెలుగుదనం, ఆచార వ్యవహారాలు, అలంకరణలు, పండుగలు ప్రధాన అంశాలుగా ఉంటాయి. వ.పాకు తన గురించి ప్రచారం అంటే ఇష్టం ఉండేది కాదు. తన గురించి చిన్న సినిమా తీయాలన్న దూరదర్శన్ ప్రతిపాదనను కూడా ఒప్పుకోలేదు. కళాకారునిగా తనను అభిమానించవద్దని, తన కళనే అభిమానించమని అభిమానులను కోరేవాడు. కేవలం స్నేహితుల ఒత్తిడి కారణంగా ఖరగ్‌పూర్, శ్రీకాకుళంలలో తన చిత్రాలను ప్రదర్శనకు పెట్టాడు. కళా రూపాలను అమితంగా ఇష్టపడే వ.పా. నైరూప్య చిత్రకళ అంటే ఇష్టం చూపేవారు కాదు.

పాపయ్యగారి చిత్రకళ కేవలం ఆయన జీవిత కాలానికే పరిమితం కాలేదు. ఆయన కళా వారసత్వం నేటికీ చాలా మంది కొత్త చిత్రకారులకు స్ఫూర్తినిస్తోంది. పాత భారతీయ కళను కొత్త చిత్రకళా శైలితో కలిపిన ఆయన విధానం ఒక ప్రత్యేక పాఠంగా నిలిచింది. ఆయన గీసిన సున్నితమైన గీతలు, భావాలను చూపించే రంగులు, పాత్రల ఆత్మను పట్టుకునే నైపుణ్యం నేటి చిత్రకారులకు మార్గదర్శకాలుగా నిలిచాయి. ఇప్పుడు డిజిటల్ ఆర్ట్ యుగంలో కూడా, పాపయ్య కళాఖండాలు డిజిటల్ మాధ్యమాలలో మళ్లీ సృష్టించబడుతు న్నాయి, ఇది ఆయన కళాశైలి ఎప్పటికీ ఉండే గొప్పతనాన్ని సూచిస్తోంది. ఆయన బొమ్మలు తెలుగు ప్రజల సంస్కృతిలో ఒక భాగం అయిపోయాయి. చందమామలో ఆయన వేసిన ప్రతి బొమ్మ ఒక తరానికి బాల్యం మధురమైన జ్ఞాపకం. ఆయన బొమ్మలు క్యాలెండర్లు, పోస్టర్లు, పుస్తకాలపై అచ్చై ప్రతి ఇంట్లోను ఒక పవిత్ర స్థానాన్ని పొందాయి. ఈ విధంగా, ఆయన కళాకారుడుగానే కాకుండా, ఒక సంస్కృతిని ప్రచారం చేసేవాడుగా కూడా సేవలు అందించారు. భారతీయ పురాణాలను, సంస్కృతిని, విలువలను చాలా సులభమైన, అందమైన చిత్రాల ద్వారా సాధారణ ప్రజలకు దగ్గర చేశారు.తన చిత్రాల ద్వారా ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు వ.పా. అయితే కొందరు విమర్శకులు వ.పా. చిత్రకళా శైలిని పట చిత్రకళ అని విమర్శించేవారు.

పాపయ్యగారు కేవలం చిత్రకారుడు కాదు, ఆయన ఒక కవి. ఆయన గీసిన ప్రతి చిత్రం ఒక నిశ్శబ్ద కవిత్వం లాంటిది. ఒక సాధారణ కాగితాన్ని, కొన్ని రంగులను ఉపయోగించి, ఆయన భావోద్వేగాలను, జీవితాన్ని, చరిత్రను సృష్టించారు. పాపయ్య బొమ్మలు భవిష్యత్ తరాలకు ఆయన గొప్ప సృజనాత్మకతకు, కష్టానికి, భారతీయ కళా సంస్కృతి పట్ల ఆయనకున్న ప్రేమకు సాక్ష్యంగా నిలిచి ఉంటాయి. ఆయన మరణం చిత్రకళా రంగానికి ఒక తీరని లోటు అయినప్పటికీ, ఆయన చిత్రాలు, ఆయన కళ ఎప్పటికీ సజీవంగా ఉంటాయి. ఆయన గీసిన ప్రతి చిత్రం ఒక నిశ్శబ్ద కవిత్వం లాంటిది, అది ఎల్లప్పుడూ మనలో స్ఫూర్తిని నింపుతూనే ఉంటుంది. వడ్డాది పాపయ్య మన మధ్య లేకపోయినా, ఆయన కళా ప్రపంచం మాత్రం సజీవంగా, మన హృదయాలలో నిలిచి ఉంటుంది.

- సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ



ఓటేసిన మోదీ, ఖడ్గే, సోనియా

న్యూదిల్లీ: భారత ఉపరాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ పార్లమెంటు నూతన భవనంలోని 'ఎఫ్-101 వసుధ'లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలి ఓటు వేశారు. అనంతరం అధికార, విపక్ష కూటమికి చెందిన ఎంపీలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, రామ్మోహన్‌నాయుడు, కిరణ్ రిజుజు, ప్రహ్లాద్ జోషి, కిషన్‌రెడ్డి సహా ఎన్డీయే ఎంపీలు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ సహా విపక్ష ఇండియా ఎంపీలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సందర్భంగా ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఖడ్గే, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మధ్య ఆసక్తికర సంభాషణ అందరినీ ఆకట్టుకుంది. వీరిద్దరూ ఆత్మీయంగా మాట్లాడుకుంటూ కనిపించారు. ఇద్దరూ చేతులు పట్టుకొని ఓటు వేసేందుకు వెళ్లారు.

నా ఫొటోలు, వీడియోలు వాడొద్దు

దిల్లీ హైకోర్టులో ఐశ్వర్య రాయ్ పిటిషన్

న్యూదిల్లీ: అనుమతి లేకుండా తన ఫొటోలు, వీడియోలు వాడుతున్నారని ప్రముఖ సినీనటి ఐశ్వర్య రాయ్ దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన వ్యక్తిగత హక్కులను కాపాడాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. కొంతమంది వ్యక్తులు తన పేరు, చిత్రాలు ఏఐ ఆధారిత అశ్లీల కంటెంట్‌లో అనధికారికంగా వాడుతున్నారని, వాటిని వినియోగించకుండా నిరోధించాలని కోరారు. సినీనటి తరపున సీనియర్ న్యాయవాది సందీప్ సేథీ వాదిస్తూ 'పూర్తిగా అసత్యమైన సన్నిహిత ఫొటోలు ఇంటర్నెట్‌లో ప్రచారమవుతున్నాయి. ఎవరికీ ఆమె ఫొటోలు, పేరు వాడుకునే హక్కు లేదు. ఒక వ్యక్తి ఆమె పేరు, ఫొటోలతో డబ్బు వసూలు చేస్తున్నాడు. ఆమె పేరును, రూపాన్ని ఇష్టానుసారం వాడటం దురదృష్టకరం' అని కోర్టుకు వివరించారు. కొందరు వ్యక్తులు ఐశ్వర్య ఫొటోలను మార్ఫింగ్ చేసి ఉపయోగించుకుంటున్నారని సందీప్ సేథి న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఆమె ఫొటోలను టీ షర్ట్‌లపైనా ముద్రించి అమ్ముతూ డబ్బు వసూలు చేస్తున్నారని వెల్లడించారు. ఏఐతో ఐశ్వర్య చిత్రాలను రూపొందించి యూట్యూబ్ ఛానల్స్ వారు అసభ్యకరమైన వీడియోలు చేస్తున్నారని కోర్టుకు విన్నవించారు. దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలను కోర్టుకు సమర్పించినట్లు ఆయన చెప్పారు. అయితే ఈ కేసుపై తదుపరి విచారణ వచ్చే ఏడాది జనవరి 15న జరగనుంది.

భారత పౌరులూ జాగ్రత్త..!

న్యూదిల్లీ: పొరుగు దేశమైన నేపాల్‌లో హింసాత్మక ఆందోళనలు తీవ్ర రూపం దాల్చిన క్రమంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. నేపాల్‌లో నివసిస్తున్న భారత పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, స్థానిక అధికార యంత్రాంగం జారీ చేసే మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని మంగళవారం హెచ్చరించింది. నేపాల్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. "నిన్నటి నుంచి నేపాల్‌లో జరుగుతున్న ఘటనలు మమ్మల్ని తీవ్రంగా కలచివేశాయి. ఎంతో మంది యువకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. మృతుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాము" అని పేర్కొంది. స్నేహపూర్వక పొరుగు దేశంగా, సంబంధిత వర్గాలన్నీ సంయమనం పాటిస్తూ, శాంతియుత చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆశిస్తున్నట్లు భారత్ తెలిపింది. నేపాల్ రాజధాని కాట్మండుతో పాటు వివిధ ప్రధాన నగరాల్లో అధికారులు కర్ఫ్యూ విధించిన నేపథ్యంలో భారతీయులు అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని విదేశాంగ శాఖ సూచించింది.

ఇజ్రాయిల్‌తో వాణిజ్య ఒప్పందం సిగ్గుచేటు: సీపీఎం

న్యూదిల్లీ: ఇజ్రాయిల్ ఆర్థికమంత్రి బెజలెల్ స్మోట్రిచ్ భారత్‌లో పర్యటించడాన్ని సీపీఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. భారత ప్రభుత్వంతో ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంపై సంతకం చేయడానికి ఆయన ఇజ్రాయిల్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. స్మోట్రిచ్ భారత్ పర్యటనను ఖండిస్తూ మంగళవారం పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. 'పచ్చి మితవాద జాత్యాహంకార పార్టీకి చెందిన స్మోట్రిచ్... పలస్తీనా ప్రజలను బలవంతంగా నిరాశ్రయులను చేయడం ద్వారా గాజాస్ట్రిప్‌ను ఆక్రమించాలనుకుంటున్న నెతన్యాహు ప్రభుత్వంలో ప్రముఖ న్యాయవాది. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌ను ఇజ్రాయిల్‌లో విలీనం చేయాలనే ప్రతిపాదనకు ఆయన ప్రధానకర్త. పలస్తీనియన్ల జాతిని ప్రక్షాళన చేయాలన్న సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ అనేక దేశాలు స్మోట్రిచ్ పర్యటనపై నిషేధం విధించాయి. మరికొన్ని దేశాలు ఆంక్షలు విధించాయి. ఆదేశాల్లో బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, నార్వే, నెదర్లాండ్స్, స్లొవేనియా, న్యూజిలాండ్ ఉన్నాయి. గాజా ప్రజలు ప్రతి రోజూ ఊచకోతకు గురవుతున్న సమయంలో మోదీ ప్రభుత్వం స్మోట్రిచ్‌కు ఆతిథ్యమివ్వడం, ఇజ్రాయిల్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం సిగ్గుచేటు. ఇజ్రాయిల్ వెంటనే కాల్పుల విరమణకు అంగీకరించి... అన్ని సైనిక, భద్రత, ఆర్థిక సహకారాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం' అని ఆ ప్రకటన డిమాండ్ చేసింది.

వరద బాధితులకు బంగారం, వెండి విరాళం

చండీగఢ్: హర్యానాలోని నుహ్ జిల్లా మేవాట్ ప్రాంతానికి చెందిన గ్రామస్థులు ఉదారత చాటుకున్నారు. పంజాబ్‌ను భారీ వరదలు ముంచెత్తాయి. కొండ ప్రాంతాల్లో పడిన వర్షాల కారణంగా దాదాపు 2 వేల గ్రామాలు ప్రభావితమయ్యాయి. వారికి సాయం అందించేందుకు మేవాట్ గ్రామస్థులు ముందుకొచ్చారు. కొందరు మహిళలు బంగారం, వెండిని కూడా విరాళంగా అందించారు. తలక్‌పురి గ్రామానికి చెందిన 75 ఏళ్ల రహీమి సహా సోహ్నా బ్లాక్‌లోని నుహ్ గ్రామానికి చెందిన మరికొంతమంది మహిళలు కలిసి రూ.5 లక్షల విలువైన సుమారు 2 కిలోల వెండి, 20 గ్రాముల బంగారాన్ని విరాళంగా ఇచ్చారు. దీంతోపాటు దుప్పట్లు, పొడి రొట్టెలు వంటి వాటిని సాయంగా పంపారు. ఇలా 250కి పైగా ట్రక్కుల్లో ఇప్పటివరకు మానవతాసాయాన్ని అందజేశారు. గ్రామస్థుల ప్రయత్నాలను నుహ్ డిప్యూటీ కమిషనర్ అఖిల్ పిలాని ప్రశంసించారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఆ మూడు పార్టీలు దూరం

న్యూదిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికలకు మూడు పార్టీలు దూరంగా ఉన్నాయి. బిజూ జనతాదళ్(బీజేడీ), భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్), శిరోమణి అకాలీదళ్ ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేయలేదు. తాము ఉపరాష్ట్రపతి ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతా దళ్ ప్రకటించింది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే, కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా ఐక్యసంఘటనకు సమదూరం పాటించాలనే పార్టీ విధానం ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. రాజ్యసభలో బీజేడీకి ఏడుగురు ఎంపీల బలం ఉంది. నిరంజన్ బిషి, ఎస్.డియో, ముజిబుల్లా ఖాన్, సుబాశిష్ కుంతియా, మానస్ రంజన్ మంగరాజ్, సమస్మిత్ పాత్ర, దేవాశీష్ సమంతరే ఎంపీలుగా ఉన్నారు. లోక్‌సభలో బీజేడీకి ప్రాతినిధ్యం లేదు. అలాగే, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సారథ్యంలోని భారత రాష్ట్ర సమితి సైతం ఎన్నికలను బహిష్కరించింది. రాష్ట్ర రైతులు తీవ్రమైన యూరియా కొరతను ఎదుర్కొంటున్నారని, గత 20 రోజులుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను బీఆర్ఎస్ ఎంత కోరినా స్పందించలేదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఇందుకు నిరసనగా, 71 లక్షల మంది తెలంగాణ రైతులకు సంఘీభావంగా బీఆర్ఎస్ ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనడం లేదని చెప్పారు. బీఆర్ఎస్‌కు రాజ్యసభలో నలుగురు ఎంపీలు ఉండగా, లోక్‌సభలో ప్రాతినిధ్యం లేదు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు తాము దూరంగా ఉంటున్నట్టు శిరోమణి అకాలీ దళ్ ప్రకటించింది. కనీవినీ ఎరుగని రీతిలో వరదల గుప్పిట్లో పంజాబ్ చిక్కుకుందని, ఇటు కేంద్రం నుంచి కానీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి కానీ రాష్ట్రానికి ఎలాంటి సాయం అందలేదని తెలిపింది. ఎప్పుడు సంక్షోభం వచ్చినా పంజాబ్, పంజాబీలు దేశం కోసం నిలబడతారని, వరదల కారణంగా పంజాబీలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని శిరోమణి అకాలీదళ్ ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలోని మూడింట ఒకవంతు జలదిగ్బంధంలో ఉందని, ఇళ్లు, పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. అకాలీదళ్ నుంచి కేంద్ర మాజీమంత్రి హర్‌సిమ్రత్ కౌర్ మాత్రమే ఎంపీగా ఉన్నారు.

జగదీప్ ధన్కర్ ఎక్కడ?

ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రారంభ వేళ జైరాం రమేశ్

న్యూదిల్లీ: జగదీప్ ధన్కర్ ఎక్కడ? అని భారతదేశ తదుపరి ఉపరాష్ట్రపతిని ఎన్నుకునే ఓటింగ్ మంగళవారం ఉదయం ప్రారంభమైన సమయంలోనే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ మరోసారి ప్రశ్నించారు. ఆరోగ్య సమస్యలను పేర్కొంటూ జులై 21న ధన్కర్ అకస్మాత్తుగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆయనతో సంబంధాలు లేకుండా ఉన్నారు. 'జగదీప్ ధన్కర్ 50 రోజులుగా అసాధారణ మౌనాన్ని కొనసాగిస్తున్నారు' అని జైరాం రమేశ్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఈరోజు తన వారసుడి కోసం ఎన్నికలు జరుగుతున్నందున మోదీ ప్రభుత్వం రైతులను తీవ్రంగా నిర్లక్ష్యం చేయడం, అధికారంలో ఉన్నవారి 'అహంకారం' వల్ల ఎదురయ్యే ప్రమాదాలు మొదలైన వాటిపై తన ఆందోళనలను వ్యక్తం చేసిన తర్వాత ఉపరాష్ట్రపతి పదవికి ఊహించని రాజీనామా తర్వాత దేశం ఆయన మాట్లాడటానికి వేచి ఉంది' అని అన్నారు. ధన్కర్ ఆకస్మిక నిష్క్రమణ రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఆయన రాజీనామా తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి 'ఆయనకు మంచి ఆరోగ్యం' కోరుకుంటూ సంక్షిప్త వీడ్కోలు ప్రకటన వచ్చింది. కానీ ప్రభుత్వం నుంచి వివరణాత్మక వ్యాఖ్య లేదు. ధన్కర్ కొన్ని నిర్ణయాలతో మోదీ ప్రభుత్వానికి కోపం తెప్పించాడని, ఆయన రాజీనామా చేయవలసి వచ్చిందని చాలా మంది భావిస్తారు. అయితే కేంద్ర హోం అమిత్ షా దానిని తిరస్కరించారు. 'దానిని ఎక్కువగా సాగదీయకూడదని... సానుకూల కథనాలపై' దృష్టి పెట్టాలని సూచించారు. రాజస్థాన్ మాజీ శాసన సభ్యుడిగా ధన్కర్ తన పెన్షన్‌ను తిరిగి ప్రారంభించడానికి దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. 1993-1998 మధ్య కాంగ్రెస్ ఎమ్మెల్యేగా రాష్ట్ర అసెంబ్లీలో కిషన్‌గఢ్‌కు ప్రాతినిధ్యం వహించారు. జులై 2019 వరకు ఆయన పెన్షన్ పొందినప్పటికీ, పశ్చిమ బెంగాల్ గవర్నర్ అయినప్పుడు అది నిలిచిపోయింది. ప్రస్తుతం 74 ఏళ్ల ధన్కర్ నెలకు రూ.42 వేల పెన్షన్‌కు అర్హులు. రాజీనామా చేసినప్పటి నుంచి నెలకు పైగా ఇంటికే పరిమితమైన తర్వాత దంత పరీక్ష కోసం సెప్టెంబరు 1న ఆయన తన అధికారిక నివాసం నుంచి బయటకు వచ్చారు.

జైల్లో ఉండలేను... విషమివ్వండి

కోర్టును కోరిన నటుడు దర్శన్

బెంగళూరు: తాను చాలా రోజులుగా సూర్యకాంతిని చూడలేదని... తనకు 'విషం' ఇవ్వాలని జైలులో ఉన్న కన్నడ నటుడు దర్శన్ మంగళవారం కోర్టును కోరారు. రేణుకస్వామి హత్య కేసులో విచారణ సందర్భంగా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా సిటీ సివిల్... సెషన్స్ కోర్టు ముందు హాజరయిన దర్శన్... తన చేతుల్లో ఫంగస్ పెరిగిందని కూడా అన్నారు. జైలులో బయటకు అడుగు పెట్టడానికి అనుమతించకపోవడంతో చాలా రోజులుగా సూర్యకాంతిని చూడలేదని ఆయన అన్నారు. తన బట్టలు దుర్వాసన వస్తున్నాయని, జైలులో తాను తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నానని తెలిపారు. ఆ తర్వాత తనకు విషం ఇవ్వాలని న్యాయమూర్తిని అభ్యర్థించారు. అభియోగాల నమోదు కోసం కోర్టు ఈ విషయాన్ని సెప్టెంబరు 19కి వాయిదా వేసింది. కర్నాటక హైకోర్టు నటుడికి ఇచ్చిన బెయిల్‌ను సుప్రీం కోర్టు గత నెలలో రద్దు చేసింది. అతన్ని కస్టడీలోకి తీసుకోవాలని ఆదేశిస్తూ, న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం... అతను సాక్షులను ప్రభావితం చేయగలడని, బెయిల్‌పై బయట ఉంటే విచారణపై ప్రభావం చూపవచ్చని పేర్కొంది. కర్నాటక హైకోర్టు దర్శన్‌కు బెయిల్ మంజూరు చేసేటప్పుడు అతని సెలబ్రిటీ హోదాను ఒక అంశంగా పరిగణించి 'స్పష్టమైన వక్రబుద్ధి' కి పాల్పడిందని కూడా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆగస్టు 14న దర్శన్‌ను అరెస్టు చేసి తిరిగి జైలుకు పంపారు. దర్శన్, నటి పవిత్ర గౌడ, అనేక మందితో కలిసి పవిత్రకు అశ్లీల సందేశాలు పంపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 33 ఏళ్ల రేణుకస్వామి అనే అభిమానిని అపహరించి హింసించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

రాజ్ కుంద్రాకు సమన్లు

ముంబై: ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేరకు మోసం చేసిన కేసులో బాలీవుడ్ నటి శిల్పాశెట్టి, రాజ్‌కుంద్రా దంపతులు నిందితులుగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి తాజాగా రాజ్ కుంద్రాకు ముంబై ఆర్థిక నేరాల విభాగం అధికారులు సమన్లు జారీ చేశారు. సెప్టెంబరు 15న కేసు విచారణకు హాజరుకావాలని రాజ్‌కు అధికారులు సూచించారు. కేసుకు సంబంధించి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఆడిటర్‌కు కూడా సమన్లు జారీ అయ్యాయి. పెట్టుబడి ఒప్పందానికి సంబంధించి రూ.60 కోట్లు మోసం చేశారని శిల్పాశెట్టి, రాజ్ కుంద్రాపై దీపక్ కొఠారి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు జుహు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ జరుగుతుండగా శిల్పా దంపతులు తరచూ విదేశీ పర్యటనలకు వెళుతుండటంతో అధికారులు ఇటీవల వారికి లుకౌట్ నోటీసులు జారీ చేశారు.

పాక్ దుష్ప్రచారం

తిప్పికొట్టిన భారత్

న్యూదిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో పెద్దఎత్తున ఫేక్ ప్రచారానికి తెరలేపిన పాకిస్థాన్... దాన్ని ఇంకా కొనసాగిస్తోంది. సామాజిక మాధ్యమాల వేదికగా భారత్‌పై విషం చిమ్ముతోంది. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొన్ని అనుకూల ఎక్స్ హ్యాండిళ్ల నుంచి ఒకేతరహా ప్రచారం చేయిస్తోంది. దీన్ని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ సమర్థంగా తిప్పికొట్టింది. ప్రధాని నరేంద్రమోదీ, సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది మధ్య చెడిందంటూ ఓ కల్పిత ప్రచారానికి పాక్ తెరతీసింది. యుద్ధ సామగ్రిని అభివృద్ధి చేయకుండా పాక్‌తో వివాదం పెట్టుకోవడం భారత సైన్యానికి ఏమాత్రం ఇష్టం లేదనేది ఆ పోస్టుల సారాంశం. ఒకేతరహా సందేశం వేర్వేరు అకౌంట్ల నుంచి రావడంతో పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం అప్రమత్తమైంది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్న ఈ సమాచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టంచేసింది. ఇలాంటి అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని పౌరులకు సూచించింది

ఆశ లేకపోతే జీవితమే లేదు

సీఎం పదవిపై డీకే

బెంగళూరు: ప్రతి మనిషికీ జీవితంలో ఆశ అనేది ఉంటుందని, ఆశ లేకపోతే జీవితమే లేదని కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. 'ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్ 2025'లో డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండో అర్ధభాగంలో ముఖ్యమంత్రి పదవి చేపడతారా అని అడిగిన ప్రశ్నకు ఆయన ఆసక్తికరంగా బదులిచ్చారు. నేరుగా ముఖ్యమంత్రి పదవి గురించి ప్రస్తావించకుండా.. 'దీనికి నేను జవాబు చెప్పను. కాలమే అన్నింటికీ సమాధానం చెప్పాలి... చెబుతుంది కూడా. ఈ ప్రపంచంలో ఎవరైనా ఆశతోనే జీవించాలి. ఆశ లేకపోతే జీవితమే లేదు' అని అన్నారు. అయితే, కర్నాటకలో సమష్టి నాయకత్వం కొనసాగుతోందని డీకే చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తమకు అత్యున్నతమని అన్నారు. అధిష్ఠానం ఆదేశాల మేరకే నడుచుకుంటానని చెప్పారు. అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామన్నారు. రెండున్నరేళ్ల అనంతరం ముఖ్యమంత్రి పీఠం మార్పు ఉంటుందని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూడా దాన్నే విశ్వసిస్తున్నారు.

పాత నిల్వలకూ కొత్త ఎంఆర్‌పీ

జీఎస్టీ రేట్లపై కేంద్రం నిర్ణయం

న్యూదిల్లీ: వస్తు, సేవలు పన్ను (జీఎస్టీ) రేట్లకు సంబంధించి అటు వినియోగదారులకు, ఇటు కంపెనీలకు ఊరటనిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పాత స్టాక్‌కూ గరిష్ఠ రిటైల్ ధరను (ఎంఆర్‌పీ) సవరించే అవకాశం కల్పించింది. దీంతో కొత్త స్టాక్ వచ్చేంత వరకూ వేచి చూడాల్సిన అవసరం లేకుండా... పాత స్టాక్ ధరలు కూడా తగ్గనున్నాయి. దీనివల్ల ముఖ్యంగా వినియోగదా రులకు ప్రయోజనం చేకూరనుంది. జీఎస్టీ శ్లాబులకు సంబంధించి ఇటీవల జీఎస్టీ కౌన్సిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇకపై 5, 18 శాతం శ్లాబ్‌లు మాత్రమే ఉండనున్నాయి. దీంతో నిత్యం వినియోగించే వస్తువులు ఈ రెండు శ్లాబుల పరిధిలోనే ఎక్కువగా ఉన్నాయి. సెప్టెంబర్ 22 నుంచి మార్పులు అమల్లోకి రానున్నాయి. అయితే, ఇప్పటికే పెద్దఎత్తున మార్కెట్‌లోకి స్టాక్ వెళ్లిపోయిన నేపథ్యంలో జీఎస్టీ రేట్ల సవరణ వల్ల కలిగే ప్రయోజనం వినియోగదారులకు చేరడానికి ఇంకాస్త సమయం పడుతుంది. దీంతో అమ్ముడు కాని స్టాక్‌కూ సవరించిన ఎమ్మార్పీని నిర్ణయించుకోవచ్చంటూ తయారీదారులు, ప్యాకర్లు, దిగుమతిదారులకు కేంద్రం అవకాశం కల్పించింది. సవరించిన ఎమ్మార్పీని స్టాంపింగ్, స్టిక్కర్ లేదా ఆన్‌లైన్ ప్రింటింగ్ ద్వారా మార్చుకోవచ్చని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశించింది. పాత ఎమ్మార్పీ కొనసాగించాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. పన్ను తగ్గింపు/పెంపునకు అనుగుణంగా సవరించిన ధర ఉండాలని పేర్కొంది. ఈ మేరకు పత్రికా ప్రకటన ఇవ్వాలని తయారీదారులు, ప్యాకర్లకు సూచించింది. స్టాక్ పూర్తయ్యేంత వరకు లేదా డిసెంబర్ 31 వరకు ఈ ఆదేశాలు వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

దిగొచ్చిన ఫడ్నవిస్ సర్కారు

17 నుంచి 'కున్బీ' కులధృవీకరణ పత్రాలు

ముంబై: మహారాష్ట్రలో రగులుతున్న మరాఠా రిజర్వేషన్ల మంట చల్లార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మరాఠా రిజర్వేషన్ల కోటా అమలు చేయాల్సిందేనంటూ మనోజ్ జరాంగే ఐదు రోజుల నిరాహార దీక్ష చేసిన అనంతరం సర్కార్ దిగివచ్చింది. ప్రధానమంత్రి మోదీ పుట్టినరోజు కానుకగా సెప్టెంబర్ 17 నుంచి మరాఠాలకు 'కున్బీ' కులధృవీకరణ పత్రాల జారీకి ఆమోదం తెలిపింది. అయితే, ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే మరింత తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని మనోజ్ జరాంగే హెచ్చరించారు. మరాఠాలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మనోజ్ జరాంగే ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. 30 వేల మందికి పైగా ప్రజలు ఆయనకు మద్దతుగా నినదించారు. దీంతో ముంబై మహానగరంలో ఒక్కసారిగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రభుత్వం మరాఠా సమాజం రిజర్వేషన్ డిమాండ్లను నెరవేర్చకపోతే ముంబైకి పాలు, కూరగాయల సరఫరా నిలిపివేస్తామని మనోజ్ హెచ్చరించారు. ఉద్యమం నానాటికీ తీవ్రమవుతుండటంతో ఫడ్నవీస్ ప్రభుత్వం దిగివచ్చింది. సెప్టెంబర్ 17న మరాఠ్వాడ ముక్తి దివస్ పురస్కరించుకుని 'కున్బీ' కులధృవీకరణ పత్రాలు జారీ చేస్తామని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మనోజ్ ఐదు రోజుల అనంతరం నిరసన దీక్ష విరమించాడు. 1918 హైదరాబాద్ గెజిట్ ప్రకారం ప్రభుత్వ తీర్మానం అమలు చేయనుంది. ఈ కోటా కింద వేలాదిమంది మరాఠాలు వెనుకబడిన తరగతుల కేటగిరీ కింద రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

హిమాచల్‌కు రూ.1,500 కోట్ల సాయం

వరద ప్రాంతాల్లో మోదీ ఏరియల్ సర్వే

ధర్మశాల: విపత్తుతో దెబ్బతిన్న హిమాచల్ ప్రదేశ్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రూ.1,500 కోట్ల తక్షణ సహాయాన్ని ప్రకటించారు. ప్రధాని మోదీ మంగళవారం విపత్తు ప్రభావిత మండి, కులు జిల్లాల్లో వైమానిక సర్వే నిర్వహించారు. రాష్ట్రంలో వరదలు, కొండచరియలు విరిగిపడిన పరిస్థితిని సమీక్షించిన ప్రధాని... మృతుల బంధువులకు రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.50 వేలు ప్రకటించారు. మండి, కులు జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలను ప్రధాని వైమానిక సర్వే నిర్వహించి, ఆపై చేపట్టిన సహాయ, పునరావాస చర్యలను సమీక్షించడానికి, నష్టాన్ని అంచనా వేయడానికి కాంగ్రాలో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్ సుఖు, గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, బీజేపీ నాయకులు, బాధిత కుటుంబాలు, కాంగ్రాలో సహాయ సేవలలో నిమగ్నమైన వ్యక్తులతో జరిగిన సమావేశంలో ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పునరుద్ధరణ మరియు పునర్నిర్మాణానికి మోదీ అన్ని సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌డీఆర్ఎఫ్, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రెండవ విడతలో ముందస్తుగా రూ.1,500 కోట్ల ఆర్థిక సహాయం అందించబడుతుంది. మొత్తం ప్రాంతాన్ని, ప్రజలను తిరిగి వారి కాళ్ల మీద వారు నిలబడేలా బహుముఖ దృక్పథాన్ని తీసుకోవాలని మోదీ కోరారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్లను పునర్నిర్మించడం, జాతీయ రహదారుల పునరుద్ధరణ, పాఠశాలలను పునర్నిర్మించడం, పీఎంఎన్ఆర్ఎఫ్ కింద ఉపశమనం అందించడం, పశువులకు మినీ కిట్లను విడుదల చేయడం వంటి అనేక మార్గాల ద్వారా ఇవి జరుగుతాయి. విపత్తులో ప్రభావితమైన కుటుంబాలను కూడా మోదీ కలిశారు. బంధువులను కోల్పోయిన వారికి ఆయన సంతాపం తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో కేంద్రం హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందని, సాధ్యమైన అన్ని సహాయాన్ని అందిస్తుందని ప్రధాని అన్నారు. రాష్ట్రాలకు ముందస్తు చెల్లింపులు సహా విపత్తు నిర్వహణ నిబంధనల ప్రకారం అన్ని సహాయం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. సహాయ, ప్రతిస్పందన పనులలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సైన్యం, రాష్ట్ర పరిపాలన, ఇతర సేవా ఆధారిత సంస్థల సిబ్బంది కృషిని ఆయన ప్రశంసించారు. రాష్ట్ర మెమోరాండం, కేంద్ర బృందాల నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం అంచనాను మరింత సమీక్షిస్తుందని ఆయన అన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి ఎల్వోసీ అందజేత

విశాలాంధ్ర, షాద్‌నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ రాంనగర్ కాలనీకి చెందిన శబనా బేగంకి రూ.1లక్షల 50వేల విలువ గల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఎమ్మెల్యే దృషికి రావడంతో వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎల్‌ఓసిని ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ లో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయస్థితిలో ఉన్న నిరుపేదలకు వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం బాధితులకు అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అగ్గనూర్ విశ్వం, కొంకళ్ళ చెన్నయ్య, రాజేందర్ రెడ్డి, అగ్గనూర్ బస్వం అందే మోహన్, రవి కుమార్,సతీష్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ సందర్శన

విశాలాంధ్ర, హైదరాబాద్ : మంగళవారం రంగారెడ్డి జిల్లాలోని రాజేందర్ నగర్ ఈవీఎం గోడౌన్స్‌ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామాగ్రిని గదులను అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భాంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ గోదాము సీల్ ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి యంత్రాలను పరిశీలించడం జరిగింది. అనంతరం వారి సమక్షంలో సీల్ వేయించడం జరిగినది.ఈ కార్యక్రమంలో రాజేందర్ నగర్ తహశీల్దార్, వేర్ హౌస్ ఇంచార్జీ బొమ్మ రాములు, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం నిత్యం పరితపించిన కవితామూర్తి కాళోజీ : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రజల కోసం నిత్యం పరితపించిన కవితామూర్తి కాళోజీ ఆశయాలు భవిష్యత్ తరాలకు ఆదర్శమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధర్యంలో ఏర్పాటు చేసిన కాళోజీ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగ కలెక్టరు మాట్లాడుతూ తెలంగాణ మాండలికానికి నిలువుటెత్తు నిదర్శనం కాళోజీ అని అన్నారు. పుట్టుక నీది, చావు నీది బతుకంతా దేశానిది అన్న కాళోజి మాటలు అందరికి ఆదర్శమని అన్నారు. తెలంగాణ ప్రజల కోసం తన కలం ద్వారా తెలంగాణ భాష, యాస ఎంత మంచిగుంటుందో రాసి మరీ చూపించారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా నేరేడ్ మెట్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు కలిసిన తమ సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ కులవృత్తి వాసులకు స్థలం కేటాయించాలని, 250 యూనిట్ల ఉచిత కరెంటు సబ్సిడీని పునరుద్ధరించాలని, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలలో రేషన్ కార్డులు, పింఛన్లు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, హెల్త్ అండ్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. నాయి బ్రాహ్మణ వాసుల వినతిని శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. బీఆర్ఎస్ నాయకులు మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, నేరేడ్ మెట్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు అంతయ్య, సభ్యులు శ్రీనివాసులు, మహదేవ్, రవీందర్, శ్రీనివాసు, సాయిబాబా, రాజు, సాయినాథ్, ముత్యాలు, భూమయ్య, యాదగిరి, సతీష్, నరసింహ, వినోద్ కుమార్, నిరంజన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు : సీఎస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈ నెల 17న నిర్వహించే తెలంగాణా ప్రజాపాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ఏర్పాట్లపై నేడు డా.బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో నేడు ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సి.ఎస్. రామకృష్ణారావు మాట్లాడుతూ, ఈనెల 17న ఉదయం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నివాళు లర్పిస్తారని, అనంతరం పబ్లిక్ గార్డెన్ లో జరిగే ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొంటారని వివరించారు. గన్-పార్క్ వద్ద జరిగే కార్యక్రమానికి జీ.హెచ్.ఎం.సి కమీషనర్ నోడల్ అధికారిగా ఉంటారని, గన్-పార్క్ కు ఫ్లోరల్ డెకరేషన్‌తో పాటు, షామియానా తదితర ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా నగరంలోని అని ప్రధాన కార్యాలయాలు, విగ్రహాలు, పర్యాటక ప్రదేశాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని అన్నారు. పబ్లిక్ గార్డెన్ లో నిర్వహించే సమావేశానికి తగు ఏర్పాట్లను చేపట్టాలని రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిదాయకంగా జరిగేలా చూడాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు తగు తాగునీరు, శానిటేషన్ ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి వీవీఐపీలతో పాటు ప్రజాప్రతిధులందరికీ ఆహ్వాన పత్రికలను అందచేయాలని ఆదేశించారు. ఈ సమావేశానికి హెూమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవీ గుప్తా, డీజీపీ డా. జితేందర్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సీవీ ఆనంద్, ఇంటలిజెన్స్ అడిషనల్ డీజీ శివధర్ రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, ఫైర్ సర్వీసుల డీజీ నాగిరెడ్డి, మున్సిపల్ శాఖ కార్యదర్శి ఇలంబర్తి, ప్రోటోకాల్ శాఖ డైరెక్టర్ శివలింగయ్య, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ ప్రియాంక, ఎస్.పి.డీ.సీ.ఎల్ ఎండి ముష్రాఫ్, జలమండలి ఎండి అశోక్ రెడ్డి తదితర అధికారులు హాజరయ్యారు.

సామాజిక తెలంగాణ సాధనే ధ్యేయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సామాజిక తెలంగాణ సాధనే తమ ధ్యేయమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తినే ఆదర్శంగా తీసుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం గొంగళి పురుగునైనా ముద్దు పెట్టుకుంటానని కేసీఆర్ చెప్పిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. తాము కూడా సామాజిక తెలంగాణ కోసం ఎంతటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొంటామన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సామాజిక తెలంగాణ కోసం లెఫ్ట్ వింగ్, రైట్ వింగ్ నాయకులు, మేధావులను కలుస్తామన్నారు. సమాజంలో అన్ని వర్గాల అభిప్రాయాలను తీసుకొని తెలంగాణ సమాజాన్ని మరింత పటిష్టం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. మూడో సారి గెలిస్తే కేసీఆర్ సామాజిక తెలంగాణ చేసే వారని కవిత అన్నారు. వారి అజెండాను జాగృతి ద్వారా ముందుకు తీసుకెళ్తామన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి కేసీఆర్‌కు కవిత షాక్ ఇచ్చారు. బీఆర్ఎస్ మద్దతివ్వని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వానికి కవిత మద్దతు పలికారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని పార్టీలకు అతీతంగా తెలంగాణ బిడ్డగా భావించాలని సూచించారు. రాజ్యాంగ పరిరక్షణకు సంబంధించి ఎంతో అవగాహన ఉన్న ఆయన ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే...ఆ పదవికే వన్నె తెస్తారన్నారు. ఎన్నికల కమిషనర్‌గా టీఎన్ శేషన్ గతంలో ఆ పదవికి ఎలా వన్నె తెచ్చారో...జస్టిస్ సుదర్శన్ రెడ్డి కూడా ఆ విధంగా పదవికి వన్నె తెస్తారని కవిత ఆశాభావం వ్యక్తం చేశారు.మొన్నటి వరకు కాళేశ్వరం కూలిందన్న రేవంత్ రెడ్డి...అదే ప్రాజెక్ట్ లోని మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు ఎలా తెస్తున్నారని కవిత ప్రశ్నించారు. ఈ ప్రాజెక్ట్‌లో రేవంత్ రెడ్డి భారీగా అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు తెస్తే 1500 కోట్లు మాత్రమే ఖర్చు అవుతాయని గుర్తు చేశారు. కానీ మల్లన్న సాగర్ నుంచి నీళ్లు తెస్తామంటూ రూ. 7500 కోట్లు ఖర్చు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారన్నారు. మేఘా కృష్ణారెడ్డి మరిన్ని మేడలు కట్టేందుకు రేవంత్ సహకరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజల సొమ్ము రేవంత్ ఇంటి సొమ్ము కాదన్నారు. ప్రాజెక్ట్ విలువ రూ. 7500 కోట్లకు ఎందుకు చేరిందో చెప్పే వరకు ప్రశ్నిస్తామన్నారు.

ప్రజల్లో స్ఫూర్తి నింపిన కాళోజీ, చాకలి ఐలమ్మ

కాళోజీ జయంతి సందర్భంగా జాగృతి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కవిత నివాళులర్పించారు. బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగాను ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించి మాట్లాడారు. తెలంగాణ ప్రజలను కదలించిన కవి కాళోజీ అని అన్నారు. పుట్టుక నీది, చావు నీది బతుకంతా తెలంగాణది అని ఆయన మనలో స్ఫూర్తి నింపారని అన్నారు. కవికి మరణం ఉండదని...కాళోజీఅనుసరించిన విలువలు, కవిత్వం ఇప్పటికీ ఆయనను గుర్తు చేసుకునేలా చేస్తున్నాయన్నారు. ఒక మహిళ అనుకుంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించిన వీర వనిత చాకలి ఐలమ్మ అన్నారు. అలాంటి వీరత్వం తెలంగాణ రక్తంలోనే ఉందని...చాకలి ఐలమ్మ స్ఫూర్తి తో ముందుకు కదలాలని సూచించారు. సమావేశంలో ప్రముఖ కవులు, రచయితలు ఉషారాణి, డాక్టర్ కాంచనపల్లి, డాక్టర్ చమన్ సింగ్, లక్ష్మీ నారాయణ, తిరుమల శ్రీనివాస్ ఆర్య, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

గొప్ప ప్రజాకవి కాళోజీ

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ సమాజాన్ని తన కవితలతో జాగృతం చేసిన గొప్ప ప్రజాకవి కాళోజీ అని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. మంగళవారం ప్రజాకవి కాళోజీ జయంతినీ పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కమిషనర్ ఆర్ వి కర్ణన్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తెలంగాణ భాషా సాహిత్యానికి కాళోజీ చేసిన సేవలన కమిషనర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తెలంగాణ యాస, భాష కోసం వారు చేసిన కృషికి గుర్తింపుగా కాళోజీ జయంతినీ తెలంగాణ భాషా దినోత్సవ జరుపుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. తెలంగాణ భాషకు అస్తిత్వ స్పృహను పెంచడంలో కాళోజీది కీలకపాత్ర అని కొనియాడారు. కాళోజి స్ఫూర్తి, తెలంగాణ సాధనలో, ప్రగతిలో ఇమిడి ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ గీతా రాధిక, సి.ఈ సహదేవ్ రత్నాకర్, విజిలెన్స్ అదనపు ఎస్పీ సుదర్శన్, డీఎస్పీ నరసింహ రెడ్డి, పిఆర్ఓ మామిండ్ల దశరథం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వైతాళికుడు.. కాళోజీమ : జేసీ

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రజా వైతాళికుడు కాళోజి నారాయణరావుని అదనపు కలెక్టర్ కదిరవన్ పలని అన్నారు అన్నారు. మహాకవి ప్రజాకవి కాళోజి నారాయణరావు 111వ జయంతిని కలెక్టరేట్‌లో రాష్ట్ర అధికారిక కార్యక్రమంగా ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ జి ముకుందరెడ్డి, డిఆర్ఓ ఈ వెంకట చారి లతో కలిసి కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కాళోజి ప్రజాకవిగా స్మరించుకుంటూ తన ప్రభావంతమైన ఉపన్యాసాలు, సమాజానికి చేసిన విశేష కృషిని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 9న ఆయన జన్మదినాన్ని తెలంగాణ భాషా దినోత్సవం గా జరుపుకోవడం ఆయన భాషా, సాహిత్య సేవలకు ఇచ్చిన గౌరవమని పేర్కొన్నారు. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో సమాన ప్రావీణ్యం కలిగిన కాళోజీ తన కవిత్వం ద్వారా సామాజిక సమస్యలు, ప్రజల కష్టాలు, పోరాటాలు, ఆశయాలను ప్రతిబింబించారు. ఆయన రచనలు కేవలం సాహిత్యమే కాకుండా సామాజిక చైతన్యానికి ఆయుధమని అధికారులందరూ గుర్తు చేశారు. గ్రంథాలయ ఉద్యమం, సత్యాగ్రహం, తెలంగాణ ఉద్యమం, రజాకార్ల వ్యతిరేక పోరాటం వంటి అనేక ప్రజా ఉద్యమాలలో కాళోజి విశేష భాగస్వామ్యం ఉందని అన్నారు. ఆయన సాహిత్య, సామాజిక సేవలకు గాను భారత ప్రభుత్వం 1992లో పద్మ విభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసిందని. కాళోజీ స్మారకార్థం తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆయన జయంతి సందర్భంగా ప్రతిష్టాత్మకంగా కాళోజి నారాయణ రావు అవార్డును విశిష్ట కవులు, రచయితలకు ప్రదానం చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఉపసం చాలకులు జి ఆశన్న, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజి, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

ఐలమ్మ మహిళా యూనివర్సిటీ సందర్శన

విశాలాంధ్ర-హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లాలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ తెలంగాణ కే తలమానికంగా ఉండడంతో నూతన భవనాల నిర్మాణాలు, పాత భవనాల పునరుద్ధరణ, తదితర అంశాలపై యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సూర్య ధనుంజయ్, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో కలసి యూనివర్సిటీ దర్బార్ హాల్ లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన భవనాలు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి దార్శనికత, ఆలోచన లకు అనుగుణంగా విశ్వ విద్యాలయ అభివృద్ధి, మహిళా శక్తిని మరింతగా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. నూతన భవనాల నిర్మాణాలతో పాటు పాత భవనాల పునరుద్ధరణ పనులను త్వరితగతిన చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున నిర్దేశించిన సమయానికి పనులను పూర్తిచేయాలని, ఎక్కడ రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలతో పనులు ఉండాలని అన్నారు. పనుల పరిశీలనకై నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. యూనివర్సిటీలోని నూతనంగా చేపట్టే అకాడమిక్ బ్లాక్, హాస్టల్, ఆడిటోరియం, స్పోర్ట్స్ బ్లాక్, గెస్ట్ హౌస్ అలాగే పలు ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. అదే విధంగా పాత భవనాల పునరుద్ధరణలో భాగంగా కెమిస్ట్రీ, ఫిజిక్స్ బ్లాక్స్‌లను కూడా ఆమె పరిశీలించారు. తదుపరి యూనివర్సిటీలోని విద్యార్థుల సంఖ్య 7వేలకు పైగా ఉందని, వసతి గృహంలో దాదాపు వెయ్యికి పైగా విద్యార్థులు ఉంటున్నారని అలాగే వివిధ విభాగలలో అధ్యాపకులు ఐదు వందల వరకు ఉన్నారని కలెక్టర్ కు ప్రిన్సిపాల్ వివరించారు. తదుపరి రంగ్ మహల్, సిమెంట్రీ, హెబ్రా హౌస్ ప్రాంతాలలోని పురాతన భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లోక పావని, ఆర్డీవో రామకృష్ణ, ఈ ఈ అనిత, డి ఈ ఆశీర్వాదం, డాక్టర్ అరుణ, డాక్టర్ విజయలక్ష్మి, వివిధ విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యం కావాలి : ధనుంజయనాయుడు

విశాలాంధ్ర, హైదరాబాద్ : బీసీల రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాలనుకోవడం విఫలయత్నమని గతంలో అనేక మంది రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసి చేతులు కాల్చుకున్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలని ఒక రాజకీయ పార్టీని మైంటైన్ చేయడం దుస్సాధ్యమని చరిత్ర చెపుతున్న సత్యమని బీసీ నేత ధనుంజయ నాయుడు మంగళవారం ఆయన హైదరాబాదులోని బీసీహక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా బీసీ కులాలు ఐక్యం చేయకుండా పొట్టు మీద ఇల్లు అలికినట్టు హడావుడిగా పార్టీ ఏర్పాటు చేస్తే అది నిలబడకపోతే అగ్రవర్ణాల ముందు నవ్వుల పాలు కావాల్సి వస్తుందని, ముందు బీసీ కులాల ఐక్య జేఏసీ ఏర్పాటు చేసి, బీసీల ఓటు బీసీలకు వేసుకునే విధంగా ముందు బీసీ కులాలను చైతన్యపరిచి ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఇప్పుడు బీసీ పార్టీ పెడతామని ప్రకటించిన వారందరూ ఏదో ఒక రాజకీయ పార్టీ అండ చూసుకొని ఎమ్మెల్సీలుగా రాజ్యసభలుగా ఎంపికయ్యారే తప్ప బీసీ కులాల వల్ల ఎవరు పదవులు పొందలేదనే అక్షర సత్యాన్ని గ్రహించాలన్నారు. బీసీలతో పాటు అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను కలుపుకొని ఒక ఐక్య కార్యాచరణతో ముందుకు సాగి నిర్దిష్ట ప్రణాళికతో ముందుగా మైదోవ వచనం చేసి సాధ్యాసాధ్యాలను పరిశీలన చేసి అత్యంత పకడ్బందీతో చేయాల్సిన దానిని ఆశామాషిగా తీసుకోవడం విజ్ఞుల లక్షణం కాదని ఆయన హితవు పలికారు.

రైతాంగ సాయుధ పోరాటల వార్షికోత్సవాలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: ఈ నెల 11 నుంచి 17 వరకు తెలంగాణ రైతంగ సాయుధ పోరాటల వార్షిక ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపు నిచ్చారు. శేరలింగంపల్లి నియోజకవర్గం కౌన్సిల్ సమావేశం ఇజ్జత్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో. కెజసుధాకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా సీపీఐ పార్టీ కార్యదర్శి పాల మాకుల జంగయ్య పాల్గొని మాట్లాడుతూ ఈనెల 11 నుండి 17 వరకు తెలంగాణ రైతన్న సాయిధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా శేర్లింగంపల్లిలో భారీ బహిరంగ సభలో ఏర్పాటు చేయాలన్నారు. శేరిలింగంపల్లిలోని వివిధ బస్తీలలో నెలకొన్న ప్రజా మౌలిక సమస్యలను పాలకులు వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, రాష్ట్ర సమితి సభ్యులు కె.రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభు లింగం, రాష్ట్ర సమితి సభ్యులు టి.రామకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు కె.చందు యాదవ్, టి.వరలక్ష్మి, తుపాకుల రాములు, సురేష్, ఎస్.కొండలయ్య, బి.నారాయణ, ఎం.వెంకటేష్, చంద్రమ్మ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

కాళోజీ జయంతి

విశాలాంధ్ర, హైదరాబాద్ : పద్మవిభూషణ్, ప్రజాకవి, స్వర్గీయ శ్రీ కాళోజీ నారాయణరావు 111వ జయంతి మంగళవారం ఖైరతాబాద్ లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా జలమండలి పర్సనల్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, ఆపరేషన్స్ డైరెక్టర్ వినోద్ భార్గవ, సీజీఎమ్ లు పద్మజ, సురేష్ లతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పరిశుభ్రతకు పెద్ద పీట : కమిషనర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : జియాగూడ స్లాటర్ హౌజ్ ఆధునికీకరణ పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలనీ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మంగళవారం కార్వాన్ సర్కిల్‌లోని జియాగూడ కమేళా స్లాటర్ హౌస్‌ను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, చీఫ్ ఇంజనీర్ (మెయింటెనెన్స్) సహదేవ్ రత్నాకర్, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ వకీల్ లతో కలసి తనిఖీ చేశారు. స్లాటర్ హౌస్ ఆధునికీకరణకు ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందున త్వరగా టెండర్లను పిలిచి పనులను ప్రారంభం అయ్యేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల ఉండేలా చూడాలని కమిషనర్ ప్రాజెక్టు ఇంజినీర్లకు ఆదేశించారు. పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ప్రజారోగ్య రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త, నిర్మాణ వ్యర్థాలు తక్షణమే తొలగించాలని, శుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ కాలనీలో పర్యటన



విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బిజెఆర్ నగర్‌లో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ఉన్న ప్రధాన సమస్యలు కమిటీ హాల్ నిర్మాణము కొరకు అంచనాలను సిద్ధం చేయాలని, పెండింగ్‌లో ఉన్న రోడ్లను పూర్తి చేయాలని. ట్రాన్స్ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని స్థానికులు కార్పొ రేటర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. వెంటనే స్పందించి అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఈ. లౌక్య, ఏ.ఈ.ఈ దివ్య జ్యోతి, జలమండలి మేనేజర్ నవీన్, వర్క్ ఇన్స్పెక్టర్ రజనీకాంత్, బాబు, ఆంటోనీ, కిషోర్, కాలనీవాసులు పుట్ట శ్రీనివాస్, నర్సిం గరావు, మహబూబ్, సంతోష్, కృష్ణ స్వామి, ఈశ్వర్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ అనకాపల్లి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు లో.

O.S No 62/2020

బిట్వీన్
మోపాడ లక్ష్మీ............ వాది
అండ్
ఏలూరు నారాయణ రావు వగైరాలు...
ప్రతివాదులు.

టు,
9వ ప్రతివాది
కుడిపూడి భవాని. భర్త విజయకుమార్, వయస్సు 50 సంవత్సరములు, డోర్ నెంబర్ 10-5-64/6.
మసాబ్ ట్యాంక్, శ్రీరామ నగర్ కోలనీ, హైదరాబాద్.

పై వాది దావాలోని షెడ్యూల్ ఆస్తిని పంపకం చేయిపించమని కోరుచూ, పై నెంబరు దావా దాఖలు చేసి యున్నారు. సదరు దావా యందు పై కోర్టు వారు పంపిన సమన్లు మీరు అందుకోనందున, సదరు కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **17-10-2025** వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. కావున ఆరోజు ఉదయం **10:30** నిముసములకు మీరు స్వయంగా గాని, లేక మీ తరుపున లాయర్ గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల అక్షేపణలను తెలుపుకొనవలెను. మీరు హాజరు కాని ఎడల మీ పరోక్షమందు పై దావా తీర్మానించబడునని ఈ పేపర్ ప్రకటన ద్వారా పై కోర్టు వారి ఆర్డర్ ప్రకారం మీకు తెలియజేయడమైనది.

పి.ఏ. నరసింహం.
పి. ఆశిక.
వాది తరపు అడ్వకేట్స్.
అనకాపల్లి.
సెల్: 9246633373.

ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన వ్యక్తి కాళోజీ

విశాలాంధ్ర - తుర్కయంజాల్: ప్రతి ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన వ్యక్తి కాళోజీ అని మహా కవి కాళోజీ సేవలు తెలుగు వారికి మరువలేనివనీ మునిసిపల్ కమీషనర్ అమరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ చైర్మెన్ అమరేందర్ రెడ్డి అధ్యక్షతన కాళోజి 111వ జయంతి వేడుకలు ఉదయం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళోజి ఆశించిన సమసమాజ నిర్మాణం కోసం ప్రతీ ఒక్కరు ముందుకొచ్చి పాటు పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ రోజును తెలంగాణ భాష దినోత్సవం జరుపుకుంటున్నాము. తెలంగాణ భాషాయొక్క గొప్ప దనాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఈఈ బిక్షపతి, ఏఈ ఈ చంద్ర శేఖర్ రెడ్డి, టిపిఓ దినేష్, సానిటరీ ఇన్స్పెక్టర్ వనిత, ఇంచార్జ్ ఆర్ ఐ వినయ్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-దుండిగల్: కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజాకవి,పద్మ విభూషణ్ స్వర్గీయ కాళోజీ నారాయణ రావు 111వ జయంతి సందర్భంగా దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మాండలికంలో సామాజిక రచనలు చేస్తూ ప్రజలను సామాజికంగా మేల్కొల్పిన గొప్ప ప్రజాకవి కాళోజీ నారాయణరావు అన్నారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదుతో గౌరవించిందని తెలియజేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక ఉద్యమకారుడు, కవిగా తెలంగాణ సమాజానికి కాళోజీ చేసిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాకవి కాళోజీ జయంతి

విశాలాంధ్ర , కాప్రా : తెలుగుభాష తియ్యదనాన్ని, తెలంగాణ సంస్కృతి గొప్పదనాన్ని నలుదిశలా చాటిచెప్పిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి తెలంగాణ భాషా దినోత్సవంగా వైభవంగా నిర్వహించారు. మాతృభాష విశిష్టత, తెలంగాణ సంస్కృతీ, వారసత్వ సంపద సౌరభం మంగళవారం డెక్కన్ స్ప్రింగ్ గ్లోబల్ స్కూల్ (డీఎస్ జీఎస్) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం కళ్ళకు కట్టినట్టు కన్పించింది. మంగళవారం జరిగిన కాళోజీ జయంతి ఉత్సవ కార్యక్రమానికి చైర్మన్ కె.నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ కె.నవీన్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ కమలా మనోహర్ రావు, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిశోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని, వైస్ ప్రిన్సిపాల్స్, ప్రీ ప్రైమరీ కో ఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పిన ప్రజాకవి కాళోజీకి ఈ సందర్భంగా వక్తలు ఘనంగా నివాళులర్పించారు.

సమస్యల పరిష్కరించాలని కార్పొరేటర్‌కు వినతి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్సీఐ కాలనీ వాసులు కాలనీలో గల పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్సిఐ కాలనీవాసులు పలు సమస్యలు,చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై ఈ రోజు తమను కలవడం జరిగినది అని, ఎఫ్సీఐ కాలనీలో తలెత్తినటువంటి సమస్యలను స్వయంగా వెళ్లి పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, చైర్మెన్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సహకారంతో ఎఫ్సీఐ కాలనీలో తలెత్తినటువంటి డ్రైనేజీ మంచినీటి కొరత, రోడ్ల సమస్యలను విడతల వారిగా త్వరలోనే పరిష్కరిస్తామని, డ్రైనేజీ, మంజీర మంచినీటి వసతులను మెరుగుపరుస్తామని,మియాపూర్ డివిజన్లో ప్రతి కాలనీలో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని తెలిపారు, ముఖ్యంగా మియాపూర్ డివిజన్ ప్రజలకు అన్నివేళల్లో అందుబాటులో ఉండడం జరుగుతుందని, డివిజన్ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, మెరుగైన ప్రజా జీవనానికి అన్నిరకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషిచేస్తానని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్ గౌడ్, మియాపూర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుప్రజ, ఎఫ్సీఐ కాలనీ వాసులు వెంకటేశ్వర్ రావు, హరి కృష్ణ, రాశిల్, రామకృష్ణ, జితేందర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడికి సత్కారం

విశాలాంధ్ర - మొయినాబాద్ : బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా మొయినాబాద్ మండలానికి చెందిన గణేష్ కుండే నియమితులు కావడం ఈ మండలానికి ఆదర్శం అని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం అన్నారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బీజేపీ చేవెళ్ల ఓబీసీ కన్వీనర్ ఎలిగని వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన గణేష్ కుండేను అందరు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా గణేష్ కుండేను నియమించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్రావును చేవెళ్ల నియోజకవర్గం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులకు ప్రాధాన్యత : మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రామీణ ప్రాంతాలతో పాటు జిల్లా మండల కేంద్రాలలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్ణయం తీసుకున్నదని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి 163 నుంచి మదనపల్లి క్రాస్ రోడ్డు వరకు నాలుగు కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న రోడ్డు వెడల్పు, డివైడర్, సెంటర్ లైటింగ్ పనులను జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్‌లతో కలిసి మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయడమే కాకుండా ఇప్పటికీ రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించింద న్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నుండి పలు గ్రామాలకు వెళ్లే రహదారులను విస్తరించి పనులను పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. బతుకమ్మ పండుగ వరకు రోడ్డు పనులను, నాణ్యత లోపించకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ కమిషనర్ సంపత్, పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస్ జన్మదినోత్సవం

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర మఫిషియల్ కమిటీ కన్వీనర్ జి. శ్రీనివాస్‌ను సన్మానించిన జర్నలిస్టులు, యువతకు ఆదర్శప్రాయుడు, సమాజ సేవకుడు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పేపర్ శ్రీనివాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం శ్రీనివాస్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీనన్న యువసేన నాయకులు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేయడంతో పాటు మలయాళ స్వామి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. టియుడబ్ల్యూ జే ఐజేయు మఫిషియల్ కమిటీ కన్వీనర్ జీ. శ్రీనివాస్ ను స్థానిక జర్నలిస్టులు ప్రత్యేకంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి సన్మానం చేశారు. షాద్ నగర్ డివిజన్ లోని ఆరు మండలాల నుండి జర్నలిస్టులు పాల్గొని పేపర్ శ్రీనివాస్ ను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ...నా జన్మదినం పురస్కరించుకొని అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. యువత అభ్యున్నతి కోసం తాను ఎల్లప్పుడూ ముందుంటానని, పలువురికి ఆదర్శంగా నిలిచే విధంగా యువతను చైతన్యపరిచేందుకు కృషి చేయనున్నట్లు వివరించారు. తనపై అభిమానంతో వచ్చిన జర్నలిస్టులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి టి యు డబ్ల్యూ జే (ఐజేయు) ద్వారా తీసుకు వెళ్లేందుకు కృషి చేయనున్నట్లు వివరించారు. జర్నలిజం వృత్తిలో ఉంటూ సమాజ అభివృద్ధి కోసం తనవంతుగా కృషి చేస్తున్నానని అందులో భాగంగానే డివిజన్‌లోని జర్నలిస్టులకు ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎండి.ఫెరోస్ ఖాన్, నరసింహ, రాఘవేందర్ యాదవ్, పనింద్ర, భాస్కర్, రమేష్, ఇలియాజ్, అల్వాల దర్శన్,అనిల్, కృష్ణయ్య గౌడ్,సమీ, ఫయాజ్, మల్లికార్జున్, శంకర్, నీరటి శివకుమార్, సంతోష్, శ్రీనివాస్, అనిల్, శేఖర్,ఖాజా సోహెల్, కిరణ్,సవాళ్ల రాజు, శ్రీకాంత్, హరి జీవన్, అర్జున్, శివకుమార్ గౌడు, కార్తీక్,షకీల్, రియాజ్, శ్రవణ్ గౌడ్, పేపర్ శ్రీనివాస్ యువసేన సభ్యులు జరుపుల రాజు నాయక్, ఎండి అష్రఫ్, ప్రశాంత్, శేఖర్ యాదవ్, పట్నం కుమార్, తోకల నందు యాదవ్, శ్రీశైలం యాదవ్, చెరుకుపల్లి యాదయ్య, నర్సప్పగూడ శ్రీకృష్ణ,మల్లేష్, బైరంపల్లి ప్రసాద్, చిలకమర్రి రవి, బొట్టు శీను, గాలిగూడం కుమార్, కమ్మదనం శీను, పవన్, సిద్దు,మల్లేష్, జగన్, అనిల్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా తప్పుడు కేసులు : సుంకర నరేష్

విశాలాంధ్ర, బషీర్ బాగ్: పర్టెక్స్ వర్మా అనే రియల్టర్‌తో హైడ్రా కమిషనర్ రంగనాథ్ కుమ్మక్కయ్యి తనపై తప్పుడు కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని సామాజికవేత్త, హైకోర్ట్ సీనియర్ న్యాయవాది సుంకర నరేష్ అన్నారు. తాను ఫేక్ సర్టిఫికెట్స్ సమర్పించానని బార్ కౌన్సిల్ నుంచి సస్పెండ్ చేశారంటూ హైడ్రా కమిషనర్ పత్రికల్లో తప్పుడు ప్రకటనలు ఇప్పిస్తున్నారని ఆయన ఆరోపించారు. మంగళవారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడ మున్సిపాలిటీ , మంఖల్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 122, 136, 137 , 141 తన క్లయింట్ చైతన్య రెడ్డి (హనుమాన్ నిర్మాత) చెందిన 7 ఎకరాల 10 గుంటల స్థలంలో కొంత భాగాన్ని ఆక్రమించి పర్టెక్స్ వర్మ అనే రియల్టర్ రోడ్డు వేశాడని అన్నారు. ఈ విషయం ఒక యూట్యూబ్ ఛానల్‌లో ప్రసారం అయ్యి వైరల్ కావడంతో జీర్ణించుకోలేని పర్టెక్స్ వర్మ ల్యాండ్ సెటిల్మెంట్ కోసం తాను చైతన్య రెడ్డిని రూ.50 లక్షలు డిమాండ్ చేసినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రోద్బలంతో హైడ్రా ఏసీపీ తిరుమల్‌తో ఫిర్యాదు చేయించినట్లు తెలిపారు. ప్రస్తుతం చైతన్య రెడ్డి అజ్ఞాతంలో ఉన్నారని ఆమె బయటికి వస్తే నిజానిజాలు బయటపడతాయని పేర్కొన్నారు. హైడ్రా రంగనాథ్ వల్ల నాకు ప్రాణహాని ఉందని న్యాయవాది నరేష్ వెల్లడించారు.

మంచినీటి సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర-హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై పేజ్-1 పథకంలో భాగంగా ముర్మూర్, మల్లారం, కొండపాక పంపింగ్ స్టేషన్లలో 3000 మిమీ డయా ఎమ్.ఎస్. పంపింగ్ మెయిన్‌పై అమర్చబడిన 900 మిమీ డయా వాల్వులు మార్పిడి పనులు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి 11 గురువారం 6 గంటల వరకు ఈ పనులు జరుగుతాయి. రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జల మండలి అధికారులు తెలిపారు. ఓ అండ్ ఎం డివిజన్- 6 (ఎస్.ఆర్.నగర్): ఎస్.ఆర్.నగర్ సనత్‌నగర్, బోరబండ, ఎస్పీఆర్ హిల్స్, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, వెంకట్రావు నగర్, యెల్లారెడ్డిగూడ, సోమజిగూడ, ఫతేనగర్ సెక్షన్లు, జూబ్లీహిల్స్ కొంత భాగం, తాటిఖానా కొంత భాగం., ఓ అండ్ ఎం డివిజన్- 7: లాలాపేట్ కొంత భాగం, తార్నాకా కొంత భాగం.,ఓ అండ్ ఎం డివిజన్- 9: కుకట్‌పల్లి, భాగ్యనగర్, వివేకానందనగర్, యెల్లమ్మబండ, మూసాపేట్, భారత్‌నగర్, మోతీనగర్, గాయత్రీనగర్, బాబానగర్, కెపిహెచ్‌బి, బాలాజీనగర్, హష్మత్పేట్ సెక్షన్., ఓ అండ్ ఎం డివిజన్- 12: చింతల్, సుచిత్ర, జీడిమెట్ల, షాపూర్‌నగర్, గజులరామారం, సూరారం, ఆదర్శనగర్, భగత్‌సింగ్‌నగర్, జగద్గిరిగుట్ట, ఉషోదయ సెక్షన్., ఓ అండ్ ఎం డివిజన్- 8: అల్వాల్, ఫాదర్ బాలయ్యనగర్, వెంకటాపురం, మాచ్చబోలారం, డిఫెన్స్ కాలనీ, వాజ్‌పేయి నగర్, యాప్రాల్, చాణక్యపురి, గౌతమ్‌నగర్, సాయినాథ్‌పురం సెక్షన్, మౌలాలి రిజర్వాయర్., ఓ అండ్ ఎం డివిజన్- 14: (కాప్రా మున్సిపాలిటీ పరిధి): చర్ల పల్లి, సాయిబాబానగర్, రాధికా సెక్షన్లు, కైలాసగిరి పాత మరియు కొత్త రిజర్వాయర్ ప్రాంతాలు, హౌసింగ్ బోర్డు సెక్షన్, మల్లాపూర్ కొంత భాగం తదితర ప్రాంతాల్లో అంతరాయం ఏర్పాడనుంది. వినియోగదారులు నీటిని పొదుపుగా వినియోగించుకోగలరన్నారు.

అత్యధిక ప్రోటీన్‌తో 'ఆటా' విడుదల

హైదరాబాద్: భారతదేశపు నంబర్ వన్ ప్యాకేజ్డ్ ఆటా ఆశీర్వాద్ తమ కొత్త ఆవిష్కరణ 'అత్యధిక ప్రోటీన్ తో ఆశీర్వాద్ గోధుమపిండిని ప్రకటించింది. ఈ కొత్త ఆవిష్కరణ రోజూవారీ ప్రోటీన్ ఆవశ్యకత ఎక్కువమంది వినియోగదారులకు అందుబాటులో ఉంచే లక్ష్యాన్ని కలిగి ఉంది. శక్తి, ఉత్సాహం మరియు పూర్తి సంక్షేమాన్ని మద్దతు చేయడంలో ప్రోటీన్ బాధ్యతతో పాటు చైతన్యం పెరుగుతుండటంతో, తమ రోజూవారీ ప్రోటీన్ అవసరాలను నెరవేర్చడానికి భారతదేశపు వినియోగదారులు వివిధ మూలాధారాలను చురుకుగా కోరుకుంటున్నాయి. అయితే, నాణ్యతతో కూడిన ప్రోటీన్ ఆధారాలు వ్యయభరితంగా ఉండటం, సాంస్కృతిక ఆహారపు అలవాట్లు మొదలైన ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆశీర్వాద్ హై ప్రోటీన్ ఆటా ఇప్పటికే భారతీయుల నిత్య ఆహారంలో భాగంగా ఉన్న ' రోటీల' రూపంలో ప్రోటీన్ ఆవశ్యకతను చేర్చడానికి మరియు నెరవేర్చడానికి ఒక సరళమైన మార్గం.

మార్కెట్ నాయకునిగా, ఆశీర్వాద్ మార్కెట్ కు నిరంతరంగా కొత్త రకాలను తెస్తోంది మరియు ఆవిష్కరిస్తోంది, వినియోగదారుల వెసులుబాటుకు అనుగుణంగా సులభమైన మరియు హామీతో కూడిన పరిష్కారాలను అందిస్తోంది. ఈ కొత్త ఆఫరింగ్ ను ఎంతో ఆలోచనాత్మకంగా ఎంపిక చేసిన గోధుమ, 10 శాతం సోయా (పూర్తి ప్రోటీన్ కు మూలాధారం), శెనగలు, మరియు ఓట్స్ మిశ్రమంతో రూపొందించబడింది మరియు ప్రతి 100 గ్రాకి 15 గ్రా ప్రోటీన్ చొప్పున రోటీ యొక్క మృదుత్వం మరియు రుచిని నిలిపి ఉంచింది. ఈ పిండి నుండి రోజుకు కేవలం 3 రోటీలు తింటేనే రోజూవారీ ప్రోటీన్ ఆవశ్యకతలో 1/4వ వంతు నెరవేర్చడంలో సహాయపడగలదు అని ఐటీసీ లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్ ఆపరేటింగ్ ఆఫీసర్ అను రుస్తగి తెలిపారు. "గతంలో ప్రోటీన్ వినియోగం గురించి జిమ్ లకి వెళ్లేవారు, ఫిట్ నెస్ పట్ల ఆసక్తి గల వారికి లేదా పిల్లలకు ప్రోటీన్ అధికంగా గల ఆహారాన్ని ఇచ్చే తల్లులు వంటి పోషకాల-స్పృహ కలిగిన వ్యక్తులకు విలక్షణంగా ఉండేది. చురుకైన జీవనశైలిని నిర్వహించడానికి ప్రోటీన్ యొక్క ప్రాధాన్యత గురించి విస్తృత శ్రేణి వినియోగదారుల్లో పెరిగిన సంభాషణల వలన ఈ పరిస్థితి ఇప్పుడు మారింది. పోషకాల గురించి శ్రద్ధవహించడం అనేది ఇంటి నుండి ,ప్రతి భోజనంతో పాటు ప్రారంభమవుతుందని ఆశీర్వాద్ లో మేము విశ్వసిస్తాం అన్నారు. హై ప్రోటీన్ తో ఉన్న ఆశీర్వాద్ ఆటాతో తయారైన రోటీలు రాబోయే రోజుల్లో భారతదేశపు కుటుంబాల కోసం ప్రోటీన్ సమృద్ధిగా ఉన్న ఆహారంగా ఉపయోగపడుతుందని మేము ఆశిస్తున్నాం. హై ప్రోటీన్‌తో ఆశీర్వాద్ ఆటా ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలలోని ఇ-కామర్స్ ప్లాట్ ఫాంలలో 1 కేజీ మరియు 5 కేజీ లలో లభిస్తోందని చెప్పారు

కాంగ్రెస్ అహంకారానికి నిదర్శనం

- జైరాం రమేశ్ వ్యాఖ్యలపై మండిపడిన కేటీఆర్
- తమది తెలంగాణ ప్రజల ఏ-టీమ్ అని స్పష్టీకరణ

విశాలాంధ్ర-హైదరాబాద్ : దేశ రాజకీయాలు కేవలం రెండు పార్టీలకే పరిమితం అన్నట్లుగా కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. కాంగ్రెస్ పార్టీకి గల నిరంతర వైఫల్యాలకు ప్రధాన కారణం ఇదేనని అన్నారు. 'మాకు మద్దతివ్వకపోతే మీరు బీజేపీ పక్షాన ఉన్నట్లే' అనే అహంకారపూరిత వైఖరి దేశ రాజకీయాల్లో కాంగ్రెస్‌ను ఒంటరిని చేసిందని ఆయన ఘాటుగా విమర్శించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా కొన్ని పార్టీల వైఖరిపై జైరాం రమేశ్ చేసిన ట్వీట్‌కు కేటీఆర్ ఘాటుగా బదులిచ్చారు. దేశం ఒకప్పుడు ఉన్నట్లుగా ఇప్పుడు రెండు ముక్కల దేశం కాదని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ కాంగ్రెస్‌కు 'బీ-టీమ్' కాదని, బీజేపీకి కూడా 'బీ-టీమ్' కాదని తేల్చి చెప్పారు. తాము తెలంగాణ ప్రజల 'ఏ-టీమ్' అని ఉద్ఘాటించారు. ప్రాంతీయ పార్టీలను రాజకీయ ఆటల్లోకి లాగే బదులు, తమ పార్టీ ఎదుర్కొంటున్న వైఫల్యాలపై దృష్టి పెట్టాలని కేటీఆర్ జైరాం రమేశ్‌కు హితవు పలికారు. భారతదేశ రాజకీయాలు కేవలం కాంగ్రెస్, బీజేపీ మధ్యనే నడుస్తున్నట్లుగా భావించడం వారి వైఫల్యాలకు మరో ఉదాహరణ అని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజల శ్రేయస్సు, ఆకాంక్షలు, వారి గొంతుకగా దిల్లీలో నిలబడటమే తమ లక్ష్యమని కేటీఆర్ స్పష్టం చేస్తూ... దిల్లీలోని రాజకీయాల ఆటల్లో తాము భాగస్వాములం కాదని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం తప్పుడు విమర్శలు చేయడం మానుకుని, తమ పార్టీ పాలనాపరమైన, ఎన్నికల వైఫల్యాలపై కాంగ్రెస్ నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలని కేటీఆర్ సూచించారు.

గ్రూప్-1 కేసులో హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గుణపాఠం

గ్రూప్-1 కేసులో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచి గుణపాఠం అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కోర్టు తీర్పు తరువాత ఆయన స్పందిస్తూ నిరుద్యోగ ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రభుత్వం అవకతవకలకు పాల్పడిందని ఆరోపించారు. హైకోర్టు తీర్పు ప్రకారం, విద్యార్థులు కోరిన విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పీళ్లు, మళ్లీ కోర్టు కేసుల పేరు చెప్పి యువతకు అన్యాయం చేయొద్దని ప్రభుత్వానికి హితవు పలికారు. నిరుద్యోగ విద్యార్థులు కోరుతున్న తీరుగా మళ్లీ తిరిగి పరీక్షను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇన్ని రోజుల పాటు గ్రూప్-1 అభ్యర్థులు లేవనెత్తిన అంశాలను పట్టించుకోకుండా వారిపై అణచివేతకు పాల్పడిన రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని కోరారు.

శక్తివంతమైన సమాజం...ఉజ్వల భవిషత్ లక్ష్యం : అనిరుధ్ గుప్తా

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : శక్తివంతమైన సమాజం, ఉజ్వల భవిష్యత్తు అగర్వాల్ సమాజ్ లక్ష్యం అని తెలంగాణ అధ్యక్షులు అనిరుధ్ గుప్తా అన్నారు. ఈ లక్ష్యాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి, శక్తివంతమైన సమాజం, ఉజ్వల భవిష్యత్‌కు ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా ఒక భారీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. మంగళవారం జరిగిన అగర్వాల్ సమాజ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీని కింద సమాజంలోని యువకులు, పెద్దలందరినీ సమాజ్ సభ్యత్వంతో అనుసంధానిస్తున్నామన్నారు. ఈ భారీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బద్రీ విశాల్ జీ బన్సల్‌ను చైర్మన్‌గా శివ శంకర్ జీ అగర్వాల్‌ను చైర్మన్‌గా నియమించారు. అగర్వాల్ సోదర సోదరీమణులందరినీ వారి కుటుంబంలోని యువకులు, పెద్దలందరినీ అగర్వాల్ సమాజ్ సభ్యత్వంతో అనుసంధానించాలని అనిరుధ్ గుప్తా అభ్యర్థించారు. సమాజ ప్రగతి అందరి భాగస్వామ్యంలో ఉందని, సీనియర్ సభ్యుల విధేయత, సహకారం సంస్థకు బలాన్ని, గుర్తింపును ఇచ్చాయని అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షులు అనిరుధ్ గుప్తా వెల్లడించారు. నేడు అదే సంప్రదాయాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి కొత్త సభ్యులను చేర్చుకునే దిశగా పనిచేస్తోందన్నారు. ప్రతి వ్యక్తి తన పాత్రను పోషించి, ఒక వ్యవస్థీకృత, ప్రగతిశీల సమాజ నిర్మాణానికి దోహదపడాల్సిన సమయం ఇదని అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షులు అనిరుధ్ గుప్తా పేర్కొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న మల్లారెడ్డి కుటుంబం

విశాలాంధ్ర, మేడిపల్లి: మాజీ మంత్రివర్యులు మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి కలియుగ ప్రత్యక్ష దైవం తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకొని రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం ప్రత్యేక పూజలు చేశారు. వారితో పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి, పీర్జాదిగూడ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి మీసాలకృష్ణ, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, ఘట్కేసర్ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్, తదితరులు తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రత్యేక దర్శనం చేసుకొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఫిజియోథెరపీ కీలకం

విశాలాంధ్ర - మొయినాబాద్ : ప్రతి మానవుడికి ఫిజియోథెరపీ అనేది ఆరోగ్యకరమైన వైద్య సేవ అని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ ఫిజియోథెరపి దినోత్సవం సందర్భంగా హిమాయత్‌నగర్ సమీపంలోని యూనివర్సిటీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఫిజియోథెరపీ అనేది అందరి ఆరోగ్యానికి ఎంతో అవసరమన్నారు. ఫిజియోథెరపీ విధానం మందుల వినాయోగం లేకుండానే ఆరోగ్యాన్ని మెరుగువరుచుకోవడంలో ఎంతో ప్రభావితం చేస్తుందన్నారు. దీనిని ప్రొత్సహించేందుకే 1951లో సెప్టెంబర్ 8న ఫిజియోథెరపీ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దీని ద్వార వివిధ రకాల రుగ్మతులను చికిత్స పొందించాలనే ఉద్దేశంతో ఫిజియోథెరపీని వినియోగంలోకి తేవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డి, ప్రొఫెసర్ శంకర్ లింగం, రిజిస్ట్రార్ రవీందర్, పవన్కుమార్, సతీష్, ఏ.రాజు, గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సీఐఐ ఫ్లాగ్‌షిప్ ఈవెంట్

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) భారతదేశంలోనే అతిపెద్ద ఇంధన సామర్థ్యంపై సమావేశం, 24వ ఇంధన సామర్థ్యం సమ్మిట్‌ను 2025 సెప్టెంబర్ 16 నుంచి 18 వరకు హైదరాబాద్‌లోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో నిర్వహించనుంది. హైదరాబాద్‌లోని సీఐఐ-సోహ్రాబ్జీ గోద్రేజ్ గ్రీన్ బిజినెస్ సెంటర్ యొక్క ప్రధాన కార్యక్రమం, ఇంధన సామర్థ్యం పద్ధతులను ముందుకు తీసుకెళ్లడానికి భారతదేశం, విదేశాల నుండి ప్రధాన పరిశ్రమ సంఘాలు మరియు ప్రముఖ సంస్థలతో పాటు పరిశ్రమ నిపుణులు, నాయకులు, ప్రభుత్వం, విద్యావేత్తలు కలిసి ఒక ప్రధాన సమావేశం. "ఇంధన సామర్థ్యం ద్వారా తక్కువ కార్బన్ ఆర్థిక వ్యవస్థకు పరివర్తనను వేగవంతం చేయడం" అనే థీమ్‌తో ఈ సంవత్సరం జరిగే ఇంధన సామర్థ్యం సమ్మిట్ 2,500 ప్రతినిధులను ఒకచోట చేర్చి 100 ప్రముఖ వక్తలను కలిగి ఉంటుంది, 18 పరిశ్రమ రంగాలను కవర్ చేస్తుంది.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మాచర్ల వారి కోర్టులో

O.S. NO : 117/2024.

బిట్వీన్ :

నడ్డి పెద్దిరాజు తండ్రి పుల్లయ్య .... వాది

వర్సెస్,

కట్టెబోయిన అంజయ్య @ కొమ్మాలపాటి అంజయ్య, తండ్రి మల్లయ్య, వ్యాపారం, నివాసం పియ్యాపల్లి గ్రామం మరియు మండలం, నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం .... ప్రతివాది

పై నెంబరు దావాలో ప్రతివాదికి ఎన్నిసార్లు దావా సమను అందు నిమిత్తం సమన్లు పంపినను ప్రతివాదికి అందినట్లు కోర్టుకు తిరిగి రాలేదు. కావున ఈ పేపరు ప్రకటననే దావా సమనునుగా భావించి **ది.27-10-2025 న ఉదయం 10:30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట ప్రతివాది ప్రత్యక్షంగా గాని లేదా వకీలు గారి ద్వారా గాని హాజరై తన ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల ప్రతివాది పరోక్షమున పై దావాను శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

వాయిదా : 27-10-2025.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

గంగుల శ్రీనివాసరావు బి.ఏ, ఎల్.ఎల్.బి

న్యాయవాది, మాచర్ల - 522426.

సెల్ నెం : 9949436276, 6300668405.

నేపాల్ పరిణామాలు ఆందోళనకరం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

న్యూఢిల్లీ: నేపాల్‌లో హింసాత్మక నిరసనలు, రాజకీయ సంక్షోభం తదితర పరిణామాలపై సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రత్యేక సంఘటన కాదని... ఆందోళనకరమైన ప్రాంతీయ నమూనాలో భాగమని అభిప్రాయపడ్డారు. అవినీతి, ఉన్నత వర్గాల దురహంకారం, ప్రజల గొంతుల్ని అణచివేయడం వంటి సారూప్య రాజకీయ, ఆర్థిక సంక్షోభాలు ఇప్పటికే శ్రీలంక, బంగ్లాదేశ్‌ను కదిలించాయని...ఇప్పుడు నేపాల్ కూడా అదే పరిస్థితి ఎదుర్కొంటోందన్నారు. నిరంకుశ చర్యలు, లోతుగా పాతుకుపోయిన అవినీతి కారణంగా నేపాల్‌లో జరిగిన సామూహిక నిరసనలు... ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం కోల్పోతున్న ప్రజాగ్రహాన్ని ప్రతిబింబిస్తాయని తెలిపారు. నేపాలీ కమ్యూనిస్టులు రాజులకు వ్యతిరేకంగా పోరాడి ప్రజాస్వామ్య పురోగతిని సాధించారని, ప్రజలలో అపార గౌరవం, నమ్మకాన్ని సంపాదించారని నారాయణ గుర్తు చేశారు. కానీ నేడు అంతర్గత విభజనలు, నాయకత్వ వైఫల్యాలు, విశ్వాసాన్ని ప్రేరేపించలేకపోవడం వల్ల నేపాల్‌లో కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడుతోందని... ఇది మితవాద శక్తులు, ప్రతిఘాత శక్తులు పరిస్థితిని ఉపయోగించుకోవడానికి అవకాశం కల్పిస్తుందని ఆయన హెచ్చరించారు. మితవాదశక్తులు విభజన రాజకీయాలు, ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలపై వర్ధిల్లుతున్నందున ఇది నేపాల్‌కు మాత్రమే కాకుండా మొత్తం ప్రాంతానికి తీవ్రమైన ఎదురుదెబ్బ అని ఆయన అన్నారు. దక్షిణాసియా అంతటా కమ్యూనిస్టులకు ఒక పాఠమని స్పష్టమవుతోందన్నారు. ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందడానికి, మితవాద శక్తులు ప్రజల అసంతృప్తిని హైజాక్ చేయకుండా నిరోధించడానికి అవినీతి, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐక్యత, సమగ్రత, స్థిరమైన పోరాటం చాలా అవసరమని నారాయణ స్పష్టం చేశారు.

సీపీఐ బీహార్ రాష్ట్ర మహాసభలు ప్రారంభం

పట్నా: భారత కమ్యూనిస్టు పార్టీ 25వ బీహార్ రాష్ట్ర మహాసభలు పట్నాలో ప్రారంభమయ్యాయి. పార్టీ జెండాను సీపీఐ జాతీయ కార్యదర్శి నాగేంద్రనాథ్ ఓఝూ ఆవిష్కరించారు. మహాసభలకు పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి గిరీశ్ చంద్ర శర్మ, రాష్ట్ర కార్యదర్శి రామ్ నరేశ్ పాండే, రాష్ట్ర నాయకులు, పార్టీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బీహార్‌లో ప్రజల హక్కులను కాపాడటానికి , ప్రగతిశీల, ప్రజాస్వామ్య బీహార్ నిర్మాణానికి ఉద్యమ కార్యాచరణపై ఈ మహాసభల్లో చర్చించనున్నారు.

ప్రపంచ ఫాసిస్ట్ వ్యతిరేక యుద్ధ వార్షికోత్సవం

జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా చైనా ప్రజల ప్రతిఘటన యుద్ధం, ప్రపంచ ఫాసిస్ట్ వ్యతిరేక యుద్ధం 80వ వార్షికోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని చైనా రాయబార కార్యాలయంలో జరిగిన సెమినార్‌లో సీపీఐ జాతీయ కార్యదర్శి, ప్రపంచ శాంతి మండలి అధ్యక్షుడు పల్లవ్ సేన్‌గుప్తా రాయబారి జు ఫీహాంగ్, ఇతర ప్రముఖులతో కలిసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా కూడా పాల్గొన్నారు.

రాధాకృష్ణన్‌కు చంద్రబాబు, లోకేశ్ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ఎన్‌డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలియజేశారు. చంద్రబాబు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తూ రాధాకృష్ణన్ విశాలమైన జ్ఞానం, అనుభవంతో ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. రాధాకృష్ణన్‌కు మంత్రి నారా లోకేశ్ ఫోన్ చేసి అభినందనలు తెలియజేశారు.

'డిజిటల్ అరెస్ట్' వలలో మాజీ ఎమ్మెల్యే

బెంగళూరు: 'డిజిటల్ అరెస్ట్' బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. సామాన్యులే కాకుండా విద్యావంతులు, సమాజంలో పలుకుబడి ఉన్న వ్యక్తులూ వీటి బారిన పడుతున్నారు. తాజాగా కర్నాటకకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే కూడా సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు చిక్కారు. ఆయనను బెదిరించి ఎనిమిది రోజుల్లో రూ.30.99 లక్షలు దోచుకున్నారు. బీదర్ జిల్లాలోని ఔరద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గుండప్ప వకీల్‌కు ఆగస్టు 12న సీబీఐ అధికారినంటూ ఓ ఫోన్‌కాల్ వచ్చింది. మనీలాండరింగ్ కేసులో ఓ నిందితుడిని అరెస్టు చేయగా అతడి వద్ద మాజీ ఎమ్మెల్యే బ్యాంకు అకౌంట్ వివరాలు, ఏటీఎం కార్డు దొరికాయని చెప్పాడు. ఏ క్షణంలోనైనా అరెస్టు చేయవచ్చంటూ వకీల్‌ను హెచ్చరించాడు. కాసేపటికి మరో వ్యక్తి ఫోన్ చేసి దర్యాప్తు అధికారినంటూ వకీల్‌ను సంప్రదించాడు. ఆయన వ్యక్తిగత, ఆస్తి వివరాలు తీసుకున్నాడు. అనంతరం వకీల్‌ను డిజిటల్ అరెస్ట్ చేస్తున్నట్లు చెప్పాడు. మరుసటి రోజు వకీల్‌కు వీడియో కాల్ చేసి ఆన్‌లైన్‌లో నకిలీ కోర్టును, న్యాయమూర్తిగా ఒకరిని చూపించి నమ్మించారు. నకిలీ న్యాయమూర్తిగా ఉన్న వ్యక్తి వకీల్ నిర్దోషిగా పేర్కొంటూ ఓ ఒప్పందంపై సంతకం చేయాలని ఆదేశించాడు. ఆ తతంగం తర్వాత సెక్యూరిటీ డిపాజిట్ కింద ఆర్‌టీజీఎస్ ద్వారా రూ.10 లక్షలు బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాలని ఆదేశించాడు. దర్యాప్తు తర్వాత ఇచ్చిన సొమ్ము తిరిగి వస్తుందని హామీ ఇచ్చాడు. దాదాపు ఎనిమిది రోజులు వకీల్‌ను డిజిటల్ అరెస్ట్ చేశారు. సైబర్ నేరగాళ్లు అయన నుంచి రూ. 30.99 లక్షలను పలు దఫాలుగా బదిలీ చేయించుకున్నారు. ఇచ్చిన డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన మాజీ ఎమ్మెల్యే... సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

'సూపర్ సిక్స్-సూపర్ హిట్'కు సర్వం సిద్ధం

నేడు అనంతలో భారీ బహిరంగ సభ

హాజరు కానున్న చంద్రబాబు, పవన్, మాధవ్

విశాలాంధ్ర - సచివాలయం: సూపర్ సిక్స్-సూపర్ హిట్ పేరుతో కూటమి ప్రభుత్వం బుధవారం అనంతపురంలో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి పార్టీ పేరుతో నిర్వహిస్తున్న సభ కావడంతో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సభకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కూడా హాజరు కానున్నారు. సూపర్ సిక్స్-సూపర్‌హిట్ పేరిట కూటమి ప్రభుత్వం ఉమ్మడి సభ నిర్వహించనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదిహేను నెలల్లో తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధిపై ప్రజలకు వివరించనున్నారు. టీడీపీ ముఖ్య నేతలు ఇప్పటికే ఈ సభ కోసం అనంతపురానికి చేరుకున్నారు. సభకు భారీగా ఏర్పాట్లు చేశారు. కూటమి జెండాలతో అనంతపురం రెపరెపలాడుతోంది. ప్రజలు పెద్దఎత్తున సభకు హాజరవుతారని నాయకులు భావిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు సభ ఏర్పాట్లపై పర్యవేక్షణ చేస్తున్నారు. అనంతపురంలోని ఇంద్రప్రస్థ నగర్‌లో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభా వేదికపై 250 మంది కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. సభకు వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది తరలి వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేశారు. టీడీపీ నేతలు, ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సభకు ప్రజల రవాణా కోసం 3,050 బస్సులు ఏర్పాటు చేశారు. జోన్-4 నుంచి 2,300, జోన్-3 నుంచి 750 బస్సులు, అదనంగా 500 ప్రైవేట్ బస్సులు సిద్ధం చేశారు. భద్రతా ఏర్పాట్లను హోంశాఖ మంత్రి అనిత దగ్గరుండి పర్యవేక్షించారు. డ్రోన్ వ్యవస్థ ద్వారా తొలిసారిగా భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. కూటమి అధికారంలోకి వచ్చాక మూడు పార్టీలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న తొలి సభ ఇదే కావడంతో దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. సభా వేదిక నుంచి కూటమి ప్రభుత్వం 15 నెలల్లో తీసుకున్న కీలక నిర్ణయాలు, రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చుతో సూపర్‌సిక్స్ హామీల అమలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించనున్నారు. రానున్న మూడున్నర ఏళ్లలో చేపట్టబోయే కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వెల్లడించనున్నారు.

కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో లోకేశ్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో లోకేశ్ మంగళవారం ఢిల్లీ వెళ్లారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని లోకేశ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఏపీలో 15 నెలలుగా కూటమి పాలనలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను లోకేశ్ వివరించారు. కేంద్ర జలశక్తి శాఖ తరపున ఏపీకి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. పోటీచేసిన తొలి ఎన్నిక నుంచి పాటిల్ నాలుగు విడతలుగా అంతకంతకు మెజారిటీ పెంచుకుంటూ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేయడంపై మంత్రి లోకేశ్ అభినందించారు. ఇంతలా ప్రజల అభిమానాన్ని చూరగొనడం వెనుక విజయ రహస్యం ఏమిటని లోకేశ్ అడిగారు. అనునిత్యం ప్రజలతో మమేకం అవుతూ... వారితోనే ఉండటమే తన విజయ రహస్యమని కేంద్ర మంత్రి చెప్పారు. పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాల అమలుతో పాటు నవసారీని దేశంలోనే మొదటి 'స్మోక్‌లెస్ జిల్లా' గా తీర్చిదిద్దానంటూ ఆయన చేసిన పనులను లోకేశ్‌కు వివరించారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మనుమడికి ఆశీస్సులు

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలోని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు నివాసానికి వెళ్లారు. రామ్మోహన్ నాయుడు, శ్రావ్య దంపతులకు ఇటీవల జన్మించిన కుమారుడిని లోకేశ్ ఆశీర్వదించారు. బాబును ఎత్తుకొని ముద్దాడారు. అక్కడే ఉన్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి సతీమణి బండారు మాధవీలతని క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు.

నిర్లక్ష్య వైద్యానికి రూ.10 లక్షల జరిమానా

న్యూఢిల్లీ: రెండు దశాబ్దాల క్రితం నాటి ఓ మహిళా రోగి మృతి కేసులో వైద్యుల నిర్లక్ష్యం ఉందని తమిళనాడు వినియోగదారుల కమిషన్ తేల్చింది. దీనికిగాను బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. 2005లో చెన్నైకు చెందిన దేవేంద్రం (38) అనే మహిళ ముక్కు దిబ్బడ, తలనొప్పి సమస్యతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. వైద్యబృందం సలహా మేరకు ఎండోస్కోపీ నిర్వహించిన అనంతరం ఆమెను ఐసీయూకు తరలించారు. ఈ క్రమంలోనే బ్రెయిన్ డెడ్ కావడంతోపాటు హృదయ సమస్యలు తలెత్తాయి. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. చికిత్స విషయంలో ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆమె భర్త భోజయ్య ఆరోపించారు. ప్రాథమిక పరీక్షలు చేయలేదని, తక్కువ హిమోగ్లోబిన్, మధుమేహం సమస్యలను పట్టించుకోలేదని, అల్పాహారం తీసుకున్న వెంటనే అనస్థీషియా ఇచ్చారని ఆరోపిస్తూ... ఆస్పత్రిపై కేసు దాఖలు చేశారు. సంబంధిత వైద్యులు కన్సల్టెంట్లు కాబట్టి వారిదే బాధ్యత అని ఆస్పత్రివర్గాలు వాదించాయి. తమ నిర్లక్ష్యం వల్ల కాదని, బ్రెయిన్ ట్యూమర్ వల్లే ఆమె మృతి చెందినట్లు చికిత్స చేసిన వైద్యులు పేర్కొన్నారు. అయితే, సరైన చికిత్స విధానాలు పాటించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని కమిషన్ గుర్తించింది. ఆమెకు వైద్యం చేసిన ముగ్గురు డాక్టర్లలో ఒకరు ఇప్పటికే మృతి చెందిన నేపథ్యంలో... మిగతా ఇద్దరిని బాధ్యులుగా నిర్ధారించింది. మృతురాలి కుటుంబానికి ఎనిమిది వారాల్లోపు రూ.10 లక్షల పరిహారం, కోర్టు ఖర్చుల కింద రూ.50 వేలు అదనంగా చెల్లించాలని ఆదేశించింది.

కేంద్ర మంత్రినంటూ గవర్నర్‌కు ఫోన్

బెంగళూరు: సాంకేతికతను ఆసరాగా చేసుకొని కొందరు ఆకతాయిలు సమాజంలో ఉన్నతస్థాయిలో ఉన్న వారి పేర్లతో ఫోన్ కాల్స్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. మూడు రోజుల కిందట గుర్తుతెలియని వ్యక్తి... కేంద్రమంత్రినంటూ కర్నాటక గవర్నర్‌ను ఫోన్‌కాల్‌తో మోసం చేయడానికి ప్రయత్నించాడని రాజ్‌భవన్‌లోని అధికారిక వర్గాలు వెల్లడించాయి. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌నంటూ ఓ అజ్ఞాత వ్యక్తి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాత్‌కు శనివారం సాయంత్రం ఫోన్ చేశాడు. తనని కేంద్ర మంత్రిగా పరిచయం చేసుకుంటూ ఓ పని విషయంలో సహకారం కావాలని కోరాడు. దీనిపై సందేహం వచ్చిన గవర్నర్ ఏదో తప్పు జరుగుతోందని భావించి... తదుపరి కాల్ వచ్చే వరకు వేచి చూద్దామనుకున్నారు. ఆ వ్యక్తి నుంచి మళ్లీ ఫోన్ కాల్ రాలేదు. దాంతో గవర్నర్ కేంద్రమంత్రి కార్యాలయంలో ఆరా తీస్తే... ధర్మేంద్ర ప్రధాన్ కార్యాలయం అలాంటి ఫోన్ కాల్ చేయలేదని చెప్పింది. వెంటనే అప్రమత్తమైన గవర్నర్... పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై దర్యాప్తు చేయాలని ఆదేశించారు. ప్రాథమిక దర్యాప్తులో ఆ ఫోన్‌కాల్ కోల్‌కతా నుంచి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఆ వ్యక్తిని గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

వివేకా కేసుపై సీబీఐ ఊగిసలాట

- లోతైన దర్యాప్తు నిర్ణయంపై సమయం కోరిన అధికారులు
- ఈ నెల 16కి విచారణ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఇంకా ఊగిసలాట ధోరణిలో ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఈ హత్య కేసు ఆరు సంవత్సరాలు దాటినా ఇంతవరకు ఒక కొలిక్కి రాలేదు. తెలంగాణ హైకోర్టు ఈ కేసులో నిందితులుగా ఉన్న ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి సహా ఇతరులకు బెయిల్ ఇచ్చింది. ఈ బెయిల్ రద్దు చేయాలంటూ వివేకా కుమార్తె సునీత సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో సుప్రీం కోర్టు సీబీఐ అభిప్రాయం కోరింది. వివేకా కేసులో దర్యాప్తు ముగిసిందని, కోర్టు కోరితే మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తామని సీబీఐ తెలిపింది. అయితే అసలు వివేకా కేసులో మరింత దర్యాప్తు అవసరమా ? కాదా ? చెప్పాలని సీబీఐని సుప్రీం ఆదేశించింది. ఈ నేపథ్యంలో మంగళవారం మరోసారి వివేకా కేసు విచారణ సుప్రీం కోర్టులో జస్టిస్ సుందరేశ్ బెంచ్ ముందుకు వచ్చింది. సీబీఐ తరపున హాజరయిన అడ్వకేట్ జనరల్ ఎస్వీ రాజు ఈ కేసులో మరింత దర్యాప్తు అవసరమా కాదా అనేది చెప్పేందుకు ఇంకా సమయం కావాలని కోరారు. దీంతో అత్యున్నత న్యాయస్థానం చేసేది లేక మరో వారం పాటు విచారణను వాయిదా వేస్తూ ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటలకు ఈ కేసు విచారణ చేస్తామని ప్రకటించింది. ఇప్పటికే ఈ కేసులో నిందితులకు కేంద్రం అండదండలు ఉండటంతో సీబీఐ ముందుకెళ్లలేకపోతోందన్న ఆరోపణల నేపథ్యంలో తదుపరి దర్యాప్తుపై తేల్చేందుకు మరింత సమయం కోరడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆరోగ్య శాఖ డిజిటలైజేషన్‌కు జాతీయ స్థాయి గుర్తింపు: మంత్రి సత్యకుమార్

విశాలాంధ్ర-సచివాలయం: రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డిజిటలైజేషన్ సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ రంగంలో స్ఫూర్తిగా ఉన్న డెన్మార్క్ ప్రభుత్వమిచ్చే శిక్షణా కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం 4 రాష్ట్రాల ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) మిషన్ డైరెక్టర్లను ఎంపిక చేయగా, వీరిలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఏబీడీఎం మిషన్ డైరెక్టర్ జి.వీరపాండియన్ కూడా ఉన్నారు. అసోం, జమ్మూకశ్మీర్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల అధికారులు వీరపాండియన్‌తో కలిసి డెన్మార్క్ వెళ్లనున్నారు. అక్టోబరు 1 నుంచి 31 వరకు వీరికి శిక్షణ ఇవ్వనుంది. ప్రజారోగ్య సంరక్షణలో డిజిటలైజేషన్, సమాచార సేకరణ, వినియోగాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2021లో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌ను ప్రారంభించింది. డిజిటల్ హెల్త్ మిషన్‌ను అమలు చేయడంలో ముందంజలో ఉంది. ఇప్పటి వరకు దీని అమలులో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వాసు పత్రులకు రూ.20 కోట్లు ప్రోత్సాకాలు, రాష్ట్ర ప్రభుత్వం డిజిటలైజేషన్ కార్యక్రమం క్రింద రూ.16 కోట్లు అందుకుంది. రాష్ట్రంలో 4.66 కోట్ల మందికి అభా నంబర్లు నమోదు చేశారు. ఈ సంఖ్య రాష్ట్ర జనాభాలో 92.04 శాతం. దేశంలో ఈ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ స్థానాన్ని సాధించింది. 6.92 కోట్ల ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను నమోదు చేయడం ద్వారా రాష్ట్రం దేశంలో రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. 63,340 మంది వైద్యులు, వైద్య సిబ్బందికి హెచ్‌పీఆర్ నమోదు చేయడం ద్వారా దేశంలో మూడో స్థానంలో రాష్ట్రం నిలిచింది. 21,936 ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలకు హెచ్‌ఎఫ్ఆర్ నమోదు చేసి దేశంలో ఐదో స్థానాన్ని రాష్ట్రం పొందింది. 2.07 కోట్ల మేర స్కాన్ అండ్ షేర్ ద్వారా రోగులు ఎక్కువ సమయం క్యూ లైన్‌లో నిల్చోకుండా జారీ చేయడంలో మూడో స్థానంలో నిలిచింది.

సమాజానికి ఉపయుక్తంగా వార్తలు

విశాలాంధ్ర విలేకరుల శిక్షణా శిబిరంలో ఐవీ సుబ్బారావు

విశాలాంధ్ర-విశాఖ సిటీ: వార్తలు ప్రజలకు, సమాజానికి ఉపయుక్తంగా నిలవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ ప్లాటినం జూబ్లీ హాల్లో మూడు రోజులపాటు ఉత్తరాంధ్ర జిల్లాల విశాలాంధ్ర విలేకరుల శిక్షణా శిబిరం మంగళవారం నిర్వహించారు. విశాఖ జిల్లా బ్యూరో పి.రామకృష్ణ స్వాగతం పలుకగా ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ విశాలాంధ్ర నిబద్ధత గల పత్రిక అని, సర్క్యులేషన్‌తో సంబంధం లేకుండా విశాలాంధ్ర వార్తలు ప్రజలకు చేరువవుతున్నాయన్నారు. విశాలాంధ్ర పత్రికలో పనిచేస్తున్న విలేకరులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. చదవటం, నడవటం (స్టడీ అండ్ ఫుట్ వర్క్) అలవాటు ఉన్న జర్నలిస్టులు ఉన్నతంగా రాణిస్తారని సూచించారు. సోషల్ మీడియాపై పూర్తిగా ఆధారపడి వార్తలు రాయరాదన్నారు. తెలుసుకోవాలన్న తపనతో ముందుకు సాగాలన్నారు. జర్నలిజానికి, జర్నలిస్టులకు ఎన్నటికీ చావు లేదన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఐజేయూ నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. జర్నలిస్టుల ఆరోగ్య బీమాను ప్రభుత్వం పరిశీలిస్తోందని, జర్నలిస్టులకు ఇళ్ల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం నియమించిందన్నారు. నేరవార్తలు, ప్రత్యేక కథనాలు, రాజకీయ వార్తలు ఎలా రాయాలో విలేకరులకు వివరించారు. మరో ముఖ్య అతిథి విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి.హరినాథ రెడ్డి మాట్లాడుతూ పత్రికా రంగంలో విశాలాంధ్ర నిర్వహిస్తున్న పాత్రను వివరించారు. ప్రజా సంఘాల ఏర్పాటు, ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో విశాలాంధ్ర విలేకరులు వృత్తి నైపుణ్యం పెంపొందించుకొని పనిచేయాలని సూచించారు. విశిష్ట అతిథి ఐజేయూ నాయకుడు నల్లి ధర్మారావు మాట్లాడుతూ విశాలాంధ్రకు, కళింగాంధ్రకు ఉన్న సంబంధాన్ని వివరించారు. ఉత్తరాంధ్ర పత్రికా రంగానికి ఎనలేని తోడ్పాటునందిస్తుందని, అనేక పత్రికల స్థాపనకు ఉత్తరాంధ్ర జిల్లాలే కేంద్రంగా మారాయన్నారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్షేత్రపాల్ రెడ్డి మాట్లాడుతూ నీలి జర్నలిజం, ఎల్లో జర్నలిజం కొనసాగుతున్న ఈ రోజుల్లో ప్రత్యామ్నాయ జర్నలిజంగా విశాలాంధ్ర పత్రిక నిలుస్తోందన్నారు. విశాలాంధ్ర విశాఖ ఎడిషన్ మేనేజర్ సనపల నర్సింహులు, ఆరు జిల్లాల బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, ఉత్తరాంధ్ర జిల్లాల విలేకరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు 400 మంది ఇస్రో శాస్త్రవేత్తల సేవలు

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో 400 మంది శాస్త్రవేత్తలు నిరంతరం పనిచేసినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ వి.నారాయణన్ చెప్పారు. ఎర్త్ అబ్జర్వేషన్, కమ్యూనికేషన్ శాటిలైట్ల పనితీరును పరిశీలిస్తూ... జాతీయ భద్రత అవసరాలకు అనుగుణంగా ఉపగ్రహాల సమాచారాన్ని అందించినట్లు చెప్పారు. ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 52వ జాతీయ మేనేజ్‌మెంట్ కన్వెన్షన్‌లో ప్రసంగిస్తూ ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో అన్ని ఉపగ్రహాలు నిరంతరం కచ్చితత్వంతో పనిచేశాయి. అవసరమైన సమాచారం అందించాయి. 400లకు పైగా శాస్త్రవేత్తలు 24×7, పూర్తి సమయం పనిచేశారు. భూ పరిశీలన, కమ్యూనికేషన్‌కు సంబంధించిన ఉపగ్రహాలన్నీ సంపూర్ణ సేవలందించాయి' అని ఆయన చెప్పారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటివరకు 7700 క్షేత్రస్థాయి పరీక్షలు పూర్తిచేశామన్నారు. మరో 2300 పరీక్షలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జాతీయ భద్రత, సరిహద్దు సంక్షోభం వంటి సమయాల్లో అంతరిక్ష రంగం కీలకంగా వ్యవహరిస్తుందన్న విషయం ఆపరేషన్ సిందూర్ సమయంలో మరోసారి స్పష్టమైందన్నారు. ఆ సమయంలో విస్తృతంగా డ్రోన్లు, మందుగుండు సామగ్రి భారీస్థాయిలో వినియోగించడం, దేశీయంగా అభివృద్ధి చేసిన ఆకాశ్‌తీర్ వంటి రక్షణ వ్యవస్థ సామర్థ్యాలను పరిశీలించడంలోనూ ఇస్రో ప్రముఖ పాత్ర పోషించింది.

టారిఫ్‌లపై భారత్ దిగిరాక తప్పదు

ట్రంప్ సలహాదారు నవారో

వాషింగ్టన్: ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో భారత్?పై మరోసారి తన అక్కసును వెళ్లగక్కారు. అమెరికాతో వాణిజ్య చర్చలపై భారత్ ఏదో ఒక సమయంలో దిగిరాక తప్పదంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటంపై భారత్‌ను లక్ష్యంగా చేసుకొని మాట్లాడారు. భారత్... అమెరికా దిగుమతులపై అత్యధిక సుంకాలు విధిస్తోందని నవారో ఆరోపించారు. ఏ దేశం వేయనంత భారీ టారిఫ్‌లను తాము ఎదుర్కోవాల్సి వస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన బ్రిక్స్ దేశాలను లక్ష్యంగా చేసుకొని మాట్లాడారు. బ్రిక్స్ కూటమి ఎక్కువకాలం కొనసాగదని, వారంతా ఒకరినొకరు దూషించుకుంటారని చెప్పారు. అయినా సరే... వారంతా ఎలా కలిసి ఉంటున్నారో తనకు అర్థం కావడంలేదని నవారో అన్నారు. బ్రిక్స్ సమూహంలోని ఏ దేశాలు కూడా అమెరికాకు ఎగుమతి చేయకపోతే మనుగడ సాధించలేవన్నారు. ఎగుమతి చేసే క్రమంలో అన్యాయమైన వాణిజ్య పద్ధతులతో రక్తం పీల్చుకునే పిశాచుల్లాగా వ్యవహరిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "భారత్ దశాబ్దాలుగా చైనాతో యుద్ధం చేస్తోంది. పాకిస్థాన్‌కు అణుబాంబు ఇచ్చింది కూడా చైనాయే. ఇపుడు రష్యా, చైనా దేశాలు కలిసి ఉన్నాయి. రష్యా వ్లాదివోస్టాక్ ఓడరేవుపై బీజింగ్ దృష్టి సారించింది.

భారీగా పెరిగిన బంగారం ధర



న్యూఢిల్లీ: పసిడి ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. తాజాగా ఒకేరోజు రూ.5 వేలకుపైగా పెరిగి తొలిసారిగా జీవిత కాల గరిష్ఠానికి చేరాయి. దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం 24 క్యారెట్ల బంగారం ధర రూ.5,080 పెరిగి తులానికి రూ.1,12,750కి చేరింది. డాలర్ బలహీన పడడంతో బంగారానికి డిమాండ్ పెరిగిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. వెండి ధరలు సైతం భారీగానే పెరిగాయి. రూ.2,800 పెరిగి కిలోకు రూ.1,28,800 పెరిగి రికార్డుస్థాయికి చేరుకుంది. ప్రపంచ మార్కెట్లలో పసిడి మంగళవారం ఔన్సుకు 3,659.27 డాలర్లకు చేరి జీవితకాల గరిష్ఠానికి చేరింది. ఆ తర్వాత స్వల్పంగా తగ్గి 3,652.72 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది. అమెరికా డాలర్ బలహీనపడడం... త్వరలో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించనుందన్న అంచనాల మధ్య బంగారం వంటి సురక్షితమైన ఆస్తులపై పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నట్లు వ్యాపారులు పేర్కొన్నారు. ఎంసీఎక్స్‌లో ప్రారంభంలో బంగారం, వెండి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో అక్టోబర్ ఫ్యూచర్ గోల్డ్ తులానికి రూ.429 లాభంతో రూ.1,08,947 వద్ద మొదలైంది. ఇదే క్రమంలో రూ.1,09,500 గరిష్ఠాన్ని తాకింది. కామెక్స్‌లో బంగారం 0.50 శాతం లాభంతో 3654 డాలర్ల వద్ద... ఎంసీఎక్స్‌లో 0.69 శాతం లాభాలతో రూ.1,09,250 వద్ద ట్రేడ్ అయింది. హైదరాబాద్‌లో బంగారం ధరలు పరిశీలిస్తే... 24 క్యారెట్ల బంగారం రూ.1,10,290 ఉండగా... 22 క్యారెట్ల బంగారం రూ.1,01,100 వద్ద ట్రేడయింది. వెండి ధర కిలోకు రూ.1.40 లక్షలకు పెరిగింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.